ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 3, ఏప్రిల్ 2025



పీసీపల్లి మండలం దివాకరపల్లి వద్ద రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మంత్రులు రవికుమార్, స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర, కలెక్టర్ అన్సారియా, ఇతర ప్రతినిధులు


దివాకరపల్లి వద్ద సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఉమ్మడి ప్రకాశం జిల్లాపై తనకున్న అభిమానాన్ని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మరోసారి చాటుకున్నారు. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తామన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతానని తెలిపారు. అందుకు బుధవారం కనిగిరి నియోజకవర్గంలో బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన నాంది మాత్రమేనన్నారు. ప్రాధాన్యతా క్రమంలో మిగిలిన వాటిని కూడా చేపడతామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, కనిగిరిలో ట్రిపుల్ ఐటీని నిర్మిస్తామని, పశ్చిమ ప్రాంతంలో మరిన్ని బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. దర్శి నుంచి పాముూరు వరకు నిర్మిస్తున్న రైల్వేలైన్ ఆగస్టులో ప్రారంభిస్తామని ప్రకటించారు. దివాకరపల్లి పరిధిలోని కొండ ప్రాంతంలో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్‌కు లోకేష్ భూమిపూజ చేయగా.. జనం అశేషంగా తరలివచ్చారు. ఆయనకు ఘనస్వాగతం పలికారు.

ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతాం

సీబీజీ ప్లాంట్ నాంది మాత్రమే..

ప్రకాశం నాకు ప్రత్యేకం


ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి లోకేష్


బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి లోకేశ్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరి నియోజకవర్గంలో బుధవారం పండుగ వాతావరణం నెలకొంది. పీసీపల్లి మండలం దివాకరపల్లి వద్ద రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్(సీబీజీ) ప్లాంట్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి సంబంధించి యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతామని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి వ్యతిరేక గాలిలో కూడా నలుగురు ఎమ్మెల్యేలను ఈ జిల్లాలో గెలిపించారని గుర్తుచేశారు. 2020-22లో ఒంగోలులో జరిగిన మహానాడు రాష్ట్ర రాజకీయ మలుపునకు నాంది అయిందని తెలిపారు. ఆ తర్వాత యువగళం పాదయాత్ర ఒక ప్రభంజనంలా నిర్వహించి జిల్లా ప్రజలు పార్టీకి మరింత ఉత్సాహాన్ని తెచ్చారన్నారు. గత ఎన్నికల్లో పది స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి మంచి విజయాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. ఇవేమీ తాను మర్చిపోనని అందుకే గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు

మిగతా 6వ పేజీలో

ఒంగోలు మహానాడుతో పార్టీకి ఊపు
జిల్లాలో యువగళం ఓ ప్రభంజనం

- ఎదురుగాలిలోనూ నలుగురిని గెలిపించిన చరిత్ర జిల్లాది
- ప్రభుత్వ ప్రాజెక్టుల ప్రాధాన్యతలో వెలిగొండ
- కనిగిరిలో ట్రిపుల్ ఐటీ.. ఆగస్టులో రైల్వే లైను ప్రారంభం
- పశ్చిమప్రాంతంలో భారీగా బయోగ్యాస్ ప్లాంట్లు
- మంత్రులు రవి, స్వామిలకు ప్రశంసలు
- జిల్లాపై ప్రత్యేక అభిమానాన్ని ప్రదర్శించిన లోకేష్
- ఘనంగా రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ
- కొండ ప్రాంతానికి తరలివచ్చిన జనసందోహం

వెలిగొండను పూర్తిచేస్తాం

ప్రకాశం, అనంతపురం, కడప జిల్లాల్లో ఐదు లక్షల ఎకరాల బీడు భూములను పారిశ్రామికంగా వినియోగంలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు లోకేష్ తెలిపారు. సభికుల నుంచి వెలిగొండ నినాదాలు రావడంతో ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్టుల్లో వెలిగొండ ఉన్నదన్నారు. దాన్ని కచ్చితంగా పూర్తిచేస్తామన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర అడగటంతో కనిగిరి నుంచి పామూరు వరకు రైల్వేలైన్ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన రూ.12.30 కోట్లు ఈ నెలలో విడుదల చేస్తున్నారని తెలిపారు. ఆగస్టు నాటికి పనులు పూర్తిచేసి రైల్వేలైన్‌ను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. డాక్టర్ ఉగ్ర అడిగిన ప్రకారం కనిగిరి నియోజకవర్గంలో ట్రిపుల్‌ఐటీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తానని ప్రకటించారు. యువగళం పాదయాత్రలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇచ్చిన హామీల జాబితా తన వద్ద ఉందన్న ఆయన.. ఒకదాని వెంట ఒకటి అన్నింటినీ అమలు చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని ప్రకటించారు.


ఎమ్మెల్యే ఉగ్రను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న మంత్రి లోకేష్

నాయకులపైన ప్రేమానురాగాలు

జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, శ్రేణుల పట్ల మంత్రి లోకేష్ ప్రేమానురాగాలు ప్రదర్శించారు. అటు హెలిప్యాడ్ వద్ద, ఇటు బహిరంగసభ వేదిక వద్ద డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పలుమార్లు ఆలింగనం చేసుకొని ఆయన పట్ల ఉన్న అభిమానాన్ని బహిరంగపర్చారు. డాక్టర్ ఉగ్ర కుటుంబ సభ్యులతో కూడా ప్రత్యేకంగా కొంతసేపు ముచ్చటించారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్‌ను 'పవర్' మంత్రి అంటూ కొనియాడారు. మనకందరికీ స్వామిలాంటి వారు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అని కితాబిచ్చారు. ఇక హెలిప్యాడ్ నుంచి వేదిక వద్దకు వాహనంలో వెళ్లాల్సి ఉన్నా కాలినడకనే వెళ్లడం, రావడం చేసిన లోకేష్ మధ్యలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలను పలకరించేందుకు ఆసక్తి చూపారు. కరచాలనం కూడా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో రిలయన్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్, సీఈవో త్రిపాఠి, రెండు తెలుగు రాష్ట్రాల బాధ్యతలు చూసే మాధవరావులకు ప్రాధాన్యం ఇచ్చి నాయకులందరికీ పరిచయం చేశారు. మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యను ప్రత్యేకంగా ఆలింగనం చేసుకొని గౌరవించారు. మరో ఇద్దరు ఛైర్మన్లు అయిన బాలాజీ, దినకర్‌లు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను అరే అంటూ పలకరించడం విశేషం. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, కొండయ్య, నాగేశ్వరరావు, పార్టీ ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, మాజీ ఎంపీపీ వీరయ్య తదితరులను పేరుపేరునా పలుకరించారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర పరిచయం చేయగా ఆ నియోజకవర్గంలోని నాయకులందరికీ కరచాలనం చేసి పలుకరించారు.

కొండ ప్రాంతంలో భారీ సభ

అది మారుమూల కొండ ప్రాంతం. కనీసం మేతకోసం పశువులు కూడా సంచరించడం అరుదు. రోడ్డుమార్గం కూడా లేని అలాంటి ప్రాంతంలో రిలయన్స్ సంస్థ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిని ప్రభుత్వం కేటాయించింది. అక్కడ భూమిని చదును చేసే బాధ్యత రిలయన్స్ సంస్థది. రహదారి, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించడం ప్రభుత్వం బాధ్యత. అలాంటి ప్రాంతంలో శంకుస్థాపన కార్యక్రమానికి వారం క్రితం నిర్ణయం జరిగింది. బుధవారానికి ఆ ప్రాంతం మొత్తం వేలమందితో కళకళలాడింది. అందరినీ సమన్వయం చేసుకొని కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి జనాన్ని కదిలించడంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సఫలీకృతులు కావడం వలనే అది జరిగింది. మంత్రి లోకేష్ ఉదయం 9.30కు వస్తాను 12 గంటలకు తిరిగి వెళ్తానని ఎమ్మెల్యే ఉగ్రకు తొలుత చెప్పారు. ఉదయం 9.52 గంటలకు లోకేష్ అక్కడకు రాగా 9 గంటలకే 12వేల మందికిపైగా ప్రజలు చేరారు. 11 గంటలకు సభ ప్రారంభమయ్యే సమయానికి ఆవరణలోనూ, బయట కలిపి 18 నుంచి 19 వేల మంది ఉన్నట్లు నిఘా విభాగం నిర్ధారించారు. ఆ జన సందోహాన్ని గమనించిన లోకేష్ అమితోత్సాహంతో ఉగ్రను ఒకటికి పదిసార్లు అభినందించారు. ఇదంతా జరగటానికి కారణం కనిగిరి ప్రాంతానికి ఒక పరిశ్రమ రావడమే. అత్యధికంగా పీసీపల్లి మండల వాసులు ప్రతి గ్రామం నుంచి తరలిరాగా నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు రావడం విశేషం.


బయోగ్యాస్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్


మంత్రి లోకేశ్‌తో కరచాలనానికి పోటీపడుతున్న యువకులు



త్వరలో రేషన్ స్మార్ట్ కార్డులు

- ఈకేవైసీ పూర్తయిన తర్వాత ప్రక్రియ చేపట్టే అవకాశం
- ఒకేసారి కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పేదలకు ఇచ్చే సరుకులు పక్కదారి పట్టకుండా ఉండటమే ప్రధాన లక్ష్యంతో అనేక మార్పులకు నాంది పలికింది. అందుకోసం ఇప్పటి వరకు ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు (ఏటీఎం సైజు) కార్డుదారులకు ఇచ్చేందుకు అంతా సిద్ధం చేసింది. రాష్ట్రంలో గతేడాది నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటివి

మిగతా 6వ పేజీలో

గంటలో రిజిస్ట్రేషన్

- రోజంతా వేచి ఉండాల్సిన అవసరం లేదు
- డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్
- ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలో రేపటి నుంచి అమలు



ఒంగోలు క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ శాఖలో అనేక మార్పులు చేస్తోంది. పాతకాలం నాటి విధానాలకు చెల్లుచీటీ ఇస్తోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం క్రయవిక్రయదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు పడకుండా వెసులుబాటు ఉన్న సమయంలో వెళ్లి గంట వ్యవధిలో పనిచేసుకొని తిరిగి వచ్చే విధంగా స్లాట్ సిస్టంను అమల్లోకి తీసుకొస్తోంది. తొలుత ఏప్రిల్ 1 నుంచి అని చెప్పినప్పటికీ సాంకేతిక కారణాల వలన ఈనెల 4 నుంచి ఈ విధానం అమలులోకి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సబ్‌రిజిస్ట్రార్లకు పాతకాలంలో ఉన్న స్టేజీలను తొలగించింది. అధికారులు, ప్రజలకు ఎలాంటి తారతమ్యం లేకుండా మార్పులు చేసింది. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేవారు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేసి వారికి మంచినీళ్లు, టీ, కాఫీలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అదేక్రమంలో స్లాట్ బుకింగ్ విధానం వలన సమయం వృథాకాకుండా ఉంటుంది. శుక్రవారం నుంచి కొత్త విధానం అమలులోకి తీసుకొస్తున్నారు. ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలోని ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌ను అమలు చేయనున్నారు.

78 స్లాట్లు అందుబాటులో..

ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తెస్తున్నారు. ఈ విధానంలో.. అవసరమైన వారు తమ దస్తావేజులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. ఆ సమయంలో కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ వారి దస్తావేజులను సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు. అందుకు సంబంధించి వేలిముద్రలను, సంతకాలను కార్యాలయ సిబ్బంది సేకరిస్తారు. దీంతో సమయం వృథాకాకుండా కేవలం గంటలోనే

మిగతా 6వ పేజీలో

బుకింగ్ ఇలా..

రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో తమ దస్తావేజును అప్‌లోడ్ చేయాలి. దీంతో అప్లికేషన్ నంబరు వస్తుంది. ఆ నంబరును నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. కేటాయించిన స్లాట్ టైమ్‌లో సంబంధిత క్రయవిక్రయదారులు కార్యాలయంలో అందుబాటులో ఉండాలి. అలా చేస్తే ఒక గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.


ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

- ఉపాధ్యాయ సంఘాల నాయకుల డిమాండ్
- ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ చేసేందుకు ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ 11వ వేతన సవరణ కమిషన్ ముగిసి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ప్రభుత్వం కొత్తది ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయడంతోపాటు 2003 డీఎస్సీ వారికి కేంద్రప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 70ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలు చేయాలన్నారు. 117 జీవోను రద్దు చేసి ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా అమలు చేయాలని, ఉపాధ్యాయుల

మిగతా 6వ పేజీలో

ఎంటీఎస్ టీచర్లు తాత్కాలికంగా తొలగింపు

పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు

6

మహిళల మెడలో బంగారు గొలుసు చోరీ

మేదరమెట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనపాలెం, మేదరమెట్లలో ద్విచక్రవాహనంపై వచ్చిన యువకులు మహిళల మెడలో బంగారు గొలుసులు తెంపుకెళ్లారు. మంగళవారం రాత్రి తిమ్మనపాలెంలో కుక్కకు అన్నపెడుతున్న వృద్ధురాలు సీతమ్మ మెడలో బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన యువకులు తెంపుకెళ్లారు. మరికొంత సేపటి తర్వాత మేదరమెట్లలో ఒంటరిగా నడిచివెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకెళ్లారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంవల్ల దుండగులను గుర్తించలేకపోయారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫి ఘటనా స్థలాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మేదరమెట్ల సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంవలన దుండగులను గుర్తించలేకపోయారు. పలు గ్రామాలకు ప్రధాన కూడలి అయిన మేదరమెట్లలో సీసీ కెమెరాలు లేకపోవడంవల్ల భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు వచ్చే అవకాశముంది. దాతల సహకారంతో సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఐదుగురు అరెస్ట్

స్థలం వివాదంలో దాడికి పాల్పడిన వైనం

గవినిపాలెం(చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు తీవ్రంగా కత్తితో దాడిచేసి గాయపరచగా అతను ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈమేరకు నమోదైన కేసులోని నిందితులను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చీదరబోయిన నాగేశ్వరరావుకు, చీదరబోయిన భరత్, వీరయ్య, లక్ష్మీనారాయణకు స్థలం వివాదాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గత ఆదివారం నాగేశ్వరరావు నాయనమ్మ రాములమ్మ తన స్థలంలో ఇంటి నిర్మాణం నిమిత్తం బేస్‌మట్టం చేయించుకుంటుంది. దీనికి సంబంధించి హద్దు విషయంలో రాములమ్మతోపై ముగ్గురు వాదనకు దిగారు. దీంతో విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ నాగేశ్వరరావు వారిని నిలదీశాడు. పై ముగ్గురితో పాటు మరో ఇద్దరు కలిసి నాగేశ్వరరావును కత్తితో ఘోరంగా దాడి చేయగా శరీరంపై పలుచోట్ల రక్తగాయాలు అయినాయి. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈ కేసులోని ఐదుగురు నిందితులను బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్‌చేసి, గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

ఇంకొల్లు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల, విద్యార్థుల విద్యాభ్యున్నతికి దాతలు అందిస్తున్న సహాయం అభినందనీయమని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. ఈ పాఠశాలలో ప్రతి ఏడాది 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి విద్యాభ్యున్నతికై అదే గ్రామానికి చెందిన పొన్నం అనంతలక్ష్మి తన భర్త వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కెనరా బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీని వారికి నగదు బహుమతిగా అందించేలా ముందుకువచ్చారు. బుధవారం దాత అనంతలక్ష్మిని పేరిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అంబటి సుబ్బారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం..
మందుబాబులకు అడ్డా

- రాత్రుళ్లు ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లి మందు పార్టీలు
- ఉదయానికి ఖాళీ గ్లాసులు, బాటిళ్లు దర్శనం
- ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజల విజ్ఞప్తి

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మందుబాబుల ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. ప్రభుత్వ కార్యాలయప్రాంగణంలోకి కొందరు రాత్రుళ్లు వెళ్లి పూటుగా మద్యం సేవించి పార్టీలు చేసుకుంటున్నారు. తాగిన గ్లాసులు, సీసాలు అక్కడే పడవేసి పోతున్నారు. మందుబాబులు రాకుండా కార్యాలయ గేట్లకు అధికారులు తాళాలు వేయిస్తున్నా ప్రహరీ గోడను దూకి లోపలికి వెళ్లి ఎంచక్కా తాగుతున్నారు. బల్లికురవ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రి పూట కొందరు మద్యం తాగి, రకరాల ఆహార పదార్థాలను తిని వదిలేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం పడమర భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో విచ్చలవిడిగా మద్యం సీసాలు, గ్లాసులు పడి ఉంటున్నాయి. ఉదయం ఉద్యోగులు విధులకు వచ్చే సరికి కార్యాలయం ముందు ఉన్న విశ్రాంతి బల్లల మీద మద్యం బాటిళ్లు ఉండి అంతా అపరిశుభ్రంగా మారుతుంది. వీటిని చూసిన వారు కార్యాలయం ప్రహరి గేటుకు కూడా తాళాలు వేయిస్తున్నారు. అయినా గేట్లను, గోడను దూకి లోపలికి వచ్చి పార్టీలు చేసుకుంటున్నారు. రాత్రి సమయంలోకార్యాలయంలో వాచమన్‌ను నియమించి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయ ప్రాంగణంలో తాగి పడవేసి ఉన్న ఖాళీ గ్లాసులు

కాలువలో నీరు పారేదెట్టా..?

రైతులలో ఆందోళన

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం వెంపరాల కొండ మట్టిని తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వెంపరాల కొండ నుంచి నామ్ రోడ్డుకు వచ్చేందుకు చినకొత్తపల్లి మైనర్ 4 కాలువ కట్టను వినియోగిస్తున్నారు. దీంతో కట్టను వెడల్పుగా చదును చేసే క్రమంలో చిల్ల చెట్లు, వ్యర్థాలను పక్కనే ఉన్న కాలువలోకి పడేస్తున్నారు. అసలే మరమ్మతులు లేక నీటి ప్రవాహం సరిగ్గా లేని కాలువ కాస్తా పూర్తిగా పూడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రావెల్ తరలింపు సుమారు ఏడాది సమయం పట్టే అవకాశం ఉండడంతో సాగర్ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకి కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రావెల్ తరలింపు చేపట్టగా దుమ్ము పంట పొలాలపైకి వచ్చి పంటలు దెబ్బతింటాయని రైతులు అడ్డగించడంతో తాత్కాలికంగా విరమించారు. కాలువ కట్టను చదును చేయడం సరే.... నీటి ప్రవాహం సంగతి ఎలా అని రైతులు ఆందోళన చెందున్నారు. గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాలువ పూడిపోకుండా, పంటలకు నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



చినకొత్తపల్లి మైనర్ 4 కాలువ కట్ట ను చదును చేసి చిల్లచెట్లు, వ్యర్థాలను కాలువలో పడేయంతో అనవాళ్లు కనిపించకుండా ఉన్న కాలువ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బూదవాడ విద్యార్థులు

పంగులూరు, ఏప్రియల్ 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ)పై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి 21వ శతాబ్దపు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా చీరాలలోని ఎన్ఆర్‌పీఎం ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 10 ప్రాజెక్టులు ప్రదర్శించగా, బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కె.జగన్మోహనరెడ్డి, బి.చంద్రారెడ్డి, కె.కోటేశ్వరరావు ఆయుర్వేద మెడిసన్ ఫర్ కిడ్నీ ప్రాబ్లమ్స్ (ప్రకృతివైద్యం)పై చేసిన ప్రాజెక్ట్ ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపిక కాగా చీరాల ఎన్ఆర్‌పీఎం పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ధన్వంతరి దంతసిరి (పళ్లపొడి) ప్రాజెక్ట్ ద్వితీయ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈ రెండు ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు బూదవాడ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ సుధారాణి తెలిపారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ ప్రాజెక్ట్‌లు ప్రదర్శించనున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రేషన్ దుకాణంపై అధికారుల దాడులు

పెద్ద మొత్తంలో తేడాలు గుర్తింపు

6 ఏ, క్రిమినల్ కేసు నమోదు

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని విఠల్‌నగర్ రేషన్ దుకాణం-19పై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈక్రమంలో పేద ప్రజలకు అందించాల్సిన 244 క్వింటాళ్ల రేషన్ బియ్యం, షుగర్ ప్యాకెట్స్ - 460, కందిపప్పు - 418 ప్యాకెట్స్ నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిర్వాహకులపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దాడుల్లో తహసీల్దార్ గోపీకృష్ణ, సివిల్ సప్లయిస్ డీటీ గీతారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. దాడులు నిరంతరం ఉంటాయని పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇతర శాఖాపరమైన అంశాల్లో భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు.



సరుకు వివరాలు పరిశీలిస్తున్నతహసీల్దార్ గోపీకృష్ణ, డీటీ గీతారాణి

వైభవంగా శ్రీరామ మందిరం ప్రతిష్ఠోత్సవం

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని ఉజిలీపేట ప్రధాన రహదారిలో శ్రీరామ మందిరం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అర్చకులు కమిటీ ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించి, అత్యంత వైభవంగా సీతారామ లక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొనగా, గురువారం విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు.

చంద్రన్న పథకాలతో ప్రజల హర్షాతిరేకాలు

- సీఎం వరాలపై స్థానిక వర్గాల్లో ఆనందం
- హామీలపై కృతజ్ఞతలు

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం నిరుపేద ప్రజలకు వరాలు కురిపించింది. అందుకు సంబంధించి మంగళవారం చినగంజాం మండలం పెదగంజాంలోని కొత్తగొల్లపాలెంలో జరిగిన ప్రజా వేదిక సభలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పథకాలపై స్పష్టమైన హామీ ఇచ్చారు. తల్లికి వందనం, రైతు భరోసా, మత్స్యకార భరోసా, డీఎస్సీని సైతం విడుదల చేస్తామంటూ ప్రకటించి ప్రజల బాగోగులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వైసీపీ హయాంలో అరకొర పథకాలు, చాలీచాలని నిధులతో కోతలు విధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. దీనిపై ప్రజలు వారి అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.



తోటవారిపాలెం సచివాలయంలో రైతు పథకాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మత్స్యకారులకు భరోసాతో సంతోషం



ఏటా ఏప్రిల్, మేలో అలల తాకిడికి గుడ్డు ఉత్పత్తి జరిగి మత్స్య సంపద పెరుగుతుంది. ఈక్రమంలోనే వేటను రెండు మాసాలు నిలిపివేస్తాం. దీంతో ప్రభుత్వం మాకు భరోసా అందిస్తుంది. ఈక్రమంలోనే గత ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు ప్రకటించినప్పటికీ గతేడాది ఇవ్వలేదు. చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మత్స్యకార భృతిని రూ.20వేలుగా ప్రకటించడంతో పాటు జూన్‌లోపే భరోసా అందిస్తానని హామీని ఇవ్వడం ఆనందంగా ఉంది.

- అర్జిల్లి సత్తిబాబు, వాడరేవు మత్స్యకారుడు

గతంలో ఒక బిడ్డకే



నేను చేనేత కార్మికురాలిని. నిరుపేద కుటుంబం ఈక్రమంలో ఇద్దరి బిడ్డల చదువుకు గతంలో నానా యాతన పడ్డాను. ఈ సారి ఏకంగా ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలకు ప్రభుత్వం తల్లికి వందనం ప్రకటించింది. ఈసారి వేసవి ముగియగానే పథకం అమలు చేస్తుండడం ఆనందంగా ఉంది. థాంక్యూ సీఎం సార్.

- ఆకురాతి ఉమాదేవి, సావరపాలెం

ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు



నిరుపేద కుటుంబంలో జన్మించాను. తల్లిదండ్రులు అప్పులు చేసి చదివించారు. పీహెచ్‌డీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాను. టీడీపీ కూటమి ప్రభుత్వం జూన్‌లోపే డీఎస్సీ ని విడుదల చేస్తున్నట్లు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం ఆనందంగా ఉంది.

- అవ్వారు శ్రీనివాసరావు, నిరుద్యోగి, ఈపూరుపాలెం

రైతులు నష్టపోకుండా చర్యలు



గత ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.13,500 ప్రకటించింది. అయితే అమలులో తీవ్ర జాప్యం నెలకొంది. ఈక్రమంలో రైతులు నానా తిప్పలు పడాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం భరోసాను రూ..20 వేలకు పెంచడంతోపాటు వేగంగా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం ఆనందంగా ఉంది.

- రావిపాటి హరిబాబు, తోటవారి పాలెం రైతు

అవీఇవీ

'ప్రకాశం' నాకు ప్రత్యేకం

(5వ పేజీ తరువాయి)

శ్రీకారం పలికామన్నారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి తోడ్పాటు ఇచ్చిన ఎమ్మెల్యే ఉగ్ర మరో 50వేల ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించినందున మరో 50 ప్లాంట్లు కనిగిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

వలసల నివారణకు పాదయాత్రలోనే నిర్ణయం

యువగళంలో భాగంగా కనిగిరి నియోజకవర్గంలో పర్యటించినప్పుడే ప్రజల వలసల నివారణకు అనువైన అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేయాలని నిర్ణయించుకున్నట్లు లోకేష్ తెలిపారు. ప్రతిరోజూ పాదయాత్ర ముగిసిన తర్వాత ముఖ్య నాయకులందరం సమీక్ష చేసుకుంటామని... ఆ సందర్భంగా డాక్టర్ ఉగ్ర నియోజకవర్గ దుస్థితిని, ప్రజల వలసల గురించి ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. రిలయన్స్ సంస్థతో బయోగ్యాస్ ప్లాంట్‌పై ఒప్పందం జరగ్గానే మంత్రి రవికుమార్ నేను మాట్లాడుకొని కనిగిరికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలో ఉన్న తప్పులను సవరించి మెరిట్ కం రోస్టర్ ప్రకారం రీ ఆర్గనైజ్ చేయాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటన్నింటిని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎస్ఎండీ రఫీ, వి.మాధవరావు, జయరావు, వై.వెంకట్రావు, ఎస్కే అబ్దుల్‌హై, వి.జనార్దన్‌రెడ్డి, బి.వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసులు, పి.వెంకట్రావు, జీవీకే కీర్తి పాల్గొన్నారు.

త్వరలో రేషన్ స్మార్ట్ కార్డులు

(5వ పేజీ తరువాయి)

చేపట్టలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రక్రియను కూడా వారం పదిరోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో 6.61 లక్షల రేషన్‌కార్డుల పరిధిలోని సభ్యుల నుంచి ఈకేవైసీ చేపట్టిన ప్రభుత్వం ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేసే విధంగా దిశానిర్దేశం చేసింది. ప్రస్తుతం పంపిణీ జరుగుతుండగా అక్కడే లేని వారికి ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే కార్డుల్లో చేర్పులు, మార్పులతోపాటు తొలగింపులు చేసేందుకు ప్రభుత్వం అప్షన్లు ఇవ్వనుంది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను ఇవ్వనున్నారు. ఈ కార్డులో ఇంటి కుటుంబసభ్యులు ఎంతమంది ఉంటే అంతమంది ఫొటోలు కూడా ఉండటంతోపాటు పూర్తి అడ్రసు కూడా ఉంటుంది. ప్రస్తుతం అన్నింటిని రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్న పరిస్థితుల్లో ఆ కార్డులను జేబులో పెట్టుకునేందుకు కూడా ఈజీగా ఉంటుంది. ఆ ప్రక్రియ మే నెలల ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటిచడంతో ఆ శాఖ అధికారులు తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.

గంటలో రిజిస్ట్రేషన్

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ పూర్తవుతుంది. ఒంగోలు కార్యాలయంలో 78 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. అక్కడ ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు ఉంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు స్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఒక గంటలో ఆరు దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

అవగాహన కల్పించాం

కె.శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్, ఒంగోలు ఆర్వో కార్యాలయం

స్లాట్ బుకింగ్ విధానంపై ఇప్పటికే ప్రజలకు, మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్‌ల నిర్వాహకులకు అవగాహన కల్పించాం. ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ 78 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఇంకా ఏరోజు నుంచి స్లాట్లు అందుబాటులో ఉంటాయనేది ఆదేశాలు రావాల్సి ఉంది. ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రమే ప్రయోగాత్మకంగా ఈ విధానం అమల్లోకి వస్తోంది.

ఎంటీఎస్ టీచర్లు తాత్కాలికంగా తొలగింపు

పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు విధానంతో మినిమం టైమ్ స్కేలుతో పనిచేస్తున్న డీఎస్సీ 1998, 2008 టీచర్లను తాత్కాలికంగా తొలగిస్తూ పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని నియమించిన విధానం ప్రకారం 11 నెలలు పనిచేయించుకొని మిగిలిన నెల నోవర్క్ నోపే కింద పరిగణిస్తారు. ఈనేపథ్యంలో పాఠశాలల అవసరాల దృష్ట్యా వీరిని 2024 జూన్‌లో నియమించారు. 11 నెలలు అంటే ఏప్రిల్ 30తో గడువు ముగుస్తుంది. 30వతేదీ సాయంత్రం వీరందరినీ ఉద్యోగాల నుంచి తొలగించాలని డీఈవోలను ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ ఆదేశించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం తదుపరి సూచించిన ప్రకారం ఉత్తర్వులు ఇస్తామని పేర్కొన్నారు.

చిన్నసైజు గుడ్లను కేంద్రాల వారు తీసుకోవద్దు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న సైజులో ఉన్న కోడి గుడ్లను ఇస్తే ఎవరు తీసుకోవద్దని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ సూచించారు. బుధవారం బల్లికురవ, కొప్పెరపాడు గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశాలు జరిగాయి. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో కోడి గుడ్లు మురిగి పోయినవి వస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, జాగ్రత్తగా పరిశీలించి గుడ్లను తీసుకోవాలని తెలిపారు. 600 గ్రాముల బరువు ఉన్న గుడ్లను మాత్రమే కేంద్రాలకు తీసుకోవాలన్నారు. బాలసంజీవని యాప్‌పై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మలా పాల్గొన్నారు.

ఏపీవో రేణుకా బదిలీ

ఇంకొల్లు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల జాతీయ ఉపాధి హామీ అధికారిగా గత ఐదు సంవత్సరాలుగా బాధ్యతలు చేపట్టిన ఏపీవో రేణుకా యద్దనపూడి మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న సురేష్ పర్చూరుకు బదిలీ అయినట్లు చెప్పారు.

పశువుల కోసం 25 నీటి తొట్లు మంజూరు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పశువులకు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ పథకం ద్వారా 25 నీటి తొట్లు మంజూరైనట్లు ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. ఒక్కో నీటి తొట్టికి రూ.40వేలు ఉపాధి నిధులు అందజేస్తామని తెలిపారు. బల్లికురవ, గొర్రెపాడు, కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు, ఎస్ఎల్ గుడిపాడు, వల్లాపల్లి, వేమవరం గ్రామాలకు ఒక్కొక్కటి, గుంటుపల్లికి 2, కొప్పెరపాడుకు 3, ముక్తేశ్వరానికి 5, మల్లాయపాలెంకు 2, వైదనకు 2 చొప్పున నీటి తొట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు చేపడతామని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలల్లో రెండు దశలలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య తెలిపారు. 3వ తేదీన వెంకటాపురం, శింగరకొండపాలెం, కుంకుపాడు, 4న విప్పర్లవారిపాలెం, నాగులపాడు, కోటికలపూడి, 5వ తేదీ పేరాయపాలెం, గోపాలపురం,వేలమూడిపాడు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయన్నారు. 8న ఉప్పలపాడు, ధర్మవరం, మణికేశ్వరం, 9న వెంపరాల, శంఖవరప్పాడు, కొంగపాడు, 10న బొమ్మనంపాడు కలవకూరు, రామాయపాలెం, 11న జార్లపాలెం, చక్రాయపాలెం, తిమ్మాయపాలెం గ్రామాలల్లో జరుగుతాయని, కొత్త ఆధార్, వేలిముద్రలు అప్‌డేట్, ఫోన్ నెంబర్ లింక్ వంటి సేవలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన తెలిపారు.

పెట్టుబడుల వరద

జిల్లాలో రూ.1.50 లక్షల కోట్లతో పలు పరిశ్రమల ఏర్పాటు



మాట్లాడుతున్న ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మాట్లాడుతున్న మంత్రి స్వామి

● త్వరలో కందుకూరు నియోజకవర్గంలో రూ.50 వేల కోట్లతో సోలార్ ప్లాంట్ ● మంత్రి గొట్టిపాటి రవికుమార్

పీసీపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రకాశం జిల్లాకు రూ.1.50లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో బుధవారం జరిగిన రిలయన్స్ సీబీజీ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో గొట్టిపాటి మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చినప్పుడు ఈప్రాంతం వెనుకబడినతనాన్ని గుర్తించి అధికారంలోకి వచ్చిన 9నెలల్లోనే రూ.650కోట్లతో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌ను కనిగిరికి తెచ్చారన్నారు. అడవిలాంటి ప్రాంతాల్లో రైతుల మేలుకోరి రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయడం రాష్ట్ర ప్రభుత్వం వల్లనే సాధ్యమైందని చెప్పారు. ఇక్కడ సీబీజీ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లుగానే కందుకూరు నియోజకవర్గం పరిధిలో త్వరలో రూ. 50వేల కోట్లతో ఇండోసోల్ కంపెనీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని, ఆ తరువాత లక్షకోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ ప్లాంట్ ఏర్పాటు ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఈ ప్లాంట్‌ల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు.



సభకు హాజరైన అశేష జనవాహిని

జగన్ ప్రభుత్వం పరిశ్రమలను వెళ్లగొట్టింది

మంత్రి గొట్టిపాటి

గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. దివాకరపల్లి వద్ద సభలో ఆయన మాట్లాడారు. 2019లో ఒక్క చాన్స్ అని అడిగితే.. ప్రజలు అవకాశమిస్తే అభివృద్ధిలో రాష్ట్రం 20సంవత్సరాలు వెనక్కిపోయిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన 9నెలల్లోనే దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా ఇక్కడ అధికంగా పెన్షన్‌లు ఇస్తున్నామన్నారు. అలాగే ఉచిత ఇసుకను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు.

జిల్లా చరిత్రలోనే కనిగిరికి ప్రత్యేక గుర్తింపు

సీబీజీ భూమిపూజ బహిరంగ సభలో మంత్రి స్వామి

పీసీపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా జిల్లా చరిత్రలో కనిగిరి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీ డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. పీసీపల్లి మండలం వెంగళాయపల్లి పంచాయతీ దివాకరపల్లి సమీపంలో బుధవారం సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ తన మొదటి కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను నియోజకవర్గంలో స్థాపించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్లాంట్ ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి చొరవ, మంత్రి లోకేష్ కృషి మరువలేమని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేకమంది పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కృషే కారణమని స్పష్టం చేశారు. సభలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు. ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, దర్శి, యర్రగొండపాలెం ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, గూడూరు ఎరిక్షన్‌బాబు, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

పొన్నలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ముత్తరాశుపాలెం-ముప్పాళ్ల గ్రామాల మధ్య చోటుచేసుకుంది. పొన్నలూరు స్టేషన్ ఇన్‌చార్జి అధికారి మాలకొండయ్య కథనం మేరకు.. ముత్తరాశుపాలెంనకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తేవడ్ల రామకృష్ణ అదేగ్రామానికి చెందిన సర్వేపల్లి వెంకటరావు(40), ఎస్.వెంకటరావును తీసుకొని ఇసుక లోడింగ్ కోసం సమీపంలోని పాలేరుకు బయల్దేరారు. కొద్దిదూరం వెళ్లగానే ట్రాక్టర్ గోతిలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో సర్వేపల్లి వెంకటరావు అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌తోపాటు మరో వెంకటరావుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను వాహనంలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

అక్రమ తవ్వకాలపై మైన్స్ ఏజీ పరిశీలన

● పరిమితికి మించి తవ్వకాలపై పెనాల్టీ విధింపు



తవ్వకాలపై కొలతలు తీస్తున్న మైనింగ్ అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామపరిధిలో కొండపోరంబోకు భూముల్లో గ్రావెల్‌ను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి తరలించారని గ్రామస్థుల నుంచి స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు గనులశాఖ అధికారులు స్పందించారు. మైన్స్ అసిస్టెంట్ జియాలజిస్టు రవివర్మ తన సిబ్బందితో కలిసి తవ్వకాలు జరిపిన స్థలాన్ని పరిశీలించారు. అనుమతి లేని స్థలంలో ఎంతమేరకు తవ్వకాలు జరిపారనే దాని కోసం కొలతలు తీసి లెక్క కట్టారు. ఈ సందర్భంగా రవివర్మ స్పందిస్తూ కొలతల్లో తేలిన మేరకు నిబంధనలకు విరుద్ధంగా జరిపిన తవ్వకాలపై పెనాల్టీ విధిస్తామన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. అధికారులు మంజూరు చేసిన అనుమతుల మేరకు మాత్రమే తవ్వకాలు జరుపుకోవాలని సదరు కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందికి తెలియచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారులు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ప్రారంభం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జరగబోయే పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షకు సంబంధించి గురువారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ లాజరస్‌బాబు తెలిపారు. తరగతులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయని, ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు.

అద్దంకిలో మినీ బైపాస్ పొడిగింపుతో మరింత ప్రయోజనం

ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం

కార్యరూపం దాల్చితే మారనున్న పట్టణ రూపు రేఖలు

సర్వే చేసేందుకు మంత్రి గొట్టిపాటి గ్రీన్ సిగ్నల్‌తో ప్రజలలో పెరిగిన ఆశలు

అద్దంకి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ ప్రజలను దశాబ్దకాలంగా మినీబైపాస్ రోడ్డు నిర్మాణం ఊరిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అంతా పూర్తయినట్లే అని నమ్మబలికినా అడుగు ముందుకు పడలేదు.. నయా పైసా నిధులు విడుదల కాలేదు. ప్రతిపాదనలతో కాలం వెళ్లదీశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి గొట్టిపాటి రవికుమార్ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులపై దృష్టి సారించారు. రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు సుమారు 1.7 కి.మీ దూరం అద్దంకి మేజర్ కాలువకు రెండు వైపులా సీసీ రోడ్లు నిర్మాణం, లైటింగ్ తదితర పనులకు సుమారు 15 కోట్ల రూపాయలు అవసరమని మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేసి నిధుల కోసం ప్రభుత్వానికి పంపారు. ఈ నిధులు త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉంది.

మినీ బైపాస్ రోడ్డును అద్దంకి మేజర్ కాలువ కట్టలనే ఉపయోగించుకొని శింగరకొండ సమీపంలోని 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వరకు సుమారు 4 కి.మీ దూరం తారు రోడ్డు నిర్మాణం చేయాలని అద్దంకి పట్టణ నేతలు, ప్రజలు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. ప్రాథమికంగా సర్వే చేయాలని మంత్రి రవికుమార్ అధికారులను ఆదేశించారు. కాకానిపాలెం నుంచి 3 కి.మీ దూరం అద్దంకి మేజర్ కాలువ కట్టలను ఉపయోగించుకొని అక్కడ నుంచి టిడ్కో ఇళ్ల వరకు సుమారు అర కిలోమీటరు దూరం ప్రైవేటు భూములు ఉన్న నేపథ్యంలో భూసేకరణ చేయాల్సి ఉంది. టిడ్కో ఇళ్ల వద్ద నుండి 99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నామ్ రోడ్డు వరకు మరో అరకిలోమీటర్ దూరం అవసరమైన మేర రోడ్డు ఉంది. అరకిలోమీటర్ దూరం భూసేకరణ ప్రధాన సమస్యగా ఉండే అవకాశం ఉంది. భూసేకరణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మినీ బైపాస్ పొడిగింపునకు పెద్ద అడ్డంకులు ఉండబోవని పలువురు అభిప్రాయపడుతున్నారు. మినీ బైపాస్ రోడ్డు శింగరకొండ సమీపం నుంచి అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ దూరం ఉండే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదనలు పట్టాలెక్కితే అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు కొంత మేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది. అదే సమయంలో పలు కాలనీల నుంచి ఆయా రోడ్లకు వెళ్లేందుకు సులువైన మార్గం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో అద్దంకి పట్టణం మరింత విస్తరించే అవకాశం కూడా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతుంది.



మినీ బైపాస్ రోడ్డుగా మార్పు చేయనున్న అద్దంకి మేజర్ కాలువ కట్టలు

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయించాలి

హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్

సింగరాయకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వివిధ స్థాయిల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను లబ్ధిదారులతో త్వరితగతిన పూర్తిచేయించాలని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన గృహనిర్మాణ శాఖ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మంజూరై బేస్మెంట్, రూఫ్, స్లాబ్ స్థాయిల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొనేందుకు ప్రభుత్వం సాయం అందిస్తున్నదన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు, ఆదివాసీ, గిరిజనుల (పీవీటీజీ)కు రూ.లక్ష ఆర్థిక సాయం ఇస్తుందన్నారు. ఇప్పటికే మండలంలో సర్వే ద్వారా 675 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. వారి చేత నిర్మాణాలను పూర్తిచేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జయమణి, హౌసింగ్ డీఈ సత్యనారాయణ, ఏఈ పృథ్వి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు చీమకుర్తి క్రీడాకారులు

చీమకుర్తి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు చీమకుర్తి గెలాక్సీ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు ఎంపికయినట్లు కోచ్ కురిచేటి వెంకట్ బుధవారం తెలిపారు. ఎంపికైన ఎ.సూర్యతేజ, గుండా వెంకటసుకుమార్ ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ టోర్నమెంట్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ వెంకట్

మాజీ సీఎం జగన్‌ను అరెస్ట్ చేయాలి

● రేషన్ బియ్యం పంపిణీపై విచారణ చేయాలని డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కొండపి మండలం ముప్పవరం గ్రామానికి చెందిన దొడ్డక నరసింహరాజు బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం, మరోసారి కేంద్రప్రభుత్వం ఉచితంగా రేషన్‌బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే కార్డుదారులకు అందజేసిందని ఆరోపించారు. ఉచితంగా అందజేయాల్సిన బియ్యం పంపిణీ చేయకుండా భారీ అక్రమాలకు జగన్ పాల్పడ్డారని, దీనిపై సమగ్ర విచారణ చేసి ప్రజల సొమ్మును రాబట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే బియ్యం పంపిణీ చేసే వాహనాలను రద్దు చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, ఈ మేరకు వాహనాలను రద్దు చేసి పేదలకు నెలకు రెండుసార్లు బియ్యం పంపిణీ చేయాలని ఆయన కోరారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నరసింహరాజు

నేటి నుంచి టెన్త్, ఓపెన్ ఇంటర్ మూల్యాంకనం

హాజరుకాని వారిపై కఠిన చర్యలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి జవాబు పత్రాలు, ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానుంది. టెన్త్ మూల్యాంకనం స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ స్కూలులో, ఓపెన్ ఇంటర్ మూల్యాంకనం స్థానిక ఏబీఎం జూనియర్ కళాశాలలో జరగనుంది. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ చెప్పారు. టెన్త్ మూల్యాంకన కేంద్రానికి డీఈవో కిరణ్‌కుమార్, ఓపెన్ ఇంటర్ మూల్యాంకనానికి ఒంగోలు ఉపవిద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. టెన్త్ మూల్యాంకన కేంద్రంలో ఉప క్యాంపు అధికారిగా ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జిగా ఏసీ కే శివకుమార్ వ్యవహరించనున్నారు. మూల్యాంకనానికి 107 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 600 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 300 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. మొత్తం 1.78 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. అయితే పదో తరగతి సోషల్ పరీక్ష పత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. అన్ని విభాగాల్లో మూల్యాంకన విధులకు 1,311 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులను నియమించారు. ఓపెన్ ఇంటర్ జవాబు పత్రాలకు 150 మందిని నియమించారు. ఎగ్జామినర్లు 25 మంది, అసిస్టెంట ఎగ్జామినర్లు 125 మంది, 25 మంది పరిశీలకులను నియమించారు. మూల్యాంకన విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో కిరణ్‌కుమార్ హెచ్చరించారు. అందరూ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ఎయిడెడ్ పాఠశాలల వివరాలు కోరిన ప్రభుత్వం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వం కోరింది. పది రోజుల్లో పూర్తి వివరాలు సమర్పించాలని పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 94 ఎయిడెడ్ పాఠశాలలు పనిచేస్తున్నాయి. పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల వివరాలు, పాఠశాల స్థిర, చర, మౌలికవసతులు, ప్రభుత్వ గుర్తింపు వివరాలు, యూడైస్ డేటా ప్రకారం విద్యార్థుల నమోదు, కరస్పాండెంట్ షిప్ వివరాలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలు కోరారు. ఈ వివరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలు, డాక్యుమెంట్లతో సహా పుస్తకరూపంలో తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలి. పాఠశాల విద్యా ఆర్‌జేడీ, డీఈవోలు కొత్త జిల్లాల వారీగా ఈ సమాచారం సిద్ధం చేసి సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

కూటమి ప్రభుత్వంలో రోడ్లు కళకళ

● ఎమ్మెల్యే బీఎన్ చొరవతో మహర్దశ



అమ్మనబ్రోలు రోడ్డు నుంచి రాపర్ల వరకు నిర్మించిన తారురోడ్డు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లు కొత్త కళను సంతరించుకొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారి అభివృద్ధికి నోచుకోలేదు. గతుకులు, గుంతల రోడ్లతోనే గ్రామీణ ప్రాంతాల ప్రజలు అష్టకష్టాలు పడుతూ ప్రయాణాలను సాగించారు. నాగులుప్పలపాడు-అమ్మనబ్రోలు ఆర్అండ్బీ రోడ్డు నుంచి రాపర్ల వరకు గల పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 4.3 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. వైసీపీ పాలనలో ఆ రోడ్డు అభివృద్ధికి నోచక పలు గ్రామాల ప్రజల ఆశలు ఆవిరిగా మారాయి. నిత్యం అనేక గ్రామాల ప్రజలు ఆ రోడ్డుపైనే ప్రయాణాలు చేస్తుంటారు. అడుగుకో గుంతతో నరక ప్రయాణం సాగించలేక అప్పటి పాలకులు రాపర్ల రోడ్డు అభివృద్ధి చేస్తారేమోనని కళ్లు కాయలు కాచేలా ఎదురు చేసినా ఫలితం శూన్యం. ఈ క్రమంలో ఎన్నికల నగారా మోగడంతో ప్రచారంలో పాల్గొనేందుకు రాపర్ల, మాచవరం, చవటపాలెం తదితర గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్కుమార్కు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, ప్రజలు సమస్యను విన్నవించారు. నాగులుప్పలపాడు-అమ్మనబ్రోలు రహదారి నుంచి రాపర్ల వరకు ఉన్న 4.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు పూర్తి చేస్తానని విజయ్కుమార్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే బీఎన్ దృష్టి సారించారు. అందులో భాగంగా నాగులుప్పలపాడు-అమ్మనబ్రోలు రహదారి నుంచి రాపర్ల బాగవతుల కుంట వరకు వరకు 2.1 కిలోమీటర్లు వరకు తారురోడ్డును రూ.90 లక్షలతో నిర్మించారు. మిగిలిన ఉన్న 2.3 కిలోమీటర్లు నూతన రోడ్డు నిర్మించేందుకు ఇప్పటికే రూ. 1.60 కోట్లు నిధులు మంజూరు కాగా పనులు చేపట్టేందుకు పూర్తిస్థాయి అనుమతులు వచ్చిన వెంటనే రోడ్డు నిర్మించనున్నారు.

ఉద్యోగోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలి

● ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళుగా ట్రెజరీశాఖలో పెండింగ్లో ఉన్న ఉద్యోగుల ఉద్యోగోన్నతులతో పాటు ఆర్థిక పరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాజా రాజ్కుమార్ కోరారు. స్థానిక ఒంగోలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర మొట్టమొదటి కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజ్కుమార్ మాట్లాడుతూ ట్రెజరీశాఖలో సహాయ ఖజానాధికారి నుంచి అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ ఉద్యోగోన్నతుల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అర్హతలు ఉన్నా ఉద్యోగోన్నతులు లేకుండానే రిటైర్డ్ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న పలు డిసిప్లినరీ కేసులపై ఆర్థికశాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు త్వరితగతిన చేరువ చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్రని, అందువల్ల ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎల్వీ.యుగంధర్, ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, మనోహర్ బేగ్, కరీముల్లా, హసీనాబేగం, అబ్దుల్ ఖాదర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎలీషారాణి, వీవీ. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ను అందించడమే లక్ష్యం

● ఎస్ఈ వెంకటేశ్వర్లు



కొత్తలైన్ను ప్రారంభిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

కొనకనమిట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ను అందించడమే విద్యుత్శాఖ లక్ష్యమని ఎస్ఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల జంక్షన్లో విద్యుత్ సబ్స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో కనిగిరిలో 33 కేవీ విద్యుత్ లైన్పై అధిక లోడు కారణంగా కొనకనమిట్ల, హనుమంతునిపాడు తదితర మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు జంక్షన్లోని సబ్స్టేషన్ నుంచి 2 కిలోమీటర్లు రూ.25లక్షల వ్యయంతో 33 కేవీ విద్యుత్లైన్ లాగామని చెప్పారు. దీనిద్వారా పొదిలి నుంచి కంభాల పాడు మీదగా 33 కేవీ విద్యుత్ వినియోగించుకొనే వీలుందని కొంతమేరా అధిక లోడు తగ్గించుకునే అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో 132 కేవీ సబ్స్టేషన్ గతంలో వర్చువల్గా శంకుస్థాపన చేశారు. ఈ 132 కేవీ సబ్స్టేషన్ ఒక సంవత్సరంలో నిర్మాణం పూర్తయితే చాలావరకు ఈ ప్రాంతంలో వినియోగదారులకు, రైతులకు అంత రాయంలేని విద్యుత్ను అందించే వీలుందని పేర్కొన్నారు. తొలుత నూతనంగా ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్లైన్కు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో 132 కేవీ విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో దర్శి డీఈ శ్రీనివాసరావు, డీఈ టెక్నికల్ వీరయ్య, ఏడీ హరిబాబు, ఏఈ వీరబ్రహ్మం, లైన్ఇన్స్పెక్టర్, లైన్మెన్, ఏఎల్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు తహసీల్దార్ సెలవుతో అవస్థలు

● కార్యాలయంలో ఇన్చార్జి అధికారి లేక స్తంభించిన పనులు
● పట్టించుకోని ఉన్నతాధికారులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్ ఎన్.వాసు వారం రోజులు సెలవు పెట్టడంతో కార్యాలయంలోని పనులు స్తంభించిపోయాయి. సాధారణంగా తహసీల్దార్ సెలవులో వెళ్లినప్పుడు మరొకరికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తారు. అయితే ఇక్కడ ఏ ఒక్క అధికారిని ఇన్చార్జిగా నియమించలేదు. దీంతో కార్యాలయ పనులు ఏ ఒక్కటి ముందుకు సాగడం లేదు. ఒంగోలు నగరానికి, ఒంగోలు రూరల్ మండలానికి తహసీల్దార్ ఒక్కరే కాడంతో ప్రజలు తమ పనుల కోసం కార్యాలయం వద్దకు వచ్చి వెనుతిరిగిపోతున్నారు. ముఖ్యంగా పలు ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది. భూములు ఆన్లైన్ ప్రక్రియ కూడా నిలిచి పోయింది. ఉన్నతాధికారులు స్పందించి ఇన్చార్జి అధికారిని నియమించి పనులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

డాక్టర్ సుబ్బానాయుడుకు అభినందన



సుబ్బానాయుడును అభినందిస్తున్న కాకతీయ సేవా సమాఖ్య నేతలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రవితేజ చెస్ట్ హాస్పటల్ అధినేత డాక్టర్ కేవీ.సుబ్బానాయుడు జిల్లా కాకతీయ సేవా సమాఖ్య నాయకులు అభినందించారు. బుధవారం ఒంగోలులో డాక్టర్ సుబ్బానాయుడును కలిసి బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య గౌరవాధ్యక్షుడు అంజయ్య మాస్టార్ మాట్లడుతూ భవిష్యత్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, సమాజ సేవలో మంచి కీర్తి ప్రతిష్టలు పొందాలని ఆకాంక్షించారు. అలాగే పలువురు ప్రముఖులు సుబ్బానాయుడును కలిసి అభినందించారు.

ఘనంగా కాపు సంఘం కార్యాలయ వార్షికోత్సవం



సంజీవకుమార్ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాపుసంఘం కార్యాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఒంగోలు నగరం రామనగర్లోని మొదటి లైన్లో గల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ అధ్యక్షతన కాపు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఇటీవల చనిపోయిన కాపు కళ్యాణ మండపం మాజీ అధ్యక్షుడు గాదె వెంకటకృష్ణారావు, తోటపల్లి వెంకటరంగారావు, ఓగిరాల రాధాకృష్ణమూర్తిలకు నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ కవి, కళామిత్ర మండలి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, సీవీఎన్ రీడింగ్ రూం నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన ఈదుపల్లి గురునాథరావు, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్, సంయుక్త కార్యదర్శి తోట సాయి, నవీన్, కార్యవర్గ సభ్యులు జల్లిపల్లి పూర్ణచంద్రరావు, శ్రీధర్బాబులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బండారు సుబ్బారావు, అయినాబత్తిన ఘనశ్యాం, వర్డ శేషయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, కొల్లా నారాయణ, ఫణీంద్ర, నారపుశెట్టి రామమోహన్, కొల్లా హనుమంతరావు, కుర్రా ప్రసాద్బాబు, శిరిగిరి శ్రీనివాసరావు, పోగుల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మంగమూరురోడులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన ప్రాంగణ ఎంపికలలో 14మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. గ్లోబల్ వన్ సర్వీసెస్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపిక అయిన విద్యార్థులకు ఏడాదికి రూ.1.80 లక్షలు నుంచి రూ.240లక్షలు ప్యాకేజీ లభిస్తుందని కళాశాల చైర్మన్ వై.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వైసత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమకళాశాలలో ఇప్పటి వరకు 87 మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సునీల్కుమార్, అనీల్కుమార్, సుభాని, కళాశాల వైస్ ప్రిన్స్పాల్ పి. రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు ఎస్ఐ బదిలీ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు ఎస్ఐగా పని చేస్తున్న నాగరాజును బాపట్ల జిల్లాకు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. మేరకు మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. దీంతో నేడో రేపో ఎస్ఐ నాగరాజును బాపట్ల జిల్లాకు పంపించనున్నారు. కాగా ముండ్లమూరు పోస్టింగ్ కోసం నలుగురు ఎస్ఐలు పోటీ పడుతున్నట్లు సమాచారం.

రాయితీతో విద్యుత్ను అందించాలి

పొదిలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పొదిలి పట్టణంలోని కార్పెంటర్లకు కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంతో పాటు రాయితీతో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసులు కోరారు. బుధవారం స్థానిక యూనియన్ అధ్యక్షుడు శేఖర్ కార్పెంటరీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పెంటర్లకు వుడ్కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, రాయితీపై విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన బీసీ కులాల చేతివృత్తుల వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి మృతి

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

మార్కాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. మార్కాపురంలోని వడ్డె బజార్కు చెందిన కుంచాల ఆంజనేయులు (38) మృతిచెందాడు. ఎస్ఐ ఎం. సైదుబాబు కథనం మేరకు వడ్డెబజార్కు చెందిన కుంచాల బాలకోటేశ్వరరావు, సాంబమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. వారిలో మూడోవాడైన ఆంజనేయులు కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. పెళ్లి కానీ ఆంజనేయులు మద్యానికి బానిసగా మారాడు. ఎప్పటిలాగే మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లాడు. సాయంత్రం 5 గంటల సమయంలో తనకు తీవ్రంగా కడుపునొప్పిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలిపాడు. వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన తర్వాత సామాజిక మాధ్యమాల్లో యువకుడు ఆత్మహత్య అని ప్రచారం జరిగింది. దీంతో టౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రగిరి సమీపంలోని శ్రీరామ్ డెయిరీ సమీపంలో మురుగు కాలువలో దాసరి మహేష్(42) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ముండ్లమూరులో గత కొన్నాళ్లుగా నివాసం ఉంటున్న మహేష్ తన తల్లి వద్ద ఉంటూ రోజూ ముండ్లమూరు పోయి వస్తుంటాడు. ఐతే ఆదివారం నుంచి మహేష్ కన్పించలేదు. దీంతో బంధువులు వెతుకులాట ప్రారంభించినా కన్పించలేదు. చివరకు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో పొలాలకు వెళ్తున్న కొంతమంది యువకుడు మృతదేహం గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మహేష్గా గుర్తించారు. మృతుడు తల్లి రామలింగమ్మ ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల అదే పంచాయతీ పరిధిలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన ఇరు వర్గాల మధ్య బుధవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మారెళ్ల గ్రామానికి చెందిన బత్తుల పవన్, సాయి తేజ, కళ్యాణ్లకు గాయాలయ్యాయి. బత్తుల పవన్ గంగన్నపాలెం సమీపంలోని ఒక వెంచర్ వద్ద ఉండగా గంగన్నపాలెంకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి ఘర్షణ పడ్డారు ఘర్షణలో గాయపడిన ముగ్గురిని అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. గంగన్నపాలెంకు చెందిన పోతిరెడ్డి కృష్ణారెడ్డి మరో ఐదుగురు తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ దామోదర్



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

పామూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ యాప్, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ దామోదర్ సూచించారు. సీఎస్పురం మండలంలోని భైరవకోన దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పామూరు పోలీస్స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్లతో మాట్లాడుతూ శక్తి టీం గురించి మీ సచివాలయ పరిధిలోని మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ ఎం.భీమానాయక్, ఇంటెలిజెన్స్ సీఐ కేవీ రాఘవేంద్ర, ఎస్ఐలు టి.కిశోర్బాబు, ఆర్. సుమన్, పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి ఊతం

ఆరు రకాల విభాగాలకు వర్తింపు ● రైతులు, కూలీలకు ప్రయోజనం ● అమలుకు యంత్రాంగం కృషి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

సంతనూతలపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, ఇటు కూలీలకు మరింత చేరువై ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి చర్యలు చేపట్టాయి. ఇందుకోసం ఆరు పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30వ తేదీ లోపు పూర్తి చేయాలని 200 రోజుల ప్రత్యేక కార్యక్రమంగా రూపొందించారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

అమలు చేస్తున్న పథకాలు..

ఫారంపాండ్లు : ప్రతీ పంచాయతీలో కనిష్ఠంగా 25 నిర్మించాలి. వీటిని రైతులు వ్యక్తిగతంగా తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునే విధంగా నిబంధనలు రూపొందించారు. దీనివల్ల భూగర్భజలాలు పెరగడంతో రైతు తన వ్యవసాయపనులతో పాటు చేపలు పెంచవచ్చు. రింగ్, బౌండరీ ట్రెంచ్ల తవ్వకంతో పొలాలు కోతకు గురికాకుండా కాపాడుకోవచ్చు.

ఫిష్ఫాండ్: నీటికుంటలు తీసి అందులో చేపల పెంపకానికి అనువుగా మార్చుకోవడం, ప్రతి పంచాయతీలో ఒక పాండ్ నిర్మించాలి. నీటికుంటగా కూడా వినియోగించుకోవచ్చు.

అమృత్సరోవర్: చెరువుతో పాటూ మైనర్ ఇరిగేషన్ సాగునీటి వనరులున్న ప్రతీ పంచాయతీలో ఒక చెరువును ఎంపికచేసి పూడికతీత, చెరువు కట్ట బలోపేతం, కంపచెట్లు తొలగించడం చేస్తారు.

గోకులం: పాడిపరిశ్రమ అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ ప్రతీ పంచాయతీలో కనిష్ఠంగా రెండు గోకులం షెడ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో గోకులం షెడ్లు నిర్మించారు. మరికొన్ని నిర్మాణాల్లో ఉన్నాయి.

ఉన్నతి: ఉపాధి కూలీల కుటుంబాల్లో 100 రోజుల పనిదినాలు పూర్తై ఆ కుటుంబంలో చదువుకున్న విద్యార్థుల కోసం వారికి ఇష్టమైన విభాగంలో నైపుణ్యాలపై ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణలో రోజుకు రూ.300 భృతి ఇస్తారు.

సంఘాలకు పునరుజ్జీవం: ప్రతీ 50 మంది కూలీలకు ఒక మేట్గా శ్రమశక్తి సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో ఉన్న ఈ పథకాన్ని మధ్యలో నిలిపివేశారు. మళ్లీ ఈ సంఘాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. కూలీల్లో చైతన్యం కలిగించి వారిని నిత్యం పనులకు వచ్చేలా కృషి చేస్తే ఒక్కో కూలీకి రోజుకు రూ.1.50 చొప్పున మేట్కు అదనంగా ఇస్తారు. వందరోజులు పూర్తయ్యాక రోజుకు రూ.3 లు చొప్పున ప్రోత్సాహకం లభిస్తుంది.

సంతనూతలపాడు మండలంలో...

పంచాయతీలు	-	18
100రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు	-	68
జారీ చేసిన జాబ్కార్డులు	-	7,507
పథకంలో నమోదైన కూలీలు	-	11,041

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పాలిసెట్-25కు హాజరయ్యే విద్యార్థులకు ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమైంది. మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉచిత శిక్షణ ఈనెల 25 వరకు కొనసాగనుంది. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు, ప్రస్తుతం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన వారు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివప్రసాద్ కోరారు.

11 నుంచి టైలరింగ్లో శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థలో ఈనెల 11వ తేదీ నుంచి నెలరోజుల పాటు ఉమెన్స్ టైలరింగ్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఆధార్కార్డు, రేషన్కార్డు కలిగి ఉండాలి. భోజనం, ఉచిత వసతి కల్పిస్తారు. వివరాలకు 8309915577 సెల్ నెంబర్ను సంప్రదించాలని ఆయన కోరారు.

యూనిక్ నంబర్ నమోదు వేగవంతం



మాట్లాడుతున్న ఏడీఏ రమేష్

సంతనూతలపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యూనిక్ నంబర్ రిజిస్ట్రేషన్ను వేగవంతం చేయాలని ఏడీఏ రమేష్ కోరారు. బుధవారం సంతనూతలపాడు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్లో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమానులు, భూరికార్డులు సరిగా ఉన్న రైతులను గుర్తించి రైతు రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా ఇనాం భూములు, డీకే పట్టాలు కలిగిఉన్న రైతుల పేర్లు కూడా నమోదు చేయాలని చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్కు సంబంధించి ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఎంతమేరకు రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. త్వరలో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 50శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. పంటకోత ప్రయోగాలు జాగ్రత్తగా నిర్వహించి ఫారం-1, ఫారం-2లను సకాలంలో సంబంధిత కార్యాలయానికి చేర్చాలని ఆదేశించారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280

మద్దిపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280 పలికింది. బి.నిడమానూరు రైతులు 315 బేళ్లు తీసుకువచ్చారు. కనిష్ఠ ధర కిలో రూ.235 పలికిందని వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కె.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలేని పొగాకు సీఆర్, నోబిడ్లు పెట్టాల్సి వస్తుందనే విషయాన్ని రైతులు గమనించి నాణ్యమైన పొగాకును తీసుకుని రావాలన్నారు. రైతు సంఘం నాయకులు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారిపెద్ది వరహాల చౌదరి, మండవ గోవిందరాజులు, మండవ శ్రీరామ్మూర్తి, కాకర్ల విజయ్కుమార్, రావి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ప్లేట్లు, గ్లాస్ల పంపిణీ



ప్లేట్లు, గ్లాసులను అందజేస్తున్న ఎస్ఐ అజయ్బాబు, దాతలు

సంతనూతలపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు బుధవారం సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాత ముల్లూరి గంగాప్రసాద్ అందించిన ప్లేట్లు, గ్లాసులను ఎస్ఐ వి.అజయ్బాబు చేతులమీదుగా అందజేశారు. మొత్తం 9 అంగన్వాడీ కేంద్రాలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందిజేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మద్దిపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాస ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని చెప్పారు. తనిఖీలు సమయంలో కూడా ఉద్యోగులు అందరూ లేకపోవడం సరైన విధానం కాదన్నారు. సచివాలయంలో ఇద్దరు ఉద్యోగులే మధ్యాహ్నం పూట విధులు నిర్వహిస్తుండడంపై అసహనం వ్యక్తం చేశారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



మల్లవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, జయంత్బాబు

మద్దిపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ సృజన్కుమార్ అన్నారు. బుధవారం మల్లవరం, అన్నంగి గ్రామాల్లో రీ సర్వేలను ఆయన పరిశీలించి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్బాబు మాట్లాడుతూ రైతులు తమ భూమి సమస్యలను పరిష్కరించేలా రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతులు రెవెన్యూ అధికారులకు పట్టాదార్ పాస్పుస్తకంతో పాటు రికార్డులను చూపించాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో దిలీప్, నాయకులు మార్నేని కృష్ణారావు, మార్నేని సుబ్బారావు, నారిపెద్ది వరహాలచౌదరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న స్కూలు ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాయర్పేటలోని శ్రీచైతన్య స్కూలులో జరిగిన ఐఎన్టీఎస్వో సెకండ్ లెవల్లో శ్రీచైతన్య విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వి.హన్సుజ గ్రాండ్ ప్రైజ్ సాధించగా, ఎస్.పూజిత ప్రథమ, సీహెచ్.అరాధ్య ద్వితీయ, నాగహైబవ్, రుత్విక్సాయిలు తృతీయ బహుమతులు పొందారు. నాల్గవ స్థానంలో ముగ్గురు, 5వ స్థానంలో నలుగురు, స్పెషల్ప్రైజ్లు 8 మంది, కన్సొలేషన్లు 146 మంది కలిసి 241 మంది విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక స్కూలులో ప్రిన్సిపాల్ జోసెఫ్ తంబి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్ప్రిన్సిపాల్ శివపార్వతి, ప్రైమరీ ఇన్చార్జి రజిని, ఒలంపియాడ్ ఇన్చార్జి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

బెస్త సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎంపికైన బేస్త సంఘం కమిటీ

కంభం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కంభం తెలుగువీధికి చెందిన బెస్త సంఘం సభ్యులు వారి కులదైవమైన అంకాలమ్మగుడిలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంతన బెస్తసంఘంగా నామకరణం చేశారు. అధ్యక్షునిగా ఇల్లా వెంకటసోమయ్య, గౌరవాధ్యక్షులుగా మొర్రిపోయిన చెన్నయ్య, వేల్పుల భూపాలుడు, సంఘ ఉపాధ్యక్షులు అప్పరపోయిన వెంకటయ్య, కార్యదర్శిగా చింతలపోయిన విజయ్, కోశాధికారిగా అప్పరబోయిన శ్రీరాములు, జాయింట్ కార్యదర్శి గువ్వా చిన్నప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

బాలయ్యయాదవ్‌కు ఆర్యవైశ్యుల సన్మానం



బాలయ్యను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమితులైన బైలడుగు బాలయ్యయాదవ్‌ను బుధవారం ఆర్యవైశ్యులు సన్మానించారు. కొప్పువారివీధి జయకృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌లో ఆర్యవైశ్యులు బాలయ్యను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. గర్రె సుబ్బారావు, సూరె రామచంద్రుడు, చీతిరాల రవి, మునగనూరి సత్యనారాయణ, శివపురం మురళి, కొత్త నాగేశ్వరరావు, కాకుమాను శ్రీనివాసులు, గర్రె పుల్లయ్య, కొప్పరపు నాగేశ్వరరావు, తదితరులు సన్మానించి అభినందించారు.

ముగిసిన స్పోర్ట్స్ టెస్ట్



విజేతలైన బాలికలకు మెడల్స్ అందజేస్తున్న అధికారులు

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాచర్లలోని స్పందన విద్యాసంస్థల్లో గత నెల 24వ తేది నుంచి జరుగుతున్న స్పోర్ట్స్ టెస్ట్ బుధవారంతో ముగిసింది. ఇందులో పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. చాంపియన్‌షిప్ అవార్డులను నలుగురికి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శివకోటేశ్వరరావు, విద్యాసంస్థల డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి మృతి

● అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు

మార్కాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. స్థానిక వడ్డెబజార్‌కు చెందిన కుంచాల ఆంజనేయులు (38) మృతిచెందాడు. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు వడ్డెబజార్‌కు చెందిన కుంచాల బాలకోటేశ్వరరావు, సాంబమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. వారిలో మూడోవాడైన ఆంజనేయులు కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. పెళ్లికానీ ఆంజనేయులు మద్యానికి బానిసగా మారాడు. ఎప్పటిలాగే మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లాడు. సాయంత్రం 5.00 గంటల సమయంలో తనకు తీవ్రంగా కడుపునొస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలిపాడు. వెంటనే ఆటోలో ఆంజనేయులును ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన తర్వాత సామాజిక మాధ్యమాల్లో యువకుడు ఆత్మహత్య అని ప్రచారం జరిగింది. దీంతో టౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేడు గురువారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవరత్నం బుధవారం తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు మార్చి 3వతేదీ నుంచి మార్చి 14వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం వివిధ అంశాలపై తనిఖీ చేసిందన్నారు. ఈ నివేదికలు బహిర్గతం చేస్తారన్నారు. కార్యక్రమానికి ఎస్‌ఆర్‌ఈజీఎస్ జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. సంబదిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా షబ్బీర్ నియామకం



షబ్బీర్

పొదిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పొదిలి జూనియర్ సివిల్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా షేక్ షబ్బీర్ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి బుధవారం నియామకపత్రం అందుకున్నారు. దాదాపు 25 ఏళ్లుగా షబ్బీర్ న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. షబ్బీర్ ప్రభుత్వ న్యాయవాదిగా నియామకం కావడంపై పలువురు న్యాయవాదులు, వివిధపార్టీల నాయకులు అభినందనలు తెలిపారు. మూడేళ్లపాటు ఆయన ప్రభుత్వ న్యాయవాదిగా ఆయన సేవలందించనున్నారు. ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యేందుకు సహకరించిన మార్కాపురం శాసనసభ్యులు కందులనారాయణరెడ్డి, మండల, పట్టణ టీడీపీ నాయకులకు షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి మృతి



మృతికి నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం దశబంధ చెరువు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు, టీడీపీ నాయకులు పేరం సుబ్బారెడ్డి బుధవారం మృతి చెందారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు బుధవారం ఉదయం వై.కొత్తపల్లి గ్రామంలో పేరం సుబ్బారెడ్డి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు తెలిపారు. ఆయన కుమారులను ఎరిక్షన్‌బాబు ఓదార్చారు.. టీడీపీ ఇన్‌చార్జ్‌తో పాటు మాజీ సర్పంచి సత్యనారాయణగౌడ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, దొంత వెంకట్రావుగౌడ్, నక్కా రాములు, షేక్.వలి, కిషోర్ పాల్గొని నివాళులు తెలిపారు.

భూముల రీసర్వేపై అవగాహన

● జగ్గంబొట్ల కృష్ణాపురంలో ర్యాలీ ప్రారంభించిన తహసీల్దార్ జితేంద్ర ● రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ

బేస్తవారపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రైతుల భూములు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రీసర్వే చేసి పట్టాదారు పుస్తకాలు ఇవ్వడం ద్వారా సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని తహసీల్దార్ జితేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో రీసర్వేపై అవగాహన సదస్సు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ రైతులు రీసర్వే సిబ్బందికి సహకరించి తమ భూములను సర్వే చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగార్జునరెడ్డి, సలీమ్ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ నగర్‌లో రీసర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎన్‌టీఆర్ నగర్‌లో రీసర్వే

గిద్దలూరు : పట్టణంలోని పీఎంఏవై ఎన్‌టీఆర్ నగర్ (పూర్వ జగనన్న కాలనీ)లలో ప్రస్తుత స్థితిగతులపై రెవెన్యూ శాఖ అధికారులు రీసర్వే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలలో ఇళ్లు ఎవరికి మంజూరయ్యాయి, ఎవరు నిర్మించారు, అందులో అసలైన లబ్ధిదారుడు ఉంటున్నాడా..? లేదా..? అద్దెకు ఇచ్చారా.?, ఇతరులకు అమ్మారా..? తదితర వివరాలు ఆరా తీశారు. ఈ లే-అవుట్‌లో క్రయవిక్రయాలపై ఫిర్యాదులు రావడంతో రీసర్వే కార్యక్రమాన్ని (విచారణ) నిర్వహించారు. నంద్యాల రోడ్డులోని రెండు కాలనీలలో వీఆర్‌వోలు, వీఆర్ఏలు బృందాలుగా ఏర్పడి సర్వే చేశారు. వీఆర్‌వో టీం ప్రతినిధులు రంగయ్య, శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, కాశీం తదితరులు సిబ్బందితో సర్వే నిర్వహించారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని రాయవరం గ్రామస్థులు తమ ఇళ్ల స్థలాలను గ్రామ మాజీ సర్పంచ్ ఆక్రమణకు యత్నిస్తున్నారని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీనివాసులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామవరం గ్రామస్థులు మాట్లాడుతూ 2009వ సంవత్సరంలో రాయవరం గ్రామ పరిధిలో 163/8 సర్వే నెంబర్‌లో ఇళ్లు లేని వారికి ప్రభుత్వం స్థలాలను మంజూరు చేసి ఇచ్చిందన్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దౌర్జన్యంగా స్థలాలను ఆక్రమించేందుకు ఇంటి బేస్‌మెంట్‌లను కూల్చి చదును చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు విచారించి తమ ఇంటి స్థలాలను తమకు ఇప్పించాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు.



జీబీకేపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

కంభం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వేసవిలో రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆయా గ్రామప్రజా ప్రతినిధులు, సంబంధిత పంచాయతీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వీరభద్రాచారి సూచించారు. బుధవారం ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఏప్రిల్, మే నెలల్లో ఎండలతీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. కంభం చెరువులో నీరు అడుగంటుతోందని, భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరు సక్రమంగా రాక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కావున ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిసమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పశువులకు నీటి కొరకు మండలంలో 35 నీటితొట్లను నిర్మిస్తున్నట్లు, గతంలో నిర్మించిన తొట్లకు మరమత్తులు చేసి వినియోగంలోకి తేవాలన్నారు. సర్పంచ్ బోడయ్య మాట్లాడుతూ ఇరిగేషన్ పంటకాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడం వలన మురికి కాలువలుగా మారిపోయాయని, కొన్నిచోట్ల తీసిన చెత్తను గట్లపైనే ఉంచారన్నారు. 3నెలలైనా తొలగించలేదని, ఆ చెత్త తిరిగి కాలవలోనే పడుతుందన్నారు. లక్షల రూపాయలు నిధులు మంజూరవుతున్నా ఆ నిధులు ఏమవుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో తహసిల్దార్ కిరణ్, ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్‌పిటిసి కొత్తపల్లి జ్యోతి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వీరభద్రాచారి

నాణ్యమైన విద్యుత్ అందించడమే విద్యుత్‌శాఖ లక్ష్యం

విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు

కొనకనమిట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే విద్యుత్‌శాఖ లక్ష్యమని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చినారికట్ల జంక్షన్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల కాలంలో కనిగిరిలో 33 కేవీ విద్యుత్ లైన్‌పై అధికలోడు కారణంగా కొనకనమిట్ల, హనుమంతునిపాడు తదితర మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈసమస్యను అధిగమించేందుకు జంక్షన్‌లోని సబ్‌స్టేషన్ నుంచి 2 కిలోమీటర్లు రూ 25లక్షల వ్యయంతో 33 కేవీ విద్యుత్‌లైన్ లాగామని చెప్పారు. దీనిద్వారా పొదిలి నుంచి కంభాలపాడు మీదగా 33 కేవీ విద్యుత్ వినియోగించుకొనే వీలుందని కొంతమేరా అధిక లోడు తగ్గించుకునే అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో 132 కేవీ సబ్‌స్టేషన్ గతంలో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఒక సంవత్సరంలో నిర్మాణం పూర్తయితే చాలావరకు ఈ ప్రాంతంలో వినియోగదారులకు, రైతులకు అంత రాయంలేని విద్యుత్‌ను అందించే వీలుందని పేర్కొన్నారు. తొలుత నూతనంగా ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్‌లైన్‌కు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో దర్శి డీఈ శ్రీనివాసరావు, డీఈ టెక్నికల్ వీరయ్య, ఏడీ హరిబాబు, ఏఈ వీరబ్రహ్మం, లైన్‌ఇన్‌స్పెక్టర్, పలువురు లైన్‌మెన్, ఏఎల్‌ఎంలు, జేఎల్‌ఎంలు, షిఫ్ట్‌ఆపరేటర్లు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తలైన్ ప్రారంభిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

కార్పెంటర్లకు రాయితీతో విద్యుత్ సౌకర్యం కల్పించాలి

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

పొదిలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కార్పెంటర్లకు కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంతో పాటు రాయితీతో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక యూనియన్ అధ్యక్షులు శేఖర్ కార్పెంటరీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పెంటర్లకు వుడ్‌కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, రాయితీపై విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన బీసీ కులాల చేతివృత్తుల వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేసి కార్పెంటర్లను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పణిదపు సుధాకర్, జిల్లా యూత్ అధ్యక్షులు తోపాటి జనార్థనాచారి, రాష్ట్ర నాయకులు పొన్నపల్లి బ్రహ్మానందం, రాచర్ల రాజశేఖర్, పొదిలి పట్టణ అధ్యక్షులు ఉప్పులూరి నారాయణ స్వామి, రంగస్వామి బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పెంటర్ల సంఘం నాయుకులు

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

బేస్తవారపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐక్య పాస్టర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో బేస్తవారపేటలో బుధవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలుపుతూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వేశపోగు బాలు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య. తోటకూరి పీటర్, సామ్యూల్ రామచంద్ర, పి.మహేష్ బాబుజి.జోసఫ్, టి.జాన్ విల్సన్, వేశపోగు భరణి,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీలను మోసం చేయడంలో వైసీపీ, టీడీపీలు రెండూరెండేనని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సయ్యద్ జావీద్ అన్వర్ బుధవారం విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీజేపీతో జతకట్టి ట్రిపుల్ తలాక్, సీఏఏకు మద్దతు ప్రకటించిందన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి టీడీపీ, జనసేన ఎంపీలు మద్దతు తెలపాలన్నారు. ఆ పార్టీలు విప్‌లు జారీ చేశాయన్నారు. ముస్లిం, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నారే తప్ప వారి అభివృద్ధికి తోడ్పడటంలేదన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పాలిసెట్-25కు హాజరయ్యే విద్యార్థులకు ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమైంది. విద్యార్థులకు మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉచిత శిక్షణ ఈనెల 25 వరకు కొనసాగనుంది. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు, ప్రస్తుతం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన వారు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివప్రసాద్ కోరారు. ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

అధిక మొత్తంలో బెల్లం అమ్మకాలు చేయరాదు

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిల్లర దుకాణాల యజమానులు అధిక మొత్తంలో బెల్లాన్ని ప్రజలకు విక్రయించరాదని అలా కొనుగోలు చేసిన వారి పూర్తి వివరాలు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎర్రగొండపాలెం సీఐ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులతో పాటు అన్నిరకాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, అటవీ ప్రాంతాలలో నాటుసారా తయారీ నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవోదయం - 2 కార్యక్రమం చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా నాటుసారాను నిర్మూలించేందుకు అన్నిశాఖల అధికారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. నాటుసారా తయారీ, అమ్మకాలు నేరమన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ నాటుసారా తాగడం ద్వారా జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. వాటిని నివారించేందుకు ప్రతి అధికారి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ నలగాటి మల్లికార్జున నాయుడు, ఎస్సై పి.చౌడయ్యతో పాటు అటవీశాఖ అధి కారులు మర్చంట్ సభ్యులు, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

150 లీటర్ల బెలం ఊట ధ్వంసం

గిద్దలూరు టౌన్: మండలంలోని ఓబులాపురం తండాలో ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ బట్టీని గుర్తించి 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ జయరావు మాట్లాడుతూ, ప్రభుత్వం నవోదయం-2లో భాగంగా సారా రహిత గ్రామాలను తయారు చేస్తోంది. ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది యూసఫ్ షరీఫ్, శ్రీపతి హరిబాబు, అసదుల్లా పాల్గొన్నారు.



వై.పాలెంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వరాహ అవతారంలో సీతారామస్వామి

గిద్దలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబద్వేల్ రోడ్డులోని సీతారామస్వామి దేవాలయంలో వసంతనవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారు వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా కుంకుమ పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదాతలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు మోటపోతుల రాంభూపాల్‌రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహక అధ్యక్షులు రాచపూటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి శివపురం వెంకటరామయ్య, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ నిరుద్యోగ యువతీయువకులకు తిరుపతిలో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు యూత్ ఫోర్ జాబ్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరిక దివ్యాంగులు, బదిరులు, వారిపని వారు చేసుకునే వారై ఉండాలని పదో తరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, పీజీలలో ఏదైనా విద్యార్హత కలిగి 19 నుంచి 34 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 9347411952, 7702020490 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ధ్రువీకరణ పత్రంతో ఏప్రిల్ 4వ తేదీ లోపు హాజరుకావాలన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం



గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని సాయి బాలాజీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలి అన్నారు. సాయిబాలాజీ పాఠశాలలో బుధవారం యూకేజీ పూర్తి చేసుకుని ఫస్ట్ క్లాస్‌కు వెళ్తున్న విద్యార్థు లకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు అందించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకుని తద్వారా విజ్ఞానం పెంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం టీవీ చూడటం తగ్గించాలన్నారు. విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ దురలవాట్లను తగ్గించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరం అన్నారు. అనంతరం విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్బన్‌కాలనీ సమస్యలు తీర్చాలని ధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కంభం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కంభం అర్బన్ కాలనీలోని సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు తీర్చాలని కోరుతూ కంభం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీలోని ప్రజలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రజాచైతన్యయాత్రలో భాగంగా నినాదాలు చేశారు. జిల్లా నాయకులు తోట తిరుపతిరావు, మండలపార్టీ నాయకులు షేక్ అన్వర్ మాట్లాడుతూ అర్బన్‌కాలనీ ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు అయినా నేటికీ సైడు కాలువలు లేవన్నారు. వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగునీటి పైపులు పగలడం వలన నీరు లీకేజ్ అవుతుందన్నారు. పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. స్పందించిన ఎంపీడీవో వీరభద్రాచారి కాలనీసమస్యలు తీరుస్తామని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు.

నవోదయలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక

తర్లుపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు విద్యాలయం నవోదయ-2లో ఆరో తరగతి, 9వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన విద్యార్థుల పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయని ప్రిన్సిపాల్ టీవీ గణేష్ కుమార్ తెలిపారు. ఆరో తరగతికి 80 మంది, 9వ తరగతికి 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. 9వ తరగతికి ఎంపికైన విద్యార్థులు హాల్ టికెట్‌లతో 3వ తేదీ నవోదయం విద్యాలయానికి రావాలని సూచించారు. 6వ తరగతికి ఎంపికైన విద్యార్థులు హాల్ టికెట్‌లతో 5వ తేదీ రావాలని ప్రిన్సిపాల్ గణేష్ కుమార్ తెలిపారు.

సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన యూరేక సైన్స్ ఎక్స్‌పోలో గిద్దలూరుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో జరిగిన పోటీలో స్ప్రింగ్‌బోర్డు విద్యార్థులు కె.మేఘన, ఎం.హర్షిత, కె.కీర్తిల బృందం ప్రథమస్థానంలో నిలిచింది. అరుణోదయ పాఠశాలకు చెందిన హిమబిందు, సయ్యద్ హర్షియ బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. పర్యావరణం-సుస్థిరాభివృద్ధి అనే విభాగంలో స్ప్రింగ్‌బోర్డుకు చెందిన ఆస్మా ప్రథమస్థానం పొందింది. మూఢనమ్మకాలు - శాస్త్రీయదృక్పథం అనే విభాగంలో సూర్య విద్యానికేతన్‌కు చెందిన సాయిమనోజ్ ప్రథమ స్థానం సాధించాడు. విజేతలకు జేవీవీ రాష్ట్ర నాయకులు స్వరూపారెడ్డి ఆయా పాఠశాలలకు వెళ్లి ప్రశంసపత్రం, బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో పాఠశాలల కరస్పాండెంట్లు బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, చైతన్య, ప్రైవేటు పాఠశాలల సంఘం మాజీ అధ్యక్షులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థలో ఈనెల 11వ తేదీ నుంచి నెలరోజుల పాటు ఉమెన్స్ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలి. భోజనం, ఉచిత వసతి కల్పిస్తారు. వివరాలకు 8309915577 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ



మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడుతున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

అన్న క్యాంటిన్ ఏర్పాటుకు రూ.61 లక్షల నిధులు మంజూరు

● డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దర్శిలో నిలిచిపోయిన అన్నక్యాంటిన్ నిర్మాణం పూర్తి చేసి ఆరంభించేందుకు రూ.61 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి మంజూ రైనట్లు టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని దివాకర్‌పల్లిలో బుధవారం సీబీజీ ప్లాంట్ భూమి పూజ చేసేందుకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను డాక్టర్ లక్ష్మి కలిశారు. ఈ సందర్భంగా నిలిచిపోయిన అన్నక్యాంటిన్ విషయాన్ని గుర్తు చేయగా ప్రభుత్వం నుంచి పబ్లిక్ అండ్ హెల్త్ శాఖకు రూ.61 లక్షల నిధులు మంజూరు చేసినట్లు నారా లోకేష్ చెప్పటంతో లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరించారు. అదేవిధంగా కురిచేడు ప్రాంతంలో కూడా సీబీజీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా అందుకు సానుకూలంగా స్పదించినట్లు ఆమె తెలిపారు. దర్శిలో డిగ్రీ కాలేజీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మరోసారి కోరగా త్వరలో విడుదల చేస్తానని భరోసా ఇచ్చినట్లు ఆమె వివరించారు. కూటమి పాలన పట్ల అన్నీ వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో సాంబశివరావు, హెచ్‌ఎం రామాంజనేయులు

క్రీడల్లో జాతీయస్థాయిలో దొనకొండకు గుర్తింపు

దొనకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దొనకొండ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభను కనబర్చుతూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చారని ఎంఈవో సాంబశివ రావు పేర్కొన్నారు. పాఠశాలలో స్పోర్ట్స్, ఎన్‌సీసీ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారిలో ఆశక్తిని పెంపొందిస్తూ జాతీయస్థాయిలో నిలిచేలా మంచి నైపుణ్యాలతో తర్ఫీదునిచ్చిన పీడీ నర్సింహారావును అభినందించారు. అనంతరం క్రీడా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు, స్థానిక బీసీ బాలురహాస్టల్ సంక్షేమాధికారి సురేష్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మారుమోగిన శివాలయం

● ఘనంగా నాల్గో వార్షిక వేడుకలు

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లిలోని శివాలయం నాల్గవ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని నగరేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో ఉన్న భ్రమరాంభ అమ్మవారు, వినాయకుడు, నందీశ్వరుడికీ ప్రత్యేక అలంకరణ చేశారు. శివాలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. సాయంత్రం పూట ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో నగరేశ్వర స్వామి



మేళతాళాలతో నైవేద్యం తీసుకు వస్తున్న ఉభయ దాతలు

వసంత నవరాత్రి వేడుకలు

పామూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాచూరివారి వీధిలో ని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకొంటున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవం నిర్వహిస్తూ స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం దేవాలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన ఉగాది సప్తాహాలు

కురిచేడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కురిచేడు కొండమీద వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఉగాది సప్తాహాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా భక్తులను అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూరె సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

ఆ ఐదు సమస్యల పరిష్కారం కోసమే నా తపన

మంత్రి లోకేష్ సహకారం మరువలేను

వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

సీబీసీ ప్లాంట్ భూమి పూజ సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికిన ఉగ్ర సతీమణి, పిల్లలు



సీబీసీ ప్లాంట్ భూమి పూజ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ప్రాంతం అభివృద్ధికి తాను 5 సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్నానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం దివాకరపల్లిలో బుధవారం రిలయన్స్ సీబీజీ ప్లాంట్ భూమి పూజా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ఇక్కడి వాసులు పనులు లేక వలసలు పోయి పరాయి ప్రాంతాల్లో జీవిస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే ఉపాధి, ఉద్యోగావకాశలు లభించాలనే సంకల్పంతో ఉన్నానన్నారు. తన సంకల్పాన్ని మంత్రి లోకేష్ తీర్చటం ఆనందంగా ఉందన్నారు. ఆయన పాదయాత్ర సమయంలో కనిగిరి ప్రాంత సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించటం గమనించానన్నారు. ఆరోజే అనుకున్నానని లోకేష్ ద్వారా కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందితీరుతుందని ఉగ్ర పేర్కొన్నారు. అందులో తొలి అడుగే రిలయన్స్ సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం అన్నారు. అదేవిధంగా ఇంటింటికి తాగునీటి కుళాయిల ద్వారా నీటిని అందిస్తే ప్రజలకు నీటి సమస్య తీరుతుందని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. నడికుడి రైల్వేలైన్ ఈ ప్రాంతంలో పూర్తి చేసేందుకు మంత్రి లోకేష్ నిధులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, అందుకు రుణపడి ఉంటామన్నారు. ట్రిపుల్ ఐటీని కనిగిరిలో పూర్తి చేసేందుకు లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వెలిగొండ జలాలతో కనిగిరి ప్రాంతంలోని ప్రతి నేల తడవాలన్న తన సంకల్పం నెరవేరుతుందన్నారు. ప్రధానమైనఈ 5 సమస్యలు పరిష్కారం అయితే కనిగిరి అభివృద్ధికి బాటలు పడి ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు.

వైసీపీ నేతలకు ఒళ్లు, కళ్లు మంట

కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే వైసీపీ నేతలు చూసి ఓర్వలేక పోతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీబీజీ ప్లాంట్ ఏర్పాటు వలన ప్రజలకు ఒళ్లు మంటలు, ఎలర్జీలు వస్తాయని లేనిపోని ప్రచారం రేపుతున్నారన్నారు. ప్రజలకు కాదని వైసీపీ నేతలకు ఒళ్లు, కళ్లు మంటలు పుట్టి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలు మానుకుంటే బావుంటుందని సూచించారు. ఉదయం 9 గంటలకే కార్యక్రమం అని పిలుపునివ్వటంతో వేకువ జాము నుంచే కనిగిరి ప్రాంతం లోని ప్రతి పల్లె నుంచి అశేషంగా తరలివచ్చిన ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు, శ్రేణులకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనతో పాటు యావత్తు అధికార యంత్రాంగం ఎంతో శ్రమించి కార్యక్రమం విజయవంతంలో భాగస్వాములైన వారికి ఎమ్మెల్యే ఉగ్ర అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. తొలుత హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సతీమణి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యురాలు డాక్టర్ కవిత, తనయ ఊహశ్రీ, తనయుడు జయసింహారెడ్డిలు మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సభావేదికపై లోకేష్‌ను ఘనంగా సత్కరించారు.



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఉగ్ర కుటుంబసభ్యులు

సభ విజయవంతంపై టీడీపీ శ్రేణుల హర్షం



సభలో పాల్గొన్న పామూరు టీడీపీ శ్రేణులు

పామూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నియోజకవర్గ ప్రగతి ఎమ్మెల్యే ఉగ్రతోనే సాధ్యమవుతుందని టీడీపీ శ్రేణులు కొనియాడారు. పీసీపల్లి మండలం దివాకరపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం విజయవంతం అయినందుకు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఉగ్ర పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలలో సభకు తరలి వెళ్లారని తెలిపారు. వెనుకబడిన కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి యువ నాయకుడు ,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టడం వలనే రిలయన్స్ ప్రాజెక్టు ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. సభికులను ఉద్దేశించి లోకేష్ చేసిన ప్రసంగం ఉత్తేజపరిచిందన్నారు. తక్కువ సమయంలో నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించడంపై ఎమ్మెల్యే ఉగ్రను లోకేష్ పొగడ్తలతో ముంచెత్తడం ఆనందంగా ఉందన్నారు. పామూరు, సీఎస్‌పురం మండలాల నుండి నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. సభకు వెళ్లిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కోటపాటి శ్రీనివాసులు, బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్‌చరి, బొల్లా నరసింహారావు, చుంచు కొండయ్య, బీజేపీ , జనసేన నాయకలు, తెలుగు మహిళలు ఉన్నారు.

నాయుడూ బాగున్నావా

● పలకరించిన లోకేష్



లోకేష్‌కు షేక్ హ్యాండ్ ఇస్తున్న పోకా నాయుడు

పామూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పీసీపల్లి మండలం దివాకరపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన బయోగ్యాస్ ప్రాజెక్టు భూమి పూజ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. హెలిప్యాడ్ నుంచి లోకేష్, ఎమ్మెల్యే ఉగ్రలు నడుచుకొంటు కార్యకర్తలకు అభివాదం చేస్తూ సభాస్థలి వద్దకు చేరుకొంటున్న తరుణంలో టీఎన్‌ఎస్వీ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు తారసపడ్డారు. దీంతో ఏం నాయుడు బాగున్నావా అంటు లోకేష్ ఆత్మీయంగా పలకరిస్తూ, యోగా క్షేమాలు అడగడంతో పాటు కరచాలం చేశారు. లోకేష్ జిల్లాలో ఎక్కడ పర్యటించినా తాను విధిగా పాల్గొని కలుస్తానని పోకా నాయుడు తెలిపారు.

అలరించిన సెయింట్‌మార్క్స్ విద్యార్థుల అభినయం

పామూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పీసీపల్లి మండలం దివాకరపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం సందర్భంగా వేదికపై పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పామూరు సెయింట్ మార్క్స్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దేశభక్తి పాటకు లయబద్ధంగా చేసిన నృ త్యాలు సభికులకు ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు, కరస్పాండెంట్ జయకుమార్‌ను నిర్వాహకులు అభినందించారు.

భారీగా తరలి వచ్చిన టీడీపీ కూటమి శ్రేణులు

పీసీపల్లి,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి):దివాకరపల్లిలో బుధవారం జరిగిన రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ భూమిపూజ కార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండలంలోని 18పంచాయతీలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వారివారి అనుచరులు, పార్టీ కార్యకర్తలతో కలిసివెళ్లారు.వీఐపీ పాస్‌లు కలిగిన నాయకులు హెలిప్యాడ్ సమీపంలో ఏర్పాటుచేసిన బారికేడ్‌ల వద్దకు చేరుకున్నారు.రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హెలికాప్టర్ దిగి భూమిపూజ జరిగే ప్రాంతానికి వస్తూ కార్యకర్తలకు అభివాదం చేశారు.దీంతో కూటమిశ్రేణులు పోటీపడి మరీ లోకేష్‌తో కరచాలనం చేశారు.ప్రతిఒక్కరికీ షేక్‌హ్యాండ్ ఇచ్చిన లోకేష్ భూమిపూజ అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ కార్యకర్తల అభిమానం మరోసారి యువగళం పాదయాత్రను తనకు గుర్తుచేసిందని అన్నారు.కార్యకర్తలతో ఫొటోలు దిగాలని ఉన్నప్పటికీ సమయాభావం వల్ల ఇప్పుడు కుదరడం లేదని ట్రిపుల్‌ఐటీ సభకు వచ్చినప్పుడు తప్పకుండా కార్యకర్తలతో ఫొటోలు దిగుతానని చెప్పారు. లోకేష్‌తో కరచాలనం చేసినవారిలో వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, కుక్కపల్లి నాగార్జున, బండారు వెంకట్రావు, పువ్వాడి నాగరాజు, వీరపనేని పెద్దన్న, నాగోతు శ్రీను, వడ్డెంపూడి వెంకట్ చాగంరెడ్డి మాలకొండయ్య, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గుర్రం మాల్యాద్రి, పులి ప్రతాప్‌రెడ్డి, బద్దిపూడి ఎబినేజరు, గుంటగాని జోసెఫ్, జనసేన నాయకులు మాదాసు రమేష్, బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు బలరాంరెడ్డి, నేరేడుపల్లి సర్పంచ్ పల్లా మల్లికార్జున్, గుడేవారిపాలెం సర్పంచ్ కనపర్తి శాంసన్, కూటమి నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

18 వేల మంది వచ్చినట్లు అంచనా !

పీసీపల్లి,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి):ఈ కార్యక్రమానికి సుమారు 10వేలమంది ప్రజలు వస్తారని భావించగా దాదాపు 17వేల నుంచి 18వేల వరకు వచ్చారు.నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, హెచ్ ఎంపాడు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల నుంచి ప్రజలు తరలి వచ్చారు.ఒక్క పీసీపల్లి మండలం నుంచే దాదాపు 5వేలమందికి పైగా స్వచ్ఛందంగా తరలివచ్చారు.మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు.సభా ప్రాంగణం ఉదయం 9గంటలకే ప్రజలతో నిండిపోయింది.ప్రజలు భారీగా తరలిరావడంతో భూమిపూజ జరిగే ప్రాంతానికి పీసీపల్లి నుంచి వచ్చే రోడ్డు, పెదఅలవలపాడు నుంచి వచ్చే రోడ్డు రెండు మార్గాలు కూడా వాహనాల రాకపోకలతో నిండిపోయాయి.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, మజ్జిగ ప్యాకెట్‌లు, మంచినీళ్ల బాటిళ్లను అందించారు.మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కూటమినేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరునాళ్లను తలపించిన భూమిపూజ కార్యక్రమం

కనిగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పీసీపల్లి మండలం దివాకరల్లిలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన కార్యక్రమం బుధవారం తిరునాళ్లను తలపించింది. మంత్రి లోకేష్ భూమి పూజ చేశారు. తొలుత హెలికాప్టర్ ద్వారా సీబీజీ ప్లాంట్ భూమి వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, మంత్రులతో పాటు కలెక్టర్ తమీమ్ అన్సరియా, ఎస్పీ దామోదర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద నుంచి కిందకు దిగుతున్న మంత్రి లోకేష్‌కు కనిగిరి పుడమి తల్లి ఎర్రరంగు తివాచీ పరచినట్లుగా మారి నేల మురిసిపోయింది. అక్కడి నుం చి నడుచుకుంటూ ప్లాంట్ వద్దకు చేరుకునే సమయంలో లోకేష్‌ను కలసి కరచాలనం చేసేందుకు నేతలు, ప్రజలు, యువకులు పోటీపడ్డారు.

కనిగిరిలో ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన

కనిగిరిలో ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు వస్తానని మంత్రి లోకేష్ అన్నారు. కనిగిరి రైల్వే ప్రాజెక్టుకు ఏప్రిల్‌లో అవసరమైన నిధులిస్తున్నట్లు చెప్పారు. ఆ సమయంలో ప్రజలనుంచి పెద్దఎత్తున హర్షధ్వానాలతో, చప్పట్లతో సభా ప్రాంగణం మారుమోగింది. మిగిలిపోయిన వెలుగొండ పనులు పూర్తిచేసి చివరి ఎకరాకు నీరిస్తామన్నారు. కనిగిరిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పదే, పదే గుర్తు చేస్తున్నట్లు చెప్పారు. తన సోదరసమానులు పవనన్నతో చర్చించి, ఒప్పించి కనిగిరి ప్రాంతంలో నిప్రతి ఇంటికి కుళాయి నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తుంటే వారిపై కోపం రావటం లేదని, కొంత జాలేస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు మారుమూల జిల్లాలోని కనిగిరి ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుంటే చూసి కళ్ల మండుతున్నాయన్నారు. దీంతో సీబీజీ ఏర్పాటు వలన ఒళ్ళు మంటలు వస్తాయని పనికిమాలిన దుష్ప్రచారం చేస్తున్నారని, వారిని ఒదిలి పెట్టమని రెడ్‌బుక్‌లోకి ఎక్కిస్తామని హెచ్చరించారు. కనిగిరి అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే కృషిని ప్రజలు గుర్తించాలన్నారు.

నకిలీ మొక్కజొన్న విత్తనాలతో మోసం

● ఐదు నెలలైనా రాని కంకులు

● లబోదిబోమంటున్న సాగు రైతులు



కంకులురాని మొక్కజొన్న చేను

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన కోనేరు రామకోటేశ్వరరావు, గోరంట్ల వర ప్రసాదు, మానం వర లక్ష్మి తదితరులు సాగు చేసిన మొక్కజొన్న పైరు ఐదు నెలలు గడిచినా కంకులు రాలేదు. దీంతో తాము నకిలీ విత్తనాలతో మోస పోయామని లబోదిబోమంటున్నారు. గత ఏడాది నవంబరు 22వ తేదీన బాపట్ల జిల్లా పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన బాలాజీ సీడ్స్ షాపులో టైనస్ అనే మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశారు. ఐదు నెలలైనా ఇంత వరకు కండె రావటం గాని, కొన్ని చోట్ల మూడు నుంచి ఐదు కండెలు రావటం జరగటంతో మోస పోయామని గ్రహించారు. ఇప్పటికే ఎకరానికి రూ.35 వేల వరకు ఖర్చు పెట్టారు. తీరా రైతులు పంట చేతికి వస్తుందనుకొనే సమయంలో నకిలీ మోస పోయామని లబోదిబో మంటున్నారు. దీంతో రైతులు బాలాజీ సీడ్స్ నిర్వాహకుల వద్దకు వెళ్లి తమకు నకిలీ విత్తనాలు అంటకట్టారని, తాము భారీగా నష్టపోవాల్సి వచ్చిందని వాపోయారు. ఈ విషయాన్ని రైతులు బుధవారం సాయంత్రం ముండ్లమూరు వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ వద్దకు వచ్చి విషయం తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

పామూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ యాప్, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ దామోదర్ సూచించారు. సీఎస్‌పురం మండలంలోని భైరవకోన దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పామూరు పోలీస్ స్టేషన్ సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్‌లతో మాట్లాడుతూ శక్తి టీం గురించి మీ సచివాలయ పరిధిలోని మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ ఎం. భీమానాయక్, ఇంటెలిజెన్స్ సీఐ కేవీ రాఘవేంద్ర, ఎస్‌ఐలు టి. కిశోర్‌బాబు, ఆర్. సుమన్,పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



భైరవకోన దేవస్థానంలో ఎస్పీ దామోదర్

ప్రతిభ చాటిన బొద్దికూరపాడు విద్యార్థి రోహిత్‌రెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) :అమరావతి ఒలంపియాడ్ ఎడ్యుకేషన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషన్‌మ్యాథ్మెటిక్స్ పరీక్షల్లో బొద్దికూరపాడువిద్యార్థి పోలంరెడ్డి రోహిత్‌రెడ్డి ప్రతిభ చాటారు. గుంటూరులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అమరావతి ఎడ్యుకేషన్ ఫౌండర్ డి.లక్ష్మీనారాయణ రోహిత్‌రెడ్డికి సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన రోహిత్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచటం పట్ల గ్రామానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.


గురుకుల ప్రవేశ పరీక్ష 13కి వాయిదా

కురిచేడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 6వ తేదీన జరగవలసిన ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఆరోన్ బాబు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 13వ తేదీ పరీక్షా సమయానికి రావాలని ఆయన కోరారు.

ముండ్లమూరు ఎస్‌ఐ బదిలీ

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న వై.నాగరాజును బదిలీ చేస్తూ గుంటూరు జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉదయం ఉత్తర్వులు పంపారు. ఈయనను బాపట్ల జిల్లా వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కాలువలో ఉన్న మృతదేహం

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రగిరి సమీపంలోని శ్రీరామ్ డెయిరీ సమీపంలో మురుగు కాలువలో దాసరి మహేష్(42) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ముండ్లమూరులో గత కొన్నాళ్లుగా నివాసం ఉంటున్న దాసరి మహేష్ తన తల్లి వద్ద ఉంటూ రోజూ ముండ్లమూరు పోయి వస్తుంటాడు. ఐతే ఆదివారం నుంచి మహేష్ కన్పించ లేదు. దీంతో బంధువులు వెతుకులాట ప్రారంభించినా కన్పించ లేదు. చివరకు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో పొలాలకు వెళ్తున్న కొంత మందికి మురుగు కాలువలో పడి ఉన్న యువకుడు మృత దేహం కన్పించింది. ముండ్లమూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పరిశీలించగా విఠలాపురం గ్రామానికి చెందిన దాసరి మహేష్‌గా గుర్తించారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తల్లి రామలింగమ్మ ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల అదే పంచాయతీ పరిధిలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన ఇరు వర్గాల మధ్య బుధవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మారెళ్ల గ్రామానికి చెందిన బత్తుల పవన్, సాయి తేజ, కళ్యాణ్‌లకు గాయాలయ్యాయి. బత్తుల పవన్ గంగన్నపాలెం సమీపంలోని ఒక వెంచర్ వద్ద ఉండగా గంగన్నపాలెంకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి ఘర్షణ పడ్డారు ఘర్షణలో గాయపడిన ముగ్గురిని అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. గంగన్నపాలెంకు చెందిన పోతిరెడ్డి కృష్ణారెడ్డి మరో ఐదుగురు తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ

మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన గాలం శ్రీనివాసరావు, సుంకర భాస్కర్‌రెడ్డిలకు చెందిన 25 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు బుధవారం తెల్లవారు జామున ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగితీగను అపహరించుకుపోయారు. రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.



గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం రైలు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 3వ తేదీ గురువారం గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలుని నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07011 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు గురువారం రాత్రి 8.15కి బయలుదేరి 10.43కి నడికుడి, 11.13కి పిడుగురాళ్ల, 11.43కి సత్తెనపల్లి, రాత్రి 12.30కి గుంటూరు, శుక్రవారం ఉదయం 9.30కి విశాఖపట్టణం చేరుకొంటుందన్నారు. విశాఖపట్టణం వెళ్లే ప్రయాణీకులు ఈ రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధితో.. వలసలకు.. కళ్లెం

- వేసవి వలసల నివారణకు చర్యలు
- మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు
- రోజు కూలి రూ. 300గా ప్రకటన
- ఐదు రకాల పనులకు ప్రాధాన్యం

వేసవిలో వలసల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల వారీగా ఉపాధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేశారు. మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. గత ఏడాది చేసిన పని దినాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది పని దినాలను రూపొందించారు. ఏడాది మొత్తంలో నెలల వారీగా ఏ నెలలో ఎన్ని పని దినాలు కల్పించాలన్న నివేదికను సిద్ధం చేశారు. పని దినాలను లక్ష్యాల మేర పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పల్లెల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నారు.



నరసరావుపేట : ఉపాధి పనుల్లో కూలీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం పల్లెలకు ప్రగతి బాటలు వేస్తోంది. పథకంలో పేరు నమోదు చేసుకున్న ప్రతి కూలీకి వంద రోజులు పనిదినాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా పనులను గుర్తించారు. ప్రతి కూలీకి కనీస వేతనం రూ. 300గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. నీటి సంరక్షణ, నీటి నిల్వలో భాగంగా వాగులు వంకలు, కుంటలు చెరువులు, చెక్ డ్యామ్‌ల్లో పూడికతీత పనులతో పాటు ఊట కుంటలు, పంట నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, రహదారుల నిర్మాణం, రైతుల పొలాల్లో ఉద్యాన పండ్లతోటల సాగు, మొక్కల నాటడం వంటి పనులు చేపట్టనున్నారు.

జిల్లా	పని దినాలు
పల్నాడు	74,77,946
గుంటూరు	34,20,809
బాపట్ల	76,56,945

పల్నాడు జిల్లాలో జాబ్ కార్డులు 3.4 లక్షలు జారీ చేశారు. 5.84 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 2.51 లక్షలు కాగా 4.27లక్షల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. బాపట్ల జిల్లాలో 2.69 లక్షల జాబ్ కార్డులు జారీ చేశారు. 4.75 లక్షల మంది కూలీలను నమో దు చేశారు. 2.05లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. 3.58 లక్షల మంది కూలీలు పనులకు హాజరవు తున్నారు. గుంటూరు జిల్లాలో 1.26 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 2.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 91,815 ఉన్నాయి. 1,44,399 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

డ్వామా శాఖ ఇందుకు సంబంధించిన ప్రణాళికను విడుదల చేసింది. రానున్న మూడు నెలల్లో చేపట్టే పనుల జాబితాను రూపొందించింది. ఐదు రకాల పనులకు ప్రాధాన్యం కల్పించారు. పనులు వివరాలు ఇలా ఉన్నాయి. పశువులు గుంపుగా చేరుటకు అనువుగా ఉన్న ప్రదేశమలో నీటి తొట్లను నిర్మిస్తారు. ఈ పనులను 1న ప్రారంభించారు. ఈ నెల 10 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

పల్నాడు జిల్లాలో 14,000 సేద్యపు నీటి కుంటలను నిర్మించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. గుంటూరు జిల్లాలో 8,500, బాపట్ల జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్యం మేరకు పూర్తి చేయడం. త్వరితగతిన ఇన్లెట్, అవుట్ లెట్, సిల్ట్ ట్రాప్ పనులను పూర్తి చేయనున్నారు.

పంట కాలువ.. ఫీడర్.. సప్లై ఛానల్ పనులు అవసరాన్ని బట్టి పనులు చేయనున్నారు. 3 సంవత్సరాల కాల వ్యవధి పాటించడం. కూలీలకు పూర్తి దినసరి వేతనం రూ. 300 తగినట్లు మార్కింగ్ ఇచ్చి పని చేయించడం. వర్షాకాలం వచ్చే లోపు పంటకాలువ పనులను పూర్తిచేయను న్నారు. విస్తృత స్థాయిలో కూలీలకు పని కల్పించడం. చెరువు.. కుంటలను వాటి అసలు సామర్థ్యం వుండే విధంగా పునరుద్ధరిం చడం. మట్టి గుంతలను చెరువు కట్ట అడుగు నుండి కట్టఎత్తు కంటే పది రెట్ల దూరం తరువాత తవ్వడం. గ్రూపులు.. కూలీల సంఖ్య ఆధారంగా పూడిక గుంతల కొలతలు కేటాయిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన దినసరి వేతన రేటు రూ. 300 ప్రతి ఒక్కరు పొందే విధంగా ఆయా పనులకు సంబంధించిన ఖచ్చితమైన పని కల్పించే విధంగా మేట్లు శ్రద్ధ వహించాలి. ప్రతి శుక్రవారం రోజ్ గార్ దివస్ సందర్భంగా కూలీలకు ఆయా పనులకు సంబంధించిన దినసరి వేతనంపై ఎప్పటికప్పుడు ఖచ్చితమైనఅవగాహన కల్పిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న వేగేశన

ఐదేళ్ల చిన్నారిని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేగు బంధాన్ని తెంచుకుని తల్లి వదిలేసి వెళ్లిపోగా.. ఐదేళ్ల చిన్నారిని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేరదీసి మానవత్వం చాటుకున్నారు. ఆ చిన్నారి బాధ్యత తనదని దత్తతు తీసు కుంటానని చెప్పడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని 1వవార్డు బేతనీకాలనీలో బుధవారం మనవార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని వేగేశన నిర్వహించారు. ఆ ప్రాంతంలో పర్యటించే సమయంలో ఆదరించేవారు లేక, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అందక చిన్నభిన్నమైన కుటుంబంలోని ఐదేళ్ళ చిన్నారి పరిస్థితి గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఇద్దరు పిల్లల్ని తల్లి సత్తెనపల్లిలో వదిలేసి వెళ్లి పోగా విషయం తెలుసుకున్న నాయనమ్మ వారిని చేరదీసింది. ఈ విషయం ఎమ్మెల్యేకు తెలిపి తన ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్ళింది. దీంతో స్పందించిన వేగేశన ఐదేళ్ల చిన్నారి మేఘశ్రీని దత్తతు తీసుకుంటానని అక్కడికక్కడే ప్రకటించారు. ఇక నుంచి ఆ బిడ్డకు అన్నీ తానై చూస్తానని, దత్తతు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీంతో ఆప్రాంత ప్రజలు ఎమ్మెల్యే ఉదారతపై ప్రశంసల వర్షం కురిపించారు.



దత్తత తీసుకున్న పాపతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం



- 22 వరకు సీనియర్ ఇంటర్ తరగతులు
- 25 వరకు కళాశాల వసతిగృహాల నిర్వహణ
- విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్ మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. పరీక్షల అనంతరం నుంచి విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో సీనియర్ ఇంటర్ తరగతులను గురువారం నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీనియర్ ఇంటర్ తరగతులు పునః ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 22 వ తేదీ వరకు సీనియర్ ఇంటర్ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసి ద్వితీయ సంవత్సరంలోకి రానున్న విద్యార్థులు తప్పని సరిగా కళాశాలలకు రావాలని ఇప్పటికే ప్రిన్సిపల్స్ నుంచి సందేశాలు అందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 65 వేల మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. మార్చిలో జరిగిన పరీక్షలు పూర్తి చేసుకుని ఇప్పటికే విద్యార్థులు సెలవుల్లో ఉన్నారు. తాజాగా తరగతుల ప్రారంభానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారంతా తిరిగి కళాశాలలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ద్వితీయ సంవత్సరంలో కనీసం రెండు మూడు యూనిట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విద్యార్థులను కళాశాలకు రప్పించేందుకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కళా శాలల హాస్టళ్లలో ఈ నెల 25 వరకు ఇంటర్ విద్యార్థులకు వసతి కల్పిస్తారని ప్రిన్సిపల్స్ చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రికార్డులు పంపిణీ చేసేందుకు అధ్యా పకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



లాటరీ దందాపై నిఘా ఏదీ?



జిల్లాలో యథేచ్ఛగా సింగిల్ నంబర్ లాటరీ

- రోజువారీ కూలీలే ఏజెంట్ల టార్గెట్
- బాపట్ల, చీరాల, రేపల్లెలో విస్తృతం

ఫలానా లాటరీ టిక్కెట్ కొంటే అదృష్టదేవత మీ ఇంటి తలుపు తడుతుంది. టిక్కెట్ ధర కూడా వంద రూపాయలే. రాత్రికి రాత్రే కోటీశ్వరులు అయిపోవచ్చు" ఇలాంటి ఆకర్షణీయ ప్రకటనలతో ఏజెంట్లు విసిరే వలలో వేతన జీవులు పడుతున్నారు. రోజువారీ కూలీ పనులకు వెళ్లేవారు, ఆటో డ్రైవర్లే టార్గెట్‌గా ఈ లాటరీ దందా జిల్లాలో వేళ్లూనుకుంటోంది. సిక్కిం, నాగాలాండ్, కేరళ ఇలా ఇలా రకరకాల ప్రాంతాల పేరుతో టిక్కెట్లను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. 2021 నుంచి 2024 వరకు ఈ లాటరీ టిక్కెట్ల వ్యవహారంపై జిల్లాలో 16 కేసులు నమోదవగా అన్నీ చీరాల పరిధిలోనివే కావడం గమనార్హం. వ్యవస్థలకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పి తమ దందాను కొనసాగిస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లాలో సింగిల్ నెంబర్ లాటరీ, మట్కా జూదం జోరుగా సాగుతోంది. పలు రాష్ట్రాల పేర్లతో ఈ లాటరీ టిక్కెట్ల అమ్మకం జరుగుతూ ఉంటుంది. టిక్కెట్ ధర వంద రూపాయలనుంచి వెయ్యి రూపాయల వరకు ఉండడం, వీటి మీద తగిలే మొత్తాలను మాత్రం లక్షల నుంచి కోట్ల వరకు ఏజెంట్లు ఆశ చూపడంతో దినసరి కూలీలు వీరి మాటలను తేలికగా నమ్మి కష్టపడ్డ సొమ్మును ఏజెంట్లకు సమర్పించుకుంటున్నారు. బాపట్లలో రథంబజార్‌లో ఉదయం పూట రోజువారీ పనుల కోసం పెద్దఎత్తున కార్మికులు ఉంటారు. అదే విధంగా చీరాల, రేపల్లెలో సైతం పనుల కోసం గుంపులు గుంపులుగా కూలీలు నిలబడి ఉంటారు. వీరిలో ఒకరిలా కలిసిపోయే ఏజెంట్లు వారిని మాయమాట లలో లోబర్చుకుని టిక్కెట్లు వారికి అంటగడు తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే వాట్సాప్ ద్వారా కూడా టిక్కెట్లు పంపే విధానానికి ఇటీవల ఏజెంట్లు శ్రీకారం చుట్టినట్లు చెబుతున్నారు. ఈ తరహా దందా లకు బడ్డీకొట్లు, టీ హోటళ్లు కూడా వేదికగా మారి నట్లు తెలుస్తోంది. ఒక వేళ కలిసొచ్చి నంబర్‌కు లా టరీ తగిలినా ఏజెంట్లు ముఖం చాటేయడంతో తా ము మోసపోయామని ఆలస్యంగా తెలుసుకుంటున్నారు.

కట్టడి విషయంలో నిర్లక్ష్యమే...

ఇలాంటి దందాలు ఎక్కడా కూడా బహిర్గతంగా జరగవు. అన్ని గుట్టుమట్టుగానే జరుగుతుంటాయి. కట్టడి చేయాలన్నా, దందా మూలాలు వెలుగు చూడాలన్నా కూడా నిఘా వర్గాలే కీలకం. కానీ ఆ దిశగా శోధిస్తున్న దాఖలాలు కనబడడం లేదు. ఏజెంట్ల ద్వారా మోసపోయిన వారు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే భయపడుతున్నారు. దీనికి కారణం ఒక్కటే అసలు లాటరీ టిక్కెట్లు కొనడమే అనధికారికం కనుక ఎవరికి వారు మిన్నకుండిపోతున్నారు. ఒకట్రెండు ఘటనల్లో బాధితులు స్టేషన్ మెట్లెక్కినా ఏజెంట్లు ముడుపుల మాయాజాలంతో వ్యవస్థలను కూడా మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం

గంటగంటకూ ఫలితాలంటూ ఎర...

ఆయా రాష్ట్రాల పేరుతో సింగిల్ నంబర్ లాటరీ టిక్కెట్లు అమ్మడం ఓ రకం దందా అయితే ఊరు పేరులేకుండా కేవలం చీటీల మీద నంబర్లు వేసి ఇచ్చి వేతన జీవులను నిలువునా మోసం చేస్తున్నారు. ఉదయం 12 గంటల వరకు వీటి అమ్మకాలు తర్వాత గంటగంటకు లాటరీ తీశామంటూ ఏజెంట్లు నంబర్లు ప్రకటిస్తూ ఉంటారు. ఈ దందా మొత్తం కేరళ నుంచి ఆపరేట్ అవుతుందని బాధితులను ఏజెంట్లు నమ్మించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు.

ఈపూరుపాలెం నుంచి వేటపాలెం వరకు...

చీరాల నియోజకవర్గంలో సింగిల్ నెంబర్ లాటరీ యథేశ్ఛగా సాగుతోంది. ఈపూరుపాలెం మొదలుకుని జాండ్రపేట, దేవాంగపురి. వేటపాలెం వరకు నిత్యం లాటరీ హద్దులు దాటుతుంది. అమాయకులే లక్ష్యం గా ఈ దందా పెద్ద ఎత్తున నడుస్తుండగా వేటపాలెం, జాండ్రపేటకు చెందిన వ్యక్తులు ఈ రాకెట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ దందా ఆఫ్ లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్ వేదికలపై ఉదయం 7కు మొదలుకుని ప్రతి మూడు గంటలకు బుకీ లు ఆన్ లైన్ యాప్ ద్వారా ఓ సెన్సెక్స్ కూడా విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. వారి వద్ద రూ.10 తో కొను గోలు చేసిన స్లిప్పులను సెన్సెక్స్ ద్వారా విడుదల చేసిన సమ యంలో ఒక నెంబర్ విడుదలవుతుంది. విడుదలయిన నెంబర్‌ను వారి వద్ద ఉన్న నెంబర్‌కు మ్యాచ్ చేసుకుంటూ ఉంటారు. అయితే చివరి వరకు నెంబర్‌లు విడుదల యినా తరువాత పూర్తి నెంబర్‌లు మ్యాచ్ అయిన వ్యక్తికి పదింతల నగదును చెల్లిస్తామని ఆశచూపెడుతు న్నారు. ఈక్రమంలో అమాయకుల ఆశ లను ఆసరాగా చేసుకుని ఏజెంట్లు డబ్బులు దండుకుంటున్నారు. అయితే గతంలో ఈపూరుపాలెం, వేటపాలెం, చీరాల వన్‌టౌన్‌లో కేసులు నమోదైనాయి. కానీ ఇటీవల పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానా లకు తావిస్తోంది.



70 కాదు.. 140 మీటర్లు

దేశంలోనే అతిపెద్దగా అమరావతి ఓఆర్ఆర్

- ఫలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషి
- 189.4 కిమీల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- మూడు దశల్లో.. మూడేళ్లలోపు పూర్తిచేసేలా కాలపరిమితి

దేశంలోనే అతిపెద్దదిగా.. రాజధాని నగర అభివృద్ధిలో కీలక ప్రాజెక్టుగా.. అద్భుతంగా.. సబర్బన్ రైళ్ల మార్గంతో.. పది వరుసల్లో.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డుతో.. ఔటర్ రింగురోడ్డు 140 మీటర్ల వెడల్పుతో అమరావతికి ఓ మణిహారంగా నిర్మాణం కానున్నది. గతంలో 70 మీటర్లకు పరిమితం చేసిన కేంద్రం తాజాగా దానిని 140 మీటర్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. రాజధానికి మెరుగైన కనెక్టివిటీ, రహదారి వెంబడి వచ్చే కారిడార్ల ఏర్పాటుతో జరిగే ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధితో అమరావతి నగర విస్తరణను తనదాకా నడిపించడంలో ఈ ఓఆర్ఆర్ పెద్ద ఆకర్షణశక్తిగా పనిచేయనున్నది. భవిష్యత్‌లో అమరావతి నగర ప్రజల జీవన ప్రమాణాల తాలూకు నాణ్యతను బాగా మెరుగుపరచడంలో కూడా ఈ ఓఆర్ఆర్ కీలకపాత్ర పోషించనుంది.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అమరావతి చుట్టూ ఔటర్‌రింగురోడ్డును దేశంలో కెల్లా అతిపెద్దదిగా నిర్మించాలనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు అనుకున్న ప్రకారమే కార్యరూపం దాల్చుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డును 189.4 కి.మీ.ల పొడవునా 150 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయాలన్న చంద్రబాబు పట్టుదల ముందు కేంద్రం తలొగ్గింది. గత ఫిబ్రవరిలో ఓఆర్ఆర్ వెడల్పును 70మీటర్లకు పరిమితం చేస్తూ కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆరు వరుసల రహదారిగా నిర్మించాలని, లోపలి వైపున మాత్రమే సర్వీసు రోడ్డును నిర్మిస్తే సరిపోతుందని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణను 70 మీటర్లకు పరిమితం చేయొచ్చని గత నెలలో నిర్ణయించి రూ.16,310 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేసింది. అయితే ఇది ఎంతమాత్రం కుదరదని వెడల్పు ఆది నుంచి అనుకుంటున్న విధంగా 150 మీటర్ల ఉండాల్సిందేనంటూ సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్పష్టం చేస్తూ ఇటీవల లేఖ రాశారు. దీంతో 140 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్ఆర్ పేరిట 189.4 కి.మీ.లకు భూసేకరణకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై ఏర్పడిన ప్రతిష్ఠంభన చిట్టచివరికి తొలగిపోవడంతో త్వరలోనే టెండర్లను కేంద్రం ఆహ్వానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓ వైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకుంటున్న నేపథ్యంలో వాటికి సమాంతరంగా ఔటర్ రింగు రోడ్డు పనులను కూడా ప్రారంభించాలని చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. రాజధాని నిర్మాణ పనులను వచ్చే మూడేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఓఆర్ఆర్‌ను కూడా మూడు దశల్లో మొత్తం మూడేళ్లలోపుగా పూర్తి చేసేలా కాలపరిమితి సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్నారు. నిజానికి గత నెలలో ఓఆర్ఆర్ తాలూకు భూసేకరణ విషయంలో పడిన పీటముడి వీడడానికి మరింత సమయం పట్టవచ్చునన్న ఊహాగానాలను పటాపంచలు చేస్తూ యుద్ధప్రాతిపదికన 140 మీటర్ల వెడల్పున భూసేకరణ చేసేలా కేంద్రాన్ని రాష్ట్రప్రభుత్వం ఒప్పించగలిగింది.

రూ.20 వేల కోట్లకు పెరగనున్న అంచనా వ్యయం

అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టు వ్యయం పెరగనుంది. గతంలో ప్రకటించిన విధంగా రూ.16310 కోట్లకు బదులు మరికొంత పెరిగే అవకాశం కనిపిస్తుంది. గతంలో సివిల్ వర్కుల అంచనా వ్యయాన్ని రూ.12,955 కోట్లుగా నిర్ణయించగా తాజాగా ఓఆర్ఆర్‌కు వెలుపలి వైపు కూడా సర్వీసు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించడంతో వ్యయం మరో రూ.500 కోట్లకుపైగా పెరిగే అవకాశం ఉంది. అలాగే భూసేకరణ వ్యయం దాదాపు రెట్టింపవనున్నది. 70 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ నిర్మాణం చేయాలనుకున్నపుడు 4,220 ఎకరాలు సరిపోతుందని భావించి వ్యయం రూ.2,665 కోట్లుగా (మిగతా 6వ పేజీలో)

చక్రం తిప్పిన చంద్రబాబు



అమరావతి ఓఆర్ఆర్ 70 మీటర్లు.. ఆరు వరుసలతో సరిపోతుంద ని కేంద్రం గత నెలలో నిర్ణ యించింది. అయితే భవిష్యత్తులో పది వరసలకు పెంచాల్సి వస్తుందని.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగితేనే ఔటర్‌కు బాహ్యంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని.. ఓఆర్ఆర్ వెంటే సబర్బన్ రైల్వేలైను నిర్మించాలన్న ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయని సీఎం చంద్రబాబు కేంద్రానికి వివరించారు. ప్రధానంగా పదిలేన్లుగా విస్తరించాల్సి వచ్చినపుడు కొత్తగా భూసేకరణ అంటే ఖర్చు విపరీతంగా పెరుగుతుందని చెప్పారు. దీంతో చంద్రబాబు కోరినట్లు 150 మీటర్లు కాకుం డా 140 మీటర్ల వెడల్పుకు ఆమోదం తెలి పింది. మొత్తమ్మీద చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఓఆర్ఆర్ నిర్మాణం జరగనున్నది.

కాలువలో నీరు పారేదెట్టా..?

రైతుల్లో ఆందోళన

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం వెంపరాల కొండ మట్టిని తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వెంపరాల కొండ నుంచి నామ్ రోడ్డుకు వచ్చేందుకు చినకొత్తపల్లి మైనర్ 4 కాలువ కట్టను వినియోగిస్తున్నారు. దీంతో కట్టను వెడల్పుగా చదును చేసే క్రమంలో చిల్ల చెట్లు, వ్యర్థాలను పక్కనే ఉన్న కాలువలోకి పడేస్తున్నారు. అసలే మరమ్మతులు లేక నీటి ప్రవాహం సరిగ్గా లేని కాలువ కాస్తా పూర్తిగా పూడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రావెల్ తరలింపు సుమారు ఏడాది సమయం పట్టే అవకాశం ఉండడంతో సాగర్ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకి కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రావెల్ తరలింపు చేపట్టగా దుమ్ము పంట పొలాలపైకి వచ్చి పంటలు దెబ్బతింటాయని రైతులు అడ్డగించడంతో తాత్కాలికంగా విరమించారు. కాలువ కట్టను చదును చేయడం సరే.... నీటి ప్రవాహం సంగతి ఎలా అని రైతులు ఆందోళన చెందున్నారు. గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాలువ పూడిపోకుండా, పంటలకు నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



చినకొత్తపల్లి మైనర్ 4 కాలువ కట్ట ను చదును చేసి చిల్లచెట్లు, వ్యర్థాలను కాలువలో పడేయంతో అనవాళ్లు కనిపించకుండా ఉన్న కాలువ



అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విశేషంగా పాటుపడుతున్నట్లు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన నివేశన స్థలాలు - 90, పింఛన్‌లు - 40 అర్జీలు స్వీకరించారు. అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, శివ నాగ మల్లేశ్వరి, పద్మిని, ఆర్‌కే నాయుడు పాల్గొన్నారు.

సారా రహిత ప్రాంతంగా మార్చాలి



నవోదయం 2.0లో ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సారా రహిత ప్రాంతంగా చీరాలను మార్చేందుకు ప్రజలు సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రామానగర్, ఆదినారాయణపురం, ఈపూరుపాలెం, ఉజిలీపేట, దండుబాట, సాయికాలనీ, లక్ష్మీపురం, వాడరేవు ప్రాంతాల్లో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రచారరథం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా వద్దు - ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సారా నియంత్రణకు 14405కు కాల్ చేసి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణంపై అధికారులు దాడులు

- పెద్ద మొత్తంలో తేడాలు గుర్తింపు
- 6 ఏ, క్రిమినల్ కేసు నమోదు



సరుకు వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, డీటీ గీతారాణి

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని విఠల్‌నగర్ రేషన్ దుకాణం-19పై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈక్రమంలో పేద ప్రజలకు అందించాల్సిన 244 క్వింటాళ్ల రేషన్ బియ్యం, షుగర్ ప్యాకెట్స్ - 460, కందిపప్పు - 418 ప్యాకెట్స్ నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిర్వాహకులపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దాడుల్లో తహసీల్దార్ గోపీకృష్ణ, సివిల్ సప్లయిస్ డీటీ గీతారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. దాడులు నిరంతరం ఉంటాయని పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇతర శాఖాపరమైన అంశాల్లో భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

తాబేళ్ల సంరక్షణకు కృషి చేయండి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరంలో తాబేళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం రాత్రి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో టౌన్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమాలు, ప్రజల సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా గురువారం తెల్లవారు ఝామున తాబేళ్లను తీరంలోకి వదులుతున్నట్లు చెప్పారు. అలాగే వాటి రక్షణ బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పట్టణ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో టౌన్ క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బూదవాడ విద్యార్థులు

పంగులూరు, ఏప్రియల్ 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ)పై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి 21వ శతాబ్దపు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా చీరాలలోని ఎన్‌ఆర్‌పీఎం ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 10 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించగా, బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కె.జగన్మోహనరెడ్డి, బి.చంద్రారెడ్డి, కె.కోటేశ్వరరావు ఆయుర్వేద మెడిసన్ ఫర్ కిడ్నీ ప్రాబ్లమ్స్ (ప్రకృతివైద్యం)పై చేసిన ప్రాజెక్ట్ ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపిక కాగా చీరాల ఎన్‌ఆర్‌పీఎం పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ధన్వంతరి దంతసిరి (పళ్లపొడి) ప్రాజెక్ట్ ద్వితీయ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈ రెండు ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు బూదవాడ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ సుధారాణి తెలిపారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ ప్రాజెక్ట్‌లు ప్రదర్శించనున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు

త్వరలో రేషన్ స్మార్ట్‌కార్డులు

- ఈనెలాఖరులోపు ఈకేవైసీ పూర్తయ్యాక చర్యలు చేపట్టే అవకాశం
- ఒకేసారి కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేదలకు ఇచ్చే రేషన్‌ను కార్డుదారులకు అందించడమే ప్రధాన లక్ష్యంతో అనేక మార్పులకు నాంది పలికింది. అందుకోసం ఇప్పటి వరకు ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు(ఏటీఎం సైజు) కార్డుదారులకు ఇచ్చేందుకు అంతా సిద్ధం చేసింది. రాష్ట్రంలో గతేడాది నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటివి చేపట్టలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రక్రియను కూడా వారం పదిరోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో 6.61 లక్షల రేషన్‌కార్డుల పరిధిలోని సభ్యుల నుంచి ఈకేవైసీ చేపట్టిన ప్రభుత్వం ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేసే విధంగా దిశానిర్దేశం చేసింది. ప్రస్తుతం పంపిణీ జరుగుతుండగా అక్కడే లేని వారికి ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే కార్డుల్లో చేర్పులు, మార్పులతోపాటు తొలగింపులు చేసేందుకు ప్రభుత్వం అప్షన్లు ఇవ్వనుంది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను ఇవ్వనున్నారు. ఈ కార్డులో ఇంటి కుటుంబసభ్యులు ఎంతమంది ఉంటే అంతమంది ఫొటోలు కూడా ఉండటంతోపాటు పూర్తి అడ్రసు కూడా ఉంటుంది. ప్రస్తుతం అన్నింటిని రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్న పరిస్థితుల్లో ఆ కార్డులను జేబులో పెట్టుకునేందుకు కూడా ఈజీగా ఉంటుంది. ఆ ప్రక్రియ మే నెలల ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించడంతో ఆ శాఖ అధికారులు తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ చేసేందుకు ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు కే.ఎర్రయ్య అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ 11వ వేతన సవరణ కమిషన్ ముగిసి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం కొత్తది ఏర్పాటు చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయడంతోపాటు 2003 డీఎస్సీ వారికి కేంద్రప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 70ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలు చేయాలన్నారు. 117 జీవోను రద్దుచేసి ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా అమలు చేయాలని, ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియార్టీ జాబితాలో ఉన్న తప్పులను సవరించి మెరిట్ కం రోస్టర్ ప్రకారం రీ ఆర్గనైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటన్నింటిని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎస్ ఎండి రఫీ, వి.మాధవరావు, జయరావు, వై.వెంకట్రావు, ఎస్‌కే అబ్దుల్‌హై, వి.జనార్దన్‌రెడ్డి, బి.వెంకట్రావు, కే.శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసులు, పి.వెంకట్రావు, జీవీకే కీర్తి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఫ్యాప్టో నాయకులు

గంటలో రిజిస్ట్రేషన్

- రోజంతా వేచి ఉండాల్సిన అవసరం లేదు
- డాక్యుమెంట్ల రిజిస్టర్‌కు స్లాట్ బుకింగ్
- ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రాలలో రేపటి నుంచి

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ శాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నారు. పాతకాలం నాటి విధానాలకు చెల్లుచీటి ఇస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు లేకుండా తమకు వెసులుబాటు ఉన్న సమయంలో వెళ్లి గంట వ్యవధిలో పనిచేసుకొని తిరిగి వచ్చే విధంగా స్లాట్ సిస్టంను అమలులోకి తీసుకురానున్నారు. తొలుత ఏప్రిల్ 1 నుంచి అని చెప్పినప్పటికి సాంకేతిక కారణాల వలన ఈనెల 4 నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. ఇప్పటికే నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సబ్ రిజిస్ట్రార్లకు పాతకాలంలో ఉన్న స్టేజిలను తొలగించి, అధికారులు, ప్రజలకు ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా మార్పులు చేశారు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఎదురుగా కూర్చుని దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలుగా మార్పులు చేసారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే వారు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేసి వారికి మంచినీళ్లు, టీ, కాఫీలు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. అదేక్రమంలో స్లాట్ బుకింగ్ విధానం వలన సమయం వృథాకాకుండా ఉంటుందని, ఈనెల 4 నుంచి కొత్త విధానం అమలులోకి తీసుకొస్తున్నారు. ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలోని ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌ను అమలు చేయనున్నారు.

78 స్లాట్లు అందుబాటులో..

ప్రస్తుతం ఒంగోలులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో అవసరమైన వారు తమ దస్తావేజులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. వారికి అనువైన సమయంలో ఖాళీ గా ఉన్న స్లాట్‌ను ఓకే చేసుకొని ఆ సమయంలో కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ వారి దస్తావేజులను సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు. అందుకు సంబంధించి వేలిముద్రలను, సంతకాలను కార్యాలయ సిబ్బంది సేకరిస్తారు. దీంతో సమయం వృథాకాకుండా కేవలం గంటలోనే ప్రక్రియ పూర్తవుతుంది. ఒంగోలు కార్యాలయంలో 78 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. అక్కడ ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు ఉంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు స్లాట్లు అందుబాటులో ఉంటాయి.

బుకింగ్ ఇలా..

రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో తమ దస్తావేజును అప్‌లోడ్ చేయాలి. దీంతో అప్లికేషన్ నంబరు వస్తుంది. ఆ నంబరును నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. స్లాట్ టైమ్‌లో సంబంధిత క్రయ విక్రయదారులు కార్యాలయంలో అందుబాటులో ఉండాలి.

స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన కల్పించాం

స్లాట్ బుకింగ్ విధానంపై ఇప్పటికే ప్రజలకు, మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులకు అవగాహన కల్పించాం. ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజు 78 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఇంకా ఏరోజు నుంచి స్లాట్లు అందుబాటులో ఉంటాయనేది ఆదేశాలు రావాల్సి ఉంది. ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రమే ఈ విధానం అమలు చేయనున్నారు.

- కె.శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్, ఒంగోలు ఆర్వో



శారీపై ప్రింటింగ్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్‌లు, పాల్గొన్న స్థానికులు

మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధితో నైపుణ్యం పెంచుకుని ఆర్థికంగా రాణించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. డిప్రసూన రాణి అన్నారు. బుధవారం ఈపూరుపాలెం ఐకార్ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా గ్రామంలో స్వయం ఉపాధి కల్పనపై శిక్షణ అందించారు. హస్తకళల విలువను తెలియజేశారు. చీరలపై హ్యాండ్ పెయింటింగ్, స్క్రీన్ పెయింటింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీవ రసాయన శాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ డా. సంధ్య, డా. హేమ, డా. సుశీల, డా.సువర్ణలత, స్థానిక మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు, భక్తులు

వైభవంగా శ్రీరామ మందిరం ప్రతిష్ఠోత్సవం

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని ఉజిలీపేట ప్రధాన రహదారిలో శ్రీరామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అర్చకులు కమిటీ ప్రతినిధులు నిర్వహించారు. ఈసందర్భంగా హోమాలు నిర్వహించి, అత్యంత వైభవంగా సీతారామ లక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొనగా, గురువారం విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు.

70 కాదు.. 140 మీటర్లు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఇపుడు అది 140 మీటర్లకు చేరుకోవడంతో వ్యయం రూ.5 వేల కోట్లను మించే అవకాశం ఉంది. అంటే మొత్తం ఓఆర్‌ఆర్ అంచనా వ్యయం రూ.20 వేల కోట్లు అవనున్నది.

ఓఆర్‌ఆర్‌తో పాటే ఐఆర్‌ఆర్ కూడా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఓఆర్‌ఆర్‌తో సంతృప్తి చెందకుండా ముందు ప్రతిపాదించిన విధంగా అంతర వలయ రహదారి(ఐఆర్‌ఆర్) నిర్మాణంపై కూడా దృష్టి పెట్టింది. ఓఆర్‌ఆర్ నిర్మాణ వ్యయం భరించనున్న నేపథ్యంలో ఐఆర్‌ఆర్‌ను పక్కన పెట్టాలని కేంద్రం దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఆర్‌ఆర్ విషయమై ఇంకా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ముందుకురాని పక్షంలో పీపీపీ విధానంలో అయినా నిర్మించి తీరాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తుంది.

వాకింగ్ కు వెళ్ళే మహిళలు అప్రమత్తంగా ఉండాలి-సిఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్‌కు వెళ్లే మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అ ప్రమత్తంగా ఉండాలని సిఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డు, రేణింగవరం రోడ్డు తదితర ప్రాంతాలలో మహిళలు ఉదయం, సాయం త్రం సమయాలలో వాకింగ్ వెళ్ళేటప్పుడు విలువైన ఆభరణాలు ధరించకుండా వెళ్ళాలన్నారు. వాకింగ్ కు వెళ్ళే మహిళను టార్గెట్ గా బంగారం గొలుసులు దొంగతనం చేసే వ్యక్తులు మోటార్‌సైకిల్ పై వచ్చి మహిళల మెడలో ఉండే ఆభరణాలు లాక్కొని వెళ్ళే సంఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్న దృష్ట్యా అ ప్రమత్తం గా ఉండాలన్నారు. అదే సమయంలో అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే ఆ మోటార్ సైకిల్ ను సెల్ ఫోన్ లో ఫోటో తీయాలన్నారు. ఎక్కువ మంది మహిళలు ఉంటే ప్రతిఘటించి అదుపులోకి తీసుకోవాలన్నారు. మెడలో బంగారు ఆభరణాలు కనిపించకుండా జా గ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉపాధి పనులతో సమాజ అభివృద్ధి

- డ్వామా పీడీ విజయలక్ష్మి
- సంతమాగులూరులో 2023-24 పనులపై ప్రజా వేదిక
- 895 పనులకు రూ.2,22,72,641 ఖర్చు

సంతమాగులూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులతో సమాజంలోని సమగ్ర అభివృద్ధికి పునాదులు ఏర్పడుతున్నాయని బాపట్ల జిల్లా డ్రామా పీడీ కేవీ విజయలక్ష్మి పేర్కొన్నారు. సంతమాగులూరు మండలంలో 2023- 24లో జరిగిన పనులపై గ్రామాల్లో ప్రత్యేక బృందాలు సామాజిక తనిఖీ అనంతరం బుధవారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 20 గ్రామపంచాయతీలో మొత్తం ఎనిమిది వందల తొంబై ఐదు పనులు చేపట్టగా దానికి గాను రూ.12కోట్ల22లక్షల72,641 ఖర్చు చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన పనులు 36 పంచాయతీరాజ్ ద్వారా నిర్వహించగా ఒకటి గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. తొలగించిన క్షేత్ర సహాయకులు ప్రజావేదికకు రాకపోవడంతో ఉన్నతాధికారులకు బదులు ఇవ్వడంలో క్షేత్ర సహాయకులు కొంత మేర తడబడ్డారు. ప్రజావేదిక కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్, ఎంపీడీఓ జ్యోతిర్మయి, ఏ పి డి కోటనాయక్, ఏ పి ఓ నాయక్ పాల్గొన్నారు.

మిన్నెకల్లు సినిమా థియేటర్‌లో మోటారు చోరీ

సంతమాగులూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిన్నెకల్లు గ్రామంలోని అమ్మ సినిమా థియేటర్‌లో మంగళవారం రూ.40 వేల విలువైన మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసారని యజమాని సుబ్బారావు తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎంటీఎస్ టీచర్ల తాత్కాలిక తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు విధానంతో మినిమం టైమ్ స్కేలుతో పనిచేస్తున్న డీఎస్సీ 1998, 2008 టీచర్ల తొలగింపునకు రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ పి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. వీరిని నియమించిన కాంట్రాక్టు విధానంలోనే వీరితో 11 నెలలు పని చేయించుకొని మిగిలిన నెల నోవర్క్ నోపే కింద పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో పాఠశాలల అవసరాల దృష్ట్యా వీరిని 2024 జూన్‌లో నియమించారు. 11 నెలలు అంటే ఏప్రిల్ 30తో గడువు ముగుస్తుంది. 30న సాయంత్రం వీరందరిని ఉద్యోగాల నుంచి తొలగించాలని డీఈవోలను ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ ఆదేశించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం తదుపరి సూచించిన ప్రకారం ఉత్తర్వులు ఇస్తామని పేర్కొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పాలిసెట్-25కు హాజరయ్యే విద్యార్థులకు ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమైంది. మేథమేటిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నారు.

చంద్రన్న పథకాలతో ప్రజల హర్షాతిరేకాలు

» సీఎం వరాలపై స్థానిక వర్గాల్లో ఆనందం

» హామీలపై కృతజ్ఞతలు

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం నిరుపేద ప్రజలకు వరాలు కురిపించింది. అందుకు సంబంధించి మంగళవారం చినగంజాం మండలం పెదగంజాంలోని కొత్తగొల్లపాలెంలో జరిగిన ప్రజా వేదిక సభలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పథకాలపై స్పష్టమైన హామీ ఇచ్చారు. తల్లికి వందనం, రైతు భరోసా, మత్స్యకార భరోసా, డీఎస్సీని సైతం విడుదల చేస్తామంటూ ప్రకటించి ప్రజల బాగోగులుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వైసీపీ హయాంలో అరకొర పథకాలు, చాలీచాలని నిధులతో కోతలు విధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. దీనిపై ప్రజలు వారి అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.



తోటవారిపాలెం సచివాలయంలో రైతు పథకాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మత్స్యకారులకు భరోసాతో సంతోషం



ఏటా ఏప్రిల్, మేలో అలల తాకిడికి గుడ్డు ఉత్పత్తి జరిగి మత్స్య సంపద పెరుగుతుంది. ఈక్రమంలోనే వేటను రెండు మాసాలు నిలిపి వేస్తాం. దీంతో ప్రభుత్వం మాకు భరోసా అందిస్తుంది. ఈక్రమంలోనే గత ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు ప్రకటించినప్పటికీ గతేడాది ఇవ్వలేదు. చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మత్స్యకార భృతిని రూ.20వేలుగా ప్రకటించడంతో పాటు జూన్‌లోపే భరోసా అందిస్తానని హామీని ఇవ్వడం ఆనందంగా ఉంది.

- అర్జిల్లి సత్తిబాబు, వాడరేవు మత్స్యకారుడు

గతంలో ఒక బిడ్డకే



నేను చేనేత కార్మికురాలిని. నిరుపేద కుటుంబం ఈక్రమంలో ఇద్దరి బిడ్డల చదువుకు గతంలో నానా యాతన పడ్డాను. ఈ సారి ఏకంగా ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలకు ప్రభుత్వం తల్లికి వందనం ప్రకటించింది. ఈసారి వేసవి ముగియగానే పథకం అమలు చేస్తుండడం ఆనందంగా ఉంది. థాంక్యూ సీఎం సార్.

- ఆకురాతి ఉమాదేవి, సావరపాలెం

ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు



నిరుపేద కుటుంబంలో జన్మించాను. తల్లి దండ్రులు అప్పులు చేసి చదివించారు. పీహెచ్‌డీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాను. టీడీపీ కూటమి ప్రభుత్వం జూన్‌లోపే డీఎస్సీ ని విడుదల చేస్తున్నట్లు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం ఆనందంగా ఉంది.

- అవ్వారు శ్రీనివాసరావు, నిరుద్యోగి, ఈపూరుపాలెం

రైతులు నష్టపోకుండా చర్యలు



గత ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.13,500 ప్రకటించింది. అయితే అమలులో తీవ్ర జాప్యం నెలకొంది. ఈక్రమంలో రైతులు నానా తిప్పలు పడాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం భరోసాను రూ..20 వేలకు పెంచడంతోపాటు వేగంగా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం ఆనందంగా ఉంది.

- రావిపాటి హరిబాబు, తోటవారి పాలెం రైతు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం, ఐఈఆర్‌టీలు

ఆటిజం అంటువ్యాధి కాదు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆటిజం అనేది జబ్బు కాదు, అంటువ్యాధి అసలే కాదని, ఇది ఒక స్థితి మాత్రమని ఐఈఆర్‌టీ కొంగల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అద్దంకి సత్రంబడి ఆవరణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటిజంకు ప్రత్యేకంగా మందులు ఏమీ లేవని, నివారణకు థెరపీటిక్స్ శిక్షణ, చిన్నారుల తల్లిదండ్రులకు అవసరమైన కౌన్సెలింగ్ మాత్రమే సమస్యకు పరిష్కారం అన్నారు. ఆటిజం చిన్నారులలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని, వీ రిని కోపగించుకోవడం, నేరుగా చూడడంగాని, ఎగతాళి చేయడం చేయరాదన్నారు. రెండేళ్ల వయస్సులో సమస్యను గుర్తించి చికిత్సకు తీసుకెళ్లాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించాలని, పూర్తి సమాచారం కోసం దగ్గరలోని భవిత కేంద్రంలో సందర్శించి తగు సూచనలు పొందాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆట పాటలు నిర్వహించి సత్రం బడి పాఠశాల హెచ్ఎం రామారావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ యోనా, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన గీతామందిర్‌లో ఉదయం 9 గంట నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినుకొండకు చెందిన వెన్నెల నేత్రాలయం సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. బుధవారం కార్యాలయంలో కంటి వైద్య శిబిరం కరపత్రాన్ని సభ్యులు ఆవిష్కరించారు. కంటి వైద్యులు డాక్టర్ దస్తగిరి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు జరుగుతాయని అద్దంకి పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళి సుధాకరరావు, దేవపాలన, చంద్రమౌళి, మహమ్మద్ రఫీ, గృహలక్ష్మి, శ్రీలక్ష్మి, శివకుమారి పాల్గొన్నారు.

నేడు, రేపు చీరాల వైద్యశాలలో అంధత్వ పెన్షన్ లబ్ధిదారులకు వైద్య పరీక్షలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల నందు గురు, శుక్రవారాలల్లో అంధత్వం కలిగిన దివ్యాంగ పెన్షన్ దారులలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఎంపీడీవో బత్తిన సింగయ్య బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. సంబంధిత లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు పంపించామని, ఆయా పెన్షన్‌దారులు తమకు కేటాయించిన తేదీల్లో వైద్య పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు. నోటీసులు రాని అంధ దివ్యాంగుల పెన్షన్ దారులకు, ఇతర కేటగిరీల దివ్యాంగులకు వైద్య పరీక్షల తేదీలను మరలా తెలియజేస్తామని చెప్పారు.

దాతల సహకారం అభినందనీయం

ఇంకొల్లు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల, విద్యార్థుల విద్యాభ్యున్నతికి దాతలు అందిసున్న సహాయం అభినందనీయమని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. ఈ పాఠశాలలో ప్రతి ఏడాది 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి విద్యాభ్యున్నతికై అదే గ్రామానికి చెందిన పొన్నం అనంతలక్ష్మి తన భర్త వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కెనరా బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీని వారికి నగదు బహుమతిగా అందించేలా ముందుకువచ్చారు. బుధవారం దాత అనంతలక్ష్మిని పేరిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అంబటి సుబ్బారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఐదుగురు అరెస్ట్

స్థలం వివాదంలో జరిగిన ఘటన

గవినిపాలెం(చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు తీవ్రంగా కత్తితో దాడిచేసి గాయపరచగా అతను ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈమేరకు నమోదైన కేసులోని నిందితులను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చీదరబోయిన నాగేశ్వరరావుకు, చీదరబోయిన భరత్, వీరయ్య, లక్ష్మీనారాయణకు స్థలం వివాదాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గత ఆదివారం నాగేశ్వరరావు నాయనమ్మ రాములమ్మ తన స్థలంలో ఇంటి నిర్మాణం నిమిత్తం బేస్ మట్టం చేయించుకుంటుంది. దీనికి సంబంధించి హద్దు విషయంలో రాములమ్మతోపై ముగ్గురు వాదనకు దిగారు. దీంతో విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ నాగేశ్వరరావు వారిని నిలదీశాడు. పై ముగ్గురితో పాటు మరో ఇద్దరు కలిసి నాగేశ్వరరావును కత్తితో ఘోరంగా దాడి చేయగా శరీరంపై పలుచోట్ల రక్త గాయాలు అయినాయి. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈ కేసులోని ఐదుగురు నిందితులను బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్‌చేసి, గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

ఏపీవో రేణుకా బదిలీ

ఇంకొల్లు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల జాతీయ ఉపాధి హామీ అధికారిగా గత ఐదు సంవత్సరాలుగా బాధ్యతలు చేపట్టిన ఏపీవో రేణుకా యద్దనపూడి మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న సురేష్ పర్చూరుకు బదిలీ అయినట్లు చెప్పారు.

సీఎం పర్యటన విజయవంతంపై ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు

పర్చూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీ, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ చూపి పర్చూరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పీ-4 కార్యక్రమంలో భాగంగా అధినేత పిలుపుతో కదలి వచ్చిన బంగారు కుటుంబం మార్గదర్శకులకు, పర్యటనను ఎక్కడా కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేసిన జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు తెలిపారు.



సీఎం చంద్రబాబు పర్యటనలో ఎమ్మెల్యే ఏలూరి

నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య అన్నారు. బుధవారం సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరో అతిథిగా టెక్ మహీంద్ర కంపెనీ ప్రతినిధి వెంకట గోపీచంద్ హాజరయ్యారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విద్యార్థి దశ నుంచి ఆచరించాల్సిన లక్షణాలను, లక్ష్యాలను వివరించారు. ప్రజా వ్యవస్థకు విద్యార్థులు మూలమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రేపు ఎంపీడీవో కార్యాలయంలో క్రెడిట్ క్యాంప్

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఓబీ ఎంఎంఎస్ సైట్‌లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు క్రెడిట్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. బ్యాంకర్ల సమక్షంలో క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు వెనుకబడిన వర్గాలువారి కోసం బీసీలకు 16 యూనిట్లకు 31 లక్షలు, ఈడబ్ల్యూఎస్ వారికి 8 యూనిట్లకు రూ.14లక్షలు మంజూరయ్యాయన్నారు.

నేడు రీ-సర్వేపై ర్యాలీ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పోలూరు, యనమదల గ్రామాలలో గురువారం రీసర్వేపై అవగాహనా ర్యాలీలను ప్రారంభిస్తున్నామని, రైతులు తప్పని సరిగా పాల్గొనాలని తహసీల్దారు కె.రవికుమార్ కోరారు.

రెస్టారెంట్‌ల వ్యర్థాలు కాలువలో వేస్తే చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రెస్టారెంట్‌ల నుంచి వ్యర్థాలను జల్లెడలు ఏర్పాటు చేసుకోకుండా నేరుగా సైడ్ డ్రైన్‌లలోకి వదిలితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. నామ్ రోడ్డు వెంబడి పోతురాజుగండి, భవానీసెంటర్ మధ్యలో ఉన్న రెస్టారెంట్‌ల నుంచి వచ్చే మురుగు నీరు కాకానిపాలెంలో నిలిచి దుర్వాసన వెదజల్లుతున్న నేపథ్యంలో స్థానికులు మంగళవారం రాత్రి మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. రవికుమార్ ఆదేశాలతో కమిషనర్ రవీంద్ర బుధవారం పరిశీలించి రెస్టారెంట్‌ల నిర్వాహకులతో మాట్లాడారు. ఎన్టీఆర్‌నగర్‌లో మంచినీటి సమస్యను కూడా పరిశీలించారు. వేసవి ఎద్దడి నుంచి గట్టెక్కేందుకు మూడు సింథటిక్ ట్యాంక్‌లు, రెండు పబ్లిక్ ట్యాప్ లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



కాకానిపాలెంలో కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

మందుబాబులకు అడ్డాగా మండల పరిషత్ కార్యాలయం

» రాత్రుళ్లు ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లి మందు పార్టీలు

» ఉదయానికి ఖాళీ గ్లాసులు, బాటిళ్లు దర్శనం

» ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజల విజ్ఞప్తి



కార్యాలయ ప్రాంగణంలో తాగి పడేసి ఉన్న ఖాళీ గ్లాసులు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మందుబాబుల ఆగడాలకు హద్దే లేకుండా పోతుంది. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోకి కొందరు రాత్రుళ్లు వెళ్లి పూటుగా మద్యం సేవించి పార్టీలు చేసుకుంటున్నారు. తాగిన గ్లాసులు, సీసాలు అక్కడే పడవేసి పోతున్నారు. అధికారులు మందు బాబులు రాకుండా కార్యాలయ గేట్లకు తాళాలు వేయిస్తున్నా ప్రహరీ గోడను దూకి లోపలికి వెళ్లి ఎంచక్కా తాగుతున్నారు. బల్లికురవ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రి పూట కొందరు మద్యం తాగి, రకరాల ఆహార పదార్థాలను తిని వదిలేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం పడమర భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో విచ్చలవిడిగా మద్యం సీసాలు, గ్లాసులు పడి ఉంటున్నాయి. ఉదయం ఉద్యోగులు విధులకు వచ్చే సరికి కార్యాలయం ముందు ఉన్న విశ్రాంతి బల్లల మీద మద్యం బాటిళ్లు ఉండి అంతా అపరిశుభ్రంగా మారుతుంది. వీటిని చూసిన వారు కార్యాలయం ప్రహరి గేటుకు కూడా తాళాలు వేయిస్తున్నారు. అయినా గేట్లను, గోడను దూకి లోపలికి వచ్చి పార్టీలు చేసుకుంటున్నారు. రాత్రి సమయంలోకార్యాలయంలో వాచమన్‌ను నియమించి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

ఉపాధి పనులు చేపట్టాలి

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కూలీలకు ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో పనులు లేవంటు కూలీలు చెప్తున్నారని వెంటనే పనులు గుర్తించి అప్పగించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

పశువుల కోసం 25 నీటి తొట్లు మంజూరు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పశువులకు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ పథకం ద్వారా 25 నీటి తొట్లు మంజూరైనట్లు ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. ఒక్కో నీటి తొట్టికి రూ.40వేలు ఉపాధి నిధులు అందజేస్తామని తెలిపారు. బల్లికురవ, గొర్రెపాడు, కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు, ఎస్ఎల్ గుడిపాడు, వల్లాపల్లి, వేమవరం గ్రామాలకు ఒక్కొక్కటి, గుంటుపల్లికి 2, కొప్పెరపాడుకు 3, ముక్తేశ్వరానికి 5, మల్లాయపాలెంకు 2, వైదనకు 2 చొప్పున నీటి తొట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు చేపడతామని ఎంపీడీవో తెలిపారు.

పొదుపు మహిళల జీవనోపాధి పెంపునకు ప్రణాళిక



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం రాజారావు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలోని సభ్యుల జీవనోపాధి పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలని వెలుగు ఏపీఎం రాజారావు కోరారు. బుధవారం వెలుగు కార్యాలయంలో 2025-2026 సంవత్సరాలకు గాను వార్షిక ప్రణాళికపై గ్రామాల ఎన్యూమరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రానున్న ఏడాదిలో పొదుపు సంఘాలలో ఉన్న మహిళకు కావాల్సిన వసతులపై సర్వే చేపట్టాలని, అన్ని గ్రూపుల వివరాలను సేకరించాలన్నారు. గతంలో రుణాలు పొంది ఉన్నారా, సకాలంలో చెల్లింపులు చేశారా, భవిష్యత్ అవసరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, సీసీ పేరయ్య, ఫార్మా మిత్ర అంజయ్య పాల్గొన్నారు.

చిన్న సైజు గుడ్లను కేంద్రాల వారు తీసుకోవద్దు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అంగన్ వాడీ కేంద్రాలకు చిన్న సైజులో ఉన్న కోడి గుడ్లను ఇస్తే ఎవరు తీసుకోవద్దని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ సూచించారు. బుధవారం బల్లికురవ, కొప్పెరపాడు గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశాలు జరిగాయి. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో కోడి గుడ్లు మురిగి పోయినవి వస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, జాగ్రత్తగా పరిశీలించి గుడ్లను తీసుకోవాలని తెలిపారు. 600 గ్రాముల బరువు ఉన్న గుడ్లను మాత్రమే కేంద్రాలకు తీసుకోవాలన్నారు. బాలసంజీవని యాప్‌పై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మలా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మేదరమెట్లలోని తపాలా కార్యాయలం ఉద్యోగి గంగిశెట్టి భ్రమరాంబిక తన అమ్మమ్మ మద్దా కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. దాతను క్లబ్ సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మురళీసుధాకరరావు, డాక్టర్ దేవపాలన, శివకుమారి, లేవి ప్రసాద్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలల్లో రెండు దశలలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య తెలిపారు. 3వ తేదీన వెంకటాపురం, శింగరకొండపాలెం, కుంకుపాడు, 4వ తేదిన విప్పర్లవారిపాలెం, నాగులపాడు, కోటికలపూడి, 5వ తేది పేరాయపాలెం, గోపాలపురం, వేలమూడిపాడు గ్రామాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయన్నారు. 8న ఉప్పలపాడు, ధర్మవరం, మణికేశ్వరం, 9న వెంపరాల, శంఖవరప్పాడు, కొంగపాడు, 10న బొమ్మనంపాడు కలవకూరు, రామాయపాలెం, 11న జార్లపాలెం, చక్రాయపాలెం, తిమ్మాయపాలెం గ్రామాలల్లో జరుగుతాయని, కొత్త ఆధార్, వేలిముద్రలు అప్‌డేట్, ఫోన్ నెంబర్ లింక్ వంటి సేవలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన తెలిపారు.

చినగంజాం : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి రెండు విడతలగా ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 3, 4 తేదీల్లో, రెండవ విడతగా 8, 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లోని 0 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తల సహకారంతో ఆధార్ మొబైల్ క్యాంపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ తేది సంతరావూరు, కడవకుదురు, 4వ తేది మోటుపల్లి, 8వ తేది గొనసపూడి, పల్లెపాలెం, 9వ తేదీన చినగంజాం, కొత్తపాలెం, 10వ తేదీ మున్నంవారిపాలెం, పెదగంజాం, 11వ తేది రాజుబంగారుపాలెం, పెదగంజాం గ్రామాల్లో మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు జరుగునప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆధార్ డిజిటల్ అసిస్టెంట్‌లకు ఇద్దరు సచివాలయ సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. క్యాంపులు జరుగు ముందు రోజు గ్రామాల్లో టామ్ టామ్, ఇతర ప్రసార సాధనాల ద్వారా ఆధార్ నమోదు గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో తెలిపారు.

మహిళల మెడలో బంగారు గొలుసు చోరీ

మేదరమెట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనపాలెం, మేదరమెట్లలో ద్విచక్రవాహనంపై వచ్చిన యువకులు మహిళల మెడలో బంగారు గొలుసులు తెంపుకెళ్లారు. మంగళవారం రాత్రి తిమ్మనపాలెంలో కుక్కకు అన్నపెడుతున్న వృద్ధురాలు సీతమ్మ మెడలో బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన యువకులు తెంపుకెళ్లారు. మరి కొంత సేపటి తర్వాత మేదరమెట్లలో ఒంటరిగి నడిచివెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకెళ్లారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంవల్ల దుండగులను గుర్తించలేకపోయారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ ఘటనా స్థలాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మేదరమెట్ల సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంవలన దుండగులను గుర్తించలేకపోయారు. పలు గ్రామాలకు ప్రధాన కూడలి అయిన మేదరమెట్లలో సీసీ కెమెరాలు లేకపోవడంవల్ల భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు వచ్చే అవకాశముంది. దాతల సహకారంతో సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి



అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

నెల్లూరు (హరనాధపురం, ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ రిక్రూట్ (ఎస్ఎస్ఆర్) కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ విద్యార్హతతో పురుషులతోపాటు మహిళలు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిజికల్, మెడికల్ టెస్టులతో నియామకాలు ఉంటాయని, అవకాశం వచ్చినవారు శిక్షణతో కలిపి నాలుగేళ్లు సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ఆ తర్వాత వీరిలో 25శాతం మందిని శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటారని తెలిపారు. మిగిలిన వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తారని తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యూహాత్మకంగా రైళ్లు ఆపి దోపిడీకి ప్లాన్ • 31న పరిశీలన, 1న విజయవాడలో రైళ్లు ఎక్కిన దుండగులు

మరికొందరు అల్లూరురోడ్డు వద్ద హైవేపై కాపలా • సరిగ్గా నిర్ణీత ప్రాంతానికి వచ్చాక సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్

ముందుగానే రెక్కీ!









మంగళవారం అర్ధరాత్రి ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఆర్పీఎఫ్, పోలీసులు

వాళ్లంతా పక్క రాష్ట్రాలకు చెందిన వారు. మన జిల్లా పరిధిలో రైలులో దోపిడీ కోసం అనువైన ప్రదేశాన్ని ఎంచుకున్నారు. తుపాకులు, కత్తులు వంటి మారణాయుధాలు చూపలేదు. చేతి లాఘవాన్నే ప్రదర్శించారు. అనుకున్న పని పూర్తి చేసే క్రమంలో ప్రయాణికులు తిరగబడటంతో కాలి సత్తువను చాటుకున్నారు. దొరికిన బంగారు ఆభరణాలతో మన పోలీసులకు చిక్కకుండా హాయిగా పారిపోయారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన సమయంలో అల్లూరురోడ్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో జరిగిన ఈ రైలు దోపిడీకి సంబంధించి పోలీసు అధికారులు, ప్రయాణికులు అందించిన సమాచారం మేరకు..

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

సోమవారం రాత్రి..

పక్కరాష్ట్రాలకు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అల్లూరు రోడ్డు స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న రైల్వే హోం సిగ్నల్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారిపై వాహనాలు ఆపి పొలాల గుండా నడుచుకొంటూ హోం సిగ్నల్ వైపు నడిచారు. కాసేపు అక్కడ గడిపి వారిలో వారు ఏదో మాట్లాడుకొని తిరిగి వచ్చి వాహనాలు ఎక్కి విజయవాడకు వెళ్లారు.

మంగళవారం రాత్రి ఇదే వ్యక్తులు విజయవాడ స్టేషన్‌లోకి వెళ్లారు. సుమారు ఒక పది మంది హౌరా ఎక్స్‌ప్రెస్‌లోకి, మరి కొందరు మధురై ఎక్స్‌ప్రెస్ రైలులోకి ఎక్కి స్లీపర్ బోగీల్లోకి వెళ్లారు. ఈ రెండు రైళ్లు గమ్యం వైపు బయలుదేరాయి.

వీటికన్నా కొన్ని గంటల ముందే రెండు జీపులు విజయవాడ నుంచి బయలుదేరి అల్లూరు రోడ్డు హోం సిగ్నల్‌కు సమాంతరంగా జాతీయ రహదారి పక్కన ఆగియి. సమయం గడుస్తోంది. విజయవాడ నుంచి బయలుదేరిన రైళ్లు శరవేగంగా గమ్యం వైపు దూసుకొస్తున్నాయి. ఆ రైళ్లలో ఎక్కిన దుండగులు తాము ఎక్కిన బోగీల్లోని ప్రయాణికులను నిశితంగా పరిశీలిస్తూ కూర్చున్నారు.

సమయం అర్ధరాత్రి 11 గంటలు దాటుతోంది. రైళ్లు బిట్రగుంట దాటుకొని అల్లూరురోడ్డు వైపు వస్తున్నాయి. ఇక్కడ జాతీయ రహదారి పక్కన వాహనాలను పార్కు చేసిన వ్యక్తుల పొలాల మీదుగా ముందుగా వారు నిర్ణయించుకున్న రైల్వే ట్రాక్ పక్కకు చేరుకున్నారు. ఇంకొద్ది నిమిషాల్లో రైళ్లు అక్కడకు చేరుకోబోతున్నాయి. రైలు సిగ్నల్ కోసం ఎదురుచూసే సమయంలో హోం సిగ్నల్ స్తంభం నుంచి రెడ్ లైట్ వెలిగింది. అయితే అప్పటికే హౌరా ఎక్స్‌ప్రెస్ ఆ సిగ్నల్ లైట్‌ను దాటేయడంతో ఆగకుండా వెళ్లిపోయింది.



సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

కొద్ది నిమిషాల వ్యవధిలో రెండో రైలు మధురై ఎక్స్‌ప్రెస్ వస్తోంది

ఈసారి అక్కడ కాపుకాచి ఉన్న దుండగుల గురి తప్పలేదు. దిగ్విజయంగా సిగ్నల్ ట్యాంపరింగ్ చేశారు. బ్లూ లైట్ బదులు రెడ్ లైట్ వెలిగేలా చేశారు. ఇంకేముంది... లైన్ క్లియర్ కాలేదేమోనని లోకోపైలెట్ రైలు ఆపాడు.

• ప్రయాణికుల తెగువ అద్భుతం

ఖచ్చితంగా రైలు ఆగుతుందని ముందే సమాచారం ఉన్న ఆగంతకులు శరవేగంగా కదిలారు. ముందే వారు పరిశీలించి ఎంచుకున్న వ్యక్తుల వద్దకు వెళ్లారు. మెడల్లోని బంగారు చైన్లు లాగారు. చేతిలోని బ్యాగులు లాక్కున్నారు. స్లీపర్‌కు చెందిన మూడు బోగీల్లో ఒకేసారి అటాక్ చేశారు. అన్ని బోగీల నుంచి ఒకేసారి ఆహాకారాలు మొదలయ్యాయి. ఊహించని సంఘటన నుంచి నిమిషాల్లో తేరుకున్న ప్రయాణికులు చైన్లు తెంచుతున్న దొంగలపై తిరగబడ్డారు. పట్టుకోవాలని ప్రయత్నించారు. దొంగలకు పరిస్థితి అర్థం అయ్యింది. పట్టుబడతామనే భయం కలిగింది. వెంటనే బోగీల నుంచి కిందకు దూకేశారు. ప్రయాణికులు సైతం వారిని పట్టుకోవడానికి కిందకు దిగడానికి సిద్ధపడ్డారు. వీరిని అడ్డుకోవడం కోసం ముందే అక్కడ ఉన్న వ్యక్తులు రైలు పైకి రాళ్లు విసిరారు. దీంతో ప్రయాణికులు తలుపులు, కిటీకీలు మూసేశారు. ఈ తతంగం అంతా సుమారు 20 నిమిషాలపాటు సాగింది.

ఇంతలో అక్కడ డ్యూటీలో ఉన్న గార్డు తేరుకున్నాడు. బ్లూ సిగ్నల్ ఇచ్చినా రైలు ముందుకు కదలకపోవడంతో ఏదో ప్రమాదం జరిగిందని ఊహించాడు. వెంటనే రైల్వే పోలీసులను హెచ్చరించారు. నిమిషాల వ్యవధిలో అక్కడకు రైల్వే, సివిల్ పోలీసులు చేరుకున్నారు. కానీ అప్పటికే ఈ దొంగల గుంపు ఉడాయించింది.

ఇలా పోలీసుల నుంచి సులభంగా తప్పించుకోవడానికి అనువుగా ఈ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. అందుకోసం ఒకరోజు ముందే రెక్కీ నిర్వహించారు. జాతీయ రహదారికి పక్కన ఉన్న ప్రదేశాన్ని ఎంచుకున్నారు. అలాగే ఆ ప్రదేశానికి రాత్రి బాగా చీకటి పడిన తరువాత వచ్చే రైళ్లను ఎంపిక చేసుకున్నారు. అనుకున్న పని పూర్తి చేసుకుపోయారు. పోలీసులకు అందనంత దూరం వెళ్లిపోయారు. ఈ గుర్తు తెలియని దొంగల ముఠా సభ్యులు మహారాష్ట్రకు చెందినవారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

మునిగిపోయాం.. ఇప్పుడేం చేద్దాం!

- కావలిలో ప్లాట్ల కొనుగోలుదారుల లబోదిబో
- అక్రమ లేఅవుట్లలో 128 ఎకరాలు గుర్తించిన అధికారులు
- పరారీలో రియల్టర్లు.. కొనుగోలుదారులకు నోటీసులు
- హద్దు రాళ్లు, రోడ్ల తొలగింపు.. నిర్మాణాలకు అనుమతి నిరాకరణ
- సర్వే చేసి, భూములను స్వాధీనం చేసుకుంటాం : ఆర్డీవో

8



అక్రమ లేఅవుట్‌లో తీసిన కాలువ



కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ముందు ఆందోళన చేస్తున్న ఫాప్టో నాయకులు

పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలి

- కారుణ్య నియామకాలూ చేపట్టాలి
- కలెక్టరేట్ ఎదుట ఫాప్టో నిరసన

8

నేటి నుంచి టెన్త్ 'స్పాట్'

- మూల్యాంకనానికి సర్వం సిద్ధం
- జిల్లాకు 1,92,920 సమాధాన పత్రాలు
- విధుల్లో 1,558 మంది సిబ్బంది
- సీసీ కెమెరాలతో నిఘా

8

చేతికందాల్సిన రూ.30 కోట్లు వెనక్కి

• లబోదిబోమన్న కార్పొరేషన్ కాంట్రాక్టర్లు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి) : ముగిసిన ఆర్థిక సంవత్సరంతో నెల్లూరులో వివిధ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు చేతికందాల్సిన రూ.30 కోట్లు బుధవారం వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో వారంతా లబోదిబోమంటూ కమిషనర్ సూర్య తేజ వద్ద బోరుమన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు పలువురు కాంట్రాక్టర్లు అనేక పనులు చేశారు. వీరికి తుది బిల్లుల కింద అందాల్సిన సుమారు రూ.30 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడై ఉంది. అక్కడ నుంచి ఎప్పుడైనా తమ ఖాతాల్లో నగదు జమ అవుతుందని కాంట్రాక్టర్లు గ్రహించారు. ఇంతలో ఆ మొత్తం కార్పొరేషన్‌లోని హెడ్‌ఆఫ్‌ది అకౌంట్స్‌కు వెనక్కి జమవడంతో వారంతా ఖంగుతిన్నారు. వెంటనే పరుగులు తీసి కమిషనర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని సూర్యతేజతో భేటీ అయ్యారు. ఆయన ఇచ్చిన హామీతో వారంతా వెను తిరిగారు.



హాల్‌టికెట్ల నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు ప్రారంభం

• 9వ తేదీ వరకు నిర్వహణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 2 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయ, మధ్నాహ్నం రెండు బ్యాచ్‌లుగా జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 6వేల మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నట్లు కళాశాలల నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం జొన్నవాడ రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

• నిబంధనల నడుమ పరీక్షలు....

జేఈఈ మెయిన్స్‌కు హాజరవుతున్న విద్యార్థులకు హాల్‌టికెట్‌తోపాటు పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నియమ, నిబంధనలతో కూడిన నియమావళిని ఇప్పటికే అందచేశారు. తొలిరోజు ఉదయం 7.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించి 9 గంటలకు మెయిన్ గేట్లు మూసేశారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్, పాస్‌పోర్టుసైజు ఫోటో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకుని హాజరయ్యారు. సెల్‌ఫోన్ సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌లను కేంద్రంలోకి అనుమతించలేదు. అయితే నిర్దేశిత సమయం ముగిశాక ఏడుగురు విద్యార్థులను అనుమతించలేదు.

మన సపోటాపై తమిళ వ్యాపారుల పెత్తనం!

- చెప్పిన ధరకే పంపాలని ఒత్తిడి
- వ్యాపారులు, దళారుల మధ్య నలిగిపోతున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు
- ఏడాదికేడాది తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం

ఉలవపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు సపోటాకు దశాబ్దాల కాలంగా రుచి పరంగా మంచి పేరుంది. రెండు తెలుగు రాష్ట్రాలలోని పట్టణాలలో కూరగాయల మార్కెట్ వద్ద, తోపుడు బండ్లపై, రైలు బండ్లలో వ్యాపారులు ఉలవపాడు సపోటా అని పేరు చెప్పందే కొనుగోలుదారు లను ఆకర్షించలేని పరిస్థితి. కాలక్రమేణా మామిడి, సరుగుడు, జామాయిల్ వంటి వాణిజ్య పంటలతో పోటీపడి మార్కెట్‌లో లాభాల విషయంలో సపోటా సరితూగలేక పోయింది. 30 ఏళ్ల క్రితం సపోటా వ్యాపారంలో రూ.లక్షలు సంపాదించిన రైతులు, దళారులు, వ్యాపారులు మండలంలో కళకళలాడారు. ఆరోజుల్లో సపోటా వ్యాపారంలో సంపాదించి స్థిరాస్తులు కూడబెట్టిన వాళ్లే నేడు రూ.కోట్లకు అధిపతులుగా ఉన్నారు. అయితే, రైతు మాత్రం అంతకంత సరిపెట్టుకుంటూ అలాగే మిగిలి పోయాడు. ఏడాదికి సపోటా రెండు కాపులు ఇస్తున్నా కూలీలు, సేద్యపు ఖర్చులకు తగ్గట్టు మార్కెట్లో ధర మాత్రం ఆశించినస్థాయిలో ఉండటం లేదని సాగుదారులు ఆవేదన చెందుతున్నారు.

• చెన్నై వ్యాపారుల శాసనం

ఉలవపాడులో పదికిపైగా సపోటా మార్కెట్లు ఉన్నాయి. కోతకు వచ్చిన సపోటాను బస్తాల ద్వారా ఉలవపాడు మార్కెట్‌కు రైతులే వాహనాల్లో తరలించాల్సి వస్తోంది. అధిక ధర పలికే పారిస్ సపోటా బస్తా రూ.700, బిళ్ల సపోటా రూ.550, పాల సపోటా రూ.650 నిన్నటి వరకు సాగింది. తమిళనాడులో స్థానిక సపోటా దిగుబడి రావడంతో రేట్లు తగ్గిస్తేనే సరకు రవాణా చేయాలని అక్కడి వ్యాపారులు ఆదేశించడంతో స్థానిక బ్రోకర్లు తలలు పట్టుకున్నారు. రైతు వద్ద బస్తాకు రూ.100 మార్జిన్‌తో మార్కెట్ కొనుగోలు చేస్తారు. కోత కూలి మగవారికి రూ.450, మహిళలకు రూ. 400లతోపాటు 60 కిలోల గోతాముకు రైతులు రూ.30 చెల్లించాల్సి వస్తుంది. ఇప్పుడు చెన్నై వ్యాపారుల సూచనల మేరకు ధర తగ్గించి పంపకపోతే సరకు ఇక్కడే ఆగిపోతుంది. ఇలా చేస్తే నష్టపోయేది రైతే. బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు చిత్తూరు, తాడిపత్రి నుంచి సపోటా ఎగుమతులు జరుగుతున్నందున ఉలవపాడు సపోటా ఎగుమతులకు ఏప్రిల్ రెండో వారం వరకు ఎదురు చూడాలని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

ఉలవపాడు మండలంలోని మన్నేటికోట, ఆత్మకూరు, కరేడు, చాగొల్లు, చాకిచర్ల, వీరేపల్లి గ్రామాల్లో సుమారు 2500 హెక్టార్లలో సపోటా సాగు ఉండేది. గడిచిన పుష్కర కాలంలో కాలక్రమేణా సగానికిపైగా సపోటా తోటలు నరికేసి ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. ఆత్మకూరు, మన్నేటికోట, కరేడు గ్రామాల్లో ఇప్పుడు సపోటా సాగు కనిపిస్తుంది. ఎక్కుగా పునాస మామిడి, జామాయిల్, సరుగుడు తోటలు సాగులో ఉన్నాయి. పునాస ఏడాదికి రెండు కాపులు ఇస్తు రూ. లక్షల్లో సంపాదన ఇస్తుంది. అదేవిధంగా జామాయిల్, సరుగుడు మూడేళ్లకే ఎకరాకి సుమారు రూ.2 లక్షలు వరకు లాభాలను ఇస్తుంది. ఏడాదంతా సేద్యం చేసి సాగు చేసినా ఎకరాకి రూ. 20వేలకు మించి సపోటా కాపు కొనుగోలు చేయరు. అందులో పెట్టుబడి పోగా మిగిలేది సగంలో సగం మాత్రమే. తొలి నుంచి సపోటా పంటకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు ఉండవు. విపత్తు సమయంలో చెట్లకు నష్టం కలిగితే ప్రభుత్వం నష్టపరిహారం మాత్రమే అందిస్తుంది.



సపోటా బస్తాలను మార్కెట్‌కు చేరుస్తున్న కూలీలు

లాభాలు లేకనే..

అనతి కాలంలో లాభాలు ఇచ్చే పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. పెద్దగా లాభాలు రావడంలేదని సపోటాను కాదని ప్రత్యామ్నాయ పంటలు పునాస, సరుగుడు, జామాయిల్ వైపు చూస్తున్నారు. ఉద్యాన పంటల్లో సపోటాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు ఉండవు. రైతుకు లాభసాటి అనిపించే పంటలకే ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో సపోటా చెట్ల స్థానంలో మరో పంట సాగు చేస్తున్నారు.

- బీ జ్యోతి, మండల ఉద్యాన అధికారిణి



సరైన ధర లేకనే!

ఏళ్ల తరబడి సపోటా సాగు చేస్తున్నా. గత పదేళ్లుగా పెట్టుబడికి అమ్మకానికి సరిపోతుందే తప్ప సరైన లాభాలు లేవు. అందుకే 6 ఎకరాల వరకు సపోటా చెట్లు తొలగించి జామాయిల్ సాగు చేస్తున్నా. మూడేళ్లకు కోతకు వచ్చి ఆశించిన లాభాన్ని ఇస్తుంది. పైగా మరో కోతకు సిద్ధం అవుతుంది.

- అమరనేని రాములు, సపోటా రైతు, ఆత్మకూరు గ్రామం





సపోటా చెట్లు నరికి వాటి స్థానంలో సాగు చేస్తున్న జామాయిల్

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయంలో బుధవారం 53.160 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 330, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 450



'కళారత్న అవార్డు' కావలికి గర్వకారణం : ఎమ్మెల్యే

కావలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలకుడు మాధవరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న(హంస) అవార్డు అందజేయడం కావలికే గర్వకారణమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కళారత్న అవార్డు పొందిన పట్టణానికి చెందిన ఇంద్రజాలకుడు వేములపాటి మాధవరావును బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాధవరావు 35 ఏళ్లుగా తమకు ఆత్మీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం గౌరవాధ్యక్షుడు పోతుగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు సహకరించండి

లింగసముద్రం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ కోరారు. బుధవారం మండలంలోని పెదపవని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టీ.శ్రీనివాసులుతో కలిసి ఆయన ముత్యాలపాడు హెచ్‌పీ, మెయిన్ పాఠశాలలను, ముత్తంవారిపాలెం మెయిన్, ఎస్టీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యాలపాడు మెయిన్ పాఠశాలలో ఇదే గ్రామంలోని హెచ్‌పీ పాఠశాలను, పెదపవనిలోని ఎస్టీ పాఠశాలను విలీనం చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే ముత్తంవారిపాలెం మెయిన్ పాఠశాలను అదే గ్రామంలోని ఎస్టీ పాఠశాలలో విలీనం చేసి ఎస్టీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేస్తామన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారని చెప్పారు. ఆయా గ్రామాల్లోని ఫౌండేషన్ స్కూళ్లలో 1, 2 తరగతులు ఉంటాయని, ఒక ఉపాధ్యాయుడు, ఒక అంగన్వాడీ కార్యకర్త పనిచేస్తారని చెప్పారు.

ఆస్తి పన్ను రూ.9.41 కోట్ల వసూలు

కావలి ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : కావలి పురపాలక సంఘంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను రూ.9.41 కోట్ల వసూలు చేశామని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం కన్నా రూ.1.58 కోట్లు అధికంగా వసూలు చేయడంలో తమ సిబ్బంది చేసిన కృషి చేశారని తెలిపారు. వడ్డీలో 50 శాతం రాయితీ ప్రకటించిన తర్వాత ఆరు రోజుల వ్యవధిలో రూ.1.26 కోట్ల వసూలు చేశామని పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో కృషి చేసిన ఆర్వో ఫణికుమార్, ఆర్ఐలు షేక్ షరీఫ్, సురేంద్ర సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, ఇతర కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందికి, పన్నులు చెల్లించిన ప్రజలకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

30 లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

అల్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల లబ్ధిదారులు ఈనెల 30 వతేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలాఖరు వరకు సమయం ఉన్న ఈ ప్రక్రియను ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ-కేవైసీ చేసుకోకుంటే రేషన్ సరుకులు పొందే అర్హతను కోల్పోతారని పేర్కొన్నారు.

239 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 296 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 239 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-37, ఆర్ఆర్-2, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 576 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.272.35గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి : ఏపీవో

లింగసముద్రం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీవో షేక్ సమీర్‌బాషా చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని, మిగిలిన 4 పంచాయతీల్లో కూడా పనులు ప్రారంభించాలని చెప్పారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ 100 రోజుల పనిదినాలు ఉంటాయన్నారు. బోగస్ మస్టర్లు వేసే వారిపై చర్యలు తప్పవని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఏలు రాఘవ, శ్రీకాంత్, బీఎఫ్‌టీ ఎం జక్రయ్య పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాల్పుల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒంటిపూట బడులే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ కందుకూరులో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు పాటించటం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన డిప్యూటీ డీఈఓ, ఇద్దరు ఎంఈఓలు చోద్యం చూస్తుండటం తగదని పేర్కొన్నారు. తక్షణం ఒంటిపూట బడులు నిర్వహించేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిర్మాణ పనులు ఆగిపోయిన గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం

» 10 ఏళ్లుగా తుఫాన్ షెల్టర్‌లో గిరిజన బాలికల విద్యాలయం
» సమస్యల సుడిగుండంలో మగ్గుతున్న విద్యార్థినులు
» ఆందోళనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
» కూటమి ప్రభుత్వంలోనైనా వినియోగంలోకి తెస్తారా?

గురుకులం భవనాలకు
మోక్షం కలిగేనా!?

ఉలవపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడులో గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన గిరిజన బాలికల గురుకులం భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో 10 ఏళ్లుగా బాలికలు తుఫాన్ షెల్టర్‌లో మగ్గుతున్నారు. వివరాల మేరకు.. ఎస్టీ బాలికల హాస్టల్‌ను 12 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం బాలికల గురుకుల పాఠశాలగా మార్చింది. అప్పటికే భవనం పూర్తిగా శిథిలావస్థలోకి చేరడంతో అదే స్థలంలో నూతన భవనం నిర్మాణం కోసం గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పోతుల రామారావు నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలిపించారు. నూతన భవనం నిర్మించే ఉద్దేశంతో పాత భవనంను తొలగించి చదును చేశారు. అదే పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామం తుఫాన్ షెల్టర్‌లోకి విద్యార్థినులను తరలించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవనానికి సంబంధించి నిధులు విడుదల నిలిపేసింది. టెండర్లు రద్దు చేసింది. ఆ తరువాత నాడు-నేడు కింద తొలి విడత రూ.2.64 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో 16 గదుల భవన నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లులు మంజూరు అయ్యేకొద్ది పనులు చేపడుతు సాగదీస్తూ వచ్చారు. రూ.1.15 కోట్లతో గదుల నిర్మాణం వరకు పూర్తి చేశారు.



పదేళ్లుగా బాలికల గురుకుల పాఠశాల నిర్వహిస్తున్న తుఫాన్ షెల్టర్

మంజూరైన నిధుల్లో ఇంకా సుమారు ఒకటిన్నర కోటి నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైతే పనులు చేపడతామని ఇంజనీరింగ్ అధికారులు చేబుతున్నారు. నాడు-నేడులో నూతన భవనానికి నిధులు మంజూరు చేశారు కానీ చుట్టూ ప్రహరీకి నిధులు మంజూరు చేయలేదు. ఇప్పుడు భవనం పూర్తయినా చుట్టూ ప్రహరీ గోడకు సుమారు రూ.30 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు.

● తుఫాన్ షెల్టర్‌లో బాలికల అవస్థ

గిరిజన బాలికల గురుకులాన్ని రామకృష్ణాపురం తుఫాన్ షెల్టర్‌లోకి మార్చినప్పటి నుంచి విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణాతీతం. 3వతరగతి నుంచి 10వ తరగతి వరకు ఈ ఏడాది 165 మంది విద్యార్థినులు ఉన్నారు. తుఫాన్ షెల్టర్‌లో మొత్తం నాలుగు గదులు ఉన్నాయి. ఆ గదుల్లోనే తరగతులు నిర్వహణ, హాస్టల్, వసతితో సర్దుకొంటున్నారు. కాగా మరుగుదొడ్లు నాలుగు ఉండగా రెండు మరమ్మతులకు గురయ్యాయి. వర్షాకాలంలో విద్యార్థినుల అవస్థలు వర్ణాతీతమనే చెప్పాచు. విద్యార్థినుల అవస్థలు చూసిన తల్లిదండ్రులు ఈ ఏడాది సుమారు 60 మందిని తిరిగి ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో గత నెలలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేయడంతో మరుగుదొడ్లు మరమ్మతుల కోసం రూ.3 లక్షలు మంజూరు చేయించారు.

● వచ్చే ఏడాదికైనా పూర్తయ్యేనా...

కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు, అధికారులు దీనిపై దృష్టి సారించి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటారని అధ్యాపకులు ఎదురు చూస్తున్నారు. భవన నిర్మాణ పనులు, ఫ్లోరింగ్, లైటింగ్, పెయింట్ పనులు చేపట్టి నూతన భవనం వచ్చే విద్యా ఏడిదికైనా అందుబాటులోకి తెస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీల భూముల్లో రోడ్డు వేయడం దుర్మార్గం

● సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బాధితుల ఆందోళన



సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం పెదలాటరపిలో ఎస్సీ ఎస్టీల భూముల్లో గ్రామపెత్తందార్లు దౌర్జన్యంగా రోడ్డు వేయటం దుర్మార్గపు చర్య అని, తక్షణం వారిపై చర్యలు తీసుకుని నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాధిత రైతులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సీపీఎం ఏరియా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెదలాటరపి గ్రామంలోని సర్వేనెంబరు 287లో ప్రభుత్వం 18 ఏళ్ల క్రితం భూమిలేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 20 మందికి ఒక్కొక్కరికి 90 సెంట్లు చొప్పున పట్టాలివ్వగా వారు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ భూములపై కన్నేసిన సోమినేని రవి, మువ్వా మల్లికార్జున, మువ్వా శోభన్‌బాబు, ఉప్పుటూరి నారాయణ తదితరులు అర్ధరాత్రి ఈ భూముల్లో రోడ్డువేశారని, ఇదేమి అన్యాయం అని అడిగిన నిరుపేద రైతులపై దౌర్జన్యం చేసి దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ మీ భూముల జోలికి వారు రాకుండా చర్యలు తీసుకుంటామని, యథావిధబగా సాగు చేసుకోవచ్చని హామీ ఇచ్చారు.

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ఇళ్ల బాట



విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఉలవపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు బుధవారం విద్యార్థుల ఇళ్లబాట పట్టారు. ఇటీవల 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన ఉలపాడులోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న వసతులు, బోధన గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. ఈనెల 7వ తేది నుంచి జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగు ఇస్తుందని, మధ్యాహ్న భోజనం సదుపాయం ఉందని వివరించారు. స్టడీ హవర్స్, ఐఎఫ్‌సీ ప్యానెల్స్ ద్వారా విద్యా బోధన, సైన్స్ విద్యార్థులకు మంచి ల్యాబ్, ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ద్వారా సర్టిఫికెట్, ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ క్లాసులు, స్పోర్ట్స్ నందు శిక్షణ, అత్యుత్తమ లైబ్రరీ, మినరల్ వాటర్, అనుభజ్ఞులైన అధ్యాపక బృందం ఉన్నందున మీ పిల్లలని చేర్పించాలని కోరారు. ఈ ఏడాది ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపుల బోధన తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఉంటుందని, అదేవిధంగా సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు మీడయంలో అందుబాటులో ఉన్నట్లు క్యాంపెయిన్ నిర్వహించినవారిలో అధ్యాపకులు గారపాటి గోపిచంద్ ప్రకాష్, జ్యోతి, రఫి, సుబ్బాచారి, మాధవరెడ్డి, వల్లూరయ్య తదితరులు ఉన్నారు.

వర్క్‌ఫ్రం హోం సర్వే పూర్తి చేయాలి



సచివాలయ సిబ్బందితో సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సైతం స్త్రీ పురుషులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలంలోని అన్నగారిపాలెం, పెద పట్టపుపాలెం, రుద్రకోట, సిరిపురం, చలంచర్ల గ్రామ సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వర్క్ ఫ్రం హోం సర్వే నిర్వహిస్తుందన్నారు. సర్వేలో తక్కువ ప్రోగ్రెస్ ఉన్న పంచాయతీలను విజిట్ చేస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల లోపు వారు ఇళ్ల వద్ద ఉండి ఈ సర్వేకు సహకరించాలన్నారు. ఈ సర్వేలో వారి విద్యార్హత తెలపడంతో పాటు ప్రభుత్వం కల్పించే ఉపాధి పట్ల వారి ఆసక్తిని తెలపాల న్నారు. అనంతరం సిరిపురం, చెలంచర్ల పంచా యతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.

● చెత్త సేకరణ పరిశీలన

మండలంలోని గౌరవరం, ఆనెమడుగు, తాళ్లపాలెం పంచాయతీల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం ట్రాక్టర్లను అందించింది. గౌరవరంలో ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ పనులను ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాధిక, కార్యదర్శి అఖిల, స్థానిక నాయకుడు చింతం బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆటిజం దూరం



మాట్లాడుతున్న ఐఈఆర్‌పీ ఉదయలక్ష్మి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఆటిజం దూరమవుతుందని ఐఈఆర్‌పీ కూనం ఉదయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఇస్కాలవారి వీధి ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినం సందర్భంగా హెచ్ఎం ఆర్.వేదవతి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుందని, ఇలాంటి వారిలో మానసిక ఎదుగుదల లేక సాధారణ జీవితం గడపటం కష్టంగా మారుతుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం, తీవ్రమైన భావోద్వేగాలకు గురవడం, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవటం, వారితో ఎక్కువగా గడపకపోవడం కూడా ఈ సమస్యకు కారణమన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కోటేశ్వరరావు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

● కందుకూరులో నిరసన ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కందుకూరు నియోజకవర్గంలోని పాస్టర్లు బుధవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పామూరు రోడ్డులో ఉన్న ఎస్‌వీఎస్ కళ్యాణ మండపం నుంచి పామూరు రోడ్డు సర్కిల్, ఎన్టీఆర్ విగ్రహం, పోస్టాఫీసు సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నందున పోలీసు అధికారులు వాటిని నివృత్తి చేయాలని కోరారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

'ప్రకాశం'లో ప్రేరణ కార్యక్రమం



ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ నటుడు ఎఫ్2 ఫేం ప్రదీప్ సతీమణి సరస్వతి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, మోటివేటర్ కేవీ ప్రదీప్, ఆయన సతీమణి జేసీ సరస్వతిలు స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం సాయంత్రం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పలువురి విజేతల స్ఫూర్తిదాయ కమైన కథనాలు, జీవితంలో తీవ్రంగా విఫలమై తమ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదిగిన పలువురి విజయాలను వివ రిస్తూ ఉత్తేజం నింపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌లు ప్రదీప్, సరస్వతిల ప్రసంగాలు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని రగిలించిందని, విద్యార్థుల భవితకు దిక్సూచిగా నిలిచే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్‌ప్రిన్సిపాల్ వి. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం మార్పు



నూతన భవనం ప్రారంభిస్తున్న తపాలా శాఖాధికారి

కలిగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరు గ్రామంలోని తపాలా కార్యాలయాన్ని బుధవారం కేసీ కాంప్లెక్స్‌లోని అద్దె భవనంలోకి మార్చినట్లు ఆ శాఖ కావలి డివిజన్ ఏఎస్‌పీ ఆర్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కళ్యాణ్ రావు, ,సర్పంచ్ గొట్టిపాటి భవాని, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ, గెనేడి పెంచలనరసింహం, ఖాతాదారులు, గ్రామస్థులు ప్పాల్గొన్నారు.

కావలిలో 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్'



ప్రభుత్వ వైద్యశాల పక్కన శుభ్రపరిచిన రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణకుమార్

కావలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలి ఏరియా వైద్యశాల పక్కన అపరిశుభ్రంగా యూరినర్స్‌తో కంపుకొడుతున్న రోడ్డును మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు. ఆప్రాంతమంతా శుభ్రం చేసిన తర్వాత దుర్గంధం రాకుండా బ్లీచింగ్, సున్నం చల్లి ఎవరూ యూరినర్స్ పోయకుండా అందంగా ముగ్గులు వేశారు. అలాగే అంబేడ్కర్ పార్కును కూడా శుభ్రపరచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణకుమార్, ఆయా వార్డుల సచివాలయ వానిటరీ కార్యదర్శులు, వార్డు ఇన్‌చార్జిలు, ఏరియావైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి అందించిన సమాచారం మేరకు లింగసముద్రం పంచాయతీ బలిజపాలెం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.16,140 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం నారాయణ తెలిపారు.

నేటి నుంచి టెన్త్ 'స్పాట్'

- మూల్యాంకనానికి సర్వం సిద్ధం
- జిల్లాకు 1,92,920 సమాధాన పత్రాలు
- 1,558 మంది సిబ్బంది

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముగిసిన పదో తరగతి పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి జరగనుంది. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 9వతేదీ వరకు నిరవధికంగా మూల్యాంకనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వివిధ జిల్లాలకు చెందిన 1,92,920 సమాధాన పత్రాలు జిల్లాకు చేరాయి. వీటి మూల్యాంకనానికి విద్యాశాఖ 1,558 మంది సిబ్బందిని నియమించింది. 174 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 1036 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 348 మంది స్పెషల్ అసిస్టెంట్లు 'స్పాట్' విధులు నిర్వహించనున్నారు. అయితే వీరిలో కొందరు వ్యక్తిగత కారణాలతో విధులకు హాజరు కాకపోతుండటంతో వారి వద్ద రాతపూర్వకంగా వివరణ తీసుకుని వారి స్థానంలో మరొకరి నియమించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం జరగనుంది. ఒక్కో ఉపాధ్యాయుడు కనీసం రోజుకు 45 నుంచి 50 జవాబు పత్రాలను మూల్యాకనం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

సీసీ కెమెరాల ఏర్పాటు...

మూల్యాంకనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సిబ్బంది పనితీరు పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరేట్‌కు అనుసంధానించారు. ఉపాధ్యాయులు విధులు నిర్వహించకపోయినా, గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నా, ఇతర సమస్యలే మున్నా ఈ కెమెరాల ద్వారా గుర్తించనున్నారు. అలాగే విధుల్లో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని, ఒకవేళ మొబైల్‌లో మాట్లాడుతూ కనిపిస్తే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. కాగా, మూల్యాంకనం ఏర్పాట్లను డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు పరిశీలించారు.


మూల్యాంకన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు


నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్ గేటు వద్ద ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించండి

- డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నెల్లూరు రీజియన్‌లోని అన్ని డిపోలలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టీ మురళీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చెంచయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని డిపోల్లో రెండు రోజులు నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇందులో భాగంగా విధుల్లో రెడ్ బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. 1/1019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్కాష్ మెంట్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వంగానీ, సంస్థగానీ కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు

నేటి నుంచి హాల్ టికెట్లు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లను గురువారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ టీ పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆ విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు పరీక్ష జరుగుతుందన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 13న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశానికి అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

కలెక్టరేట్‌లో మరుగుదొడ్లకు తాళం

- సందర్శకులకు అవస్థలు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రాంగణంలో వందలాది మంది వినియోగించుకుంటున్న నగర పాలక సంస్థ మరుగుదొడ్లకు తాళం పడింది. ఈ మరుగు దొడ్ల పర్య వేక్షణ చూసే ఒక మహిళకు రెండు నెలలుగా జీతం ఇవ్వకపో వడంతో ఆమె ఆ మరుగు దొడ్లకు తాళం వేసి వెళ్లినట్లు సమాచారం. కలెక్టరేట్‌కు నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుం టారు. వారు ఆ మరుగుదొడ్లను వినియోగించుకుంటుంటారు. అయితే రెండు రోజులుగా తాళం వేయడంతో అత్యవ సరమైన వారు ఇబ్బంది పడుతున్నారు. మూతపడిన మరుగుదొడ్లను తెరిపించాలని కోరుతున్నారు.


కలెక్టరేట్ ప్రాంగణంలో తాళం వేసి ఉన్న నగర పాలక సంస్థ పబ్లిక్ టాయిలెట్లు

ఇది నిజమేనా...?



ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉదయ గిరి 4 కిలోమీటర్లని జాతీయ రహదా రి అధికారులు మైలురాయి ఏర్పాటు చేశారు. కాగా, విద్యుత్ సబ్‌స్టేషన్, గండిపాళెం మార్గంలో ఏర్పాటు చేసిన సర్కిల్ వద్ద నుంచి ఉద యగిరి సుమారు 1.5 నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలోనే ఉం టుంది. అయితే మైలురాయిపై 4 కిలోమీటర్లని నమోదు చేశారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే కొత్త వ్యక్తులు ఈ మైలురాయిని చూసి అయోమయానికి గురవుతున్నారు.


తుమ్మలపెంట రోడ్డులో అక్రమ లేఅవుట్

మునిగిపోయాం..

ఇప్పుడేం చేద్దాం!

- కావలిలో ప్లాట్ల కొనుగోలుదారుల లబోదిబో
- అక్రమ లేఅవుట్లలో 128 ఎకరాలు గుర్తించిన అధికారులు
- పరారీలో రియల్టర్లు.. కొనుగోలుదారులకు నోటీసులు
- హద్దు రాళ్లు, రోడ్ల తొలగింపు.. నిర్మాణాలకు అనుమతి నిరాకరణ

కావలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో కావలిలో ఇష్టానుసారంగా వెలసిన లేఅవుట్లలో అక్రమాలు వెలుగు చూడటంతో కొనుగోలుదారులు సతమతం అవుతున్నారు. మామూళ్ల మత్తులో నాడు అక్రమ లేఅవుట్లు, లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అధికార యంత్రాంగం, పాలకవర్గం ప్రోత్సహించడంతో కావలి నియోజకవర్గంలో వందకిపైగా అక్రమ లేఅవుట్లు వేసి పోటాపోటీగా ప్లాట్లు విక్రయించి దొరికిన కాడికి దోచుకుని జేబులు నింపుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రస్తుతం పాలకవర్గం ఒత్తిడితో అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపిస్తున్న అధికార యంత్రాంగం ఎన్నో అక్రమాలను గుర్తించింది. లేఅవుట్ యజమానులు పత్తాలేకుండా పోవడంతో అధికారులకు కొనుగోలుదారులకు నోటీసులు ఇస్తున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా అక్రమ లేఅవుట్లలో 128 ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలో ఉన్నాయని గుర్తించిన అధికారులు అవి ఎక్కడ ఉన్నాయో ఇంకా పూర్తిగా తేల్చడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ చేయలేదు.

128 ఎకరాల ప్రభుత్వ స్థలం ఎక్కడ?

అక్రమ లేఅవుట్లలో గుంటలు, కాలువలు, వాగులు, వంకలు సుమారు 128 ఎకరాల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి లేఅవుట్లలో కలుపుకుని విక్రయించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు సర్వే చేసి కొంత స్థలాన్ని గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. అయితే దానిని స్వాధీనం చేసుకోలేదు. మిగిలిన స్థలం ఎక్కడుందో ఇంకా పూర్తిగా గుర్తించలేదు. మార్కింగ్ చేసిన స్థలం కూడా ఆ మార్కింగ్ చెదిరి పోవడంతో లేఅవుట్లలో ప్రభుత్వ స్థలం ఎక్కడుందో తెలియక క్రయవిక్రయాలు పూర్తిగా ఆగిపోయాయి. అయితే ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మాత్రం ఈ ప్రభుత్వ స్థలం మన ప్లాట్లలో ఏమైనా ఉందా అనే ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి దానిని స్వాధీనం చేసుకోవటంలో అధికారులు ప్రకటన చేసినప్పుడు ఉన్నంత హుషారు ఆ తర్వాత కనిపించడం లేదు.


అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్లను . ధ్వంసం చేస్తున్న ఎక్స్‌కవేటర్

నిర్మాణాలకు అనుమతి నిరాకరణ

నాటి పాలకులు, అధికారుల అండతో ఇబ్బడి ముబ్బడిగా అక్రమ లేఅవుట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపించారు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు దారులకు నోటీస్‌లు ఇచ్చి హద్దు రాళ్లు, రోడ్లను కొంత మేరకు తొలగించారు. అక్రమ లేఅవుట్లపై ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని అధికారులు ప్రకటించారు. దీంతో ప్లాట్ల క్రయ విక్రయాలు, నిర్మాణాలు పూర్తిగా ఆగిపోవటంతో ఆ రంగాన్ని నమ్ముకుని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్న ఎంతోమంది ఆర్థికంగా దెబ్బతిన్నారు. ప్రభుత్వానికి పన్నుల రూపంలో వివిధ రకాలుగా వచ్చే ఆదాయం తగ్గిపోయింది.

సర్వే చేసి, స్వాధీనం చేసుకుంటాం!

అక్రమ లేఅవుట్లను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం. వాటిని క్రమబద్ధీకరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలు 128 ఎకరాలు కలుపుకున్నారని తాను బాధ్యతలు తీసుకోక ముందే అధికారులు ప్రకటించారు. వాటిపై సర్వే చేపట్టి ఇప్పటి వరకు 90 ఎకరాలకు మార్కింగ్ చేశాం. త్వరలో వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. మిగతా భూమి కూడా త్వరలో సర్వే చేసి గుర్తించి స్వాధీనం చేసుకుంటాం.

- ఎం. సన్నీవంశీకృష్ణ, ఆర్డీవో, కావలి

తయారీదారులను వదిలేసి మామీద పడతారేం!

- మున్సిపల్ అధికారిని నిలదీసిన వ్యాపారులు
- వాగ్వాదం... కావలి ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ

కావలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : 'ప్లాస్టిక్ కవర్లు తయారు చేస్తున్న వారిని వదిలేసి, కిరాణాదుకాణాలపై పడి దౌర్జన్యాలు ఎందుకు చేస్తారు.' అంటూ కావలిలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వ్యాపారులు నిలదీశారు. ఈ వివాదం చినికిచినికి పెద్దదవడంతో ఈ పంచాయితీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చెంతకు చేరింది. అసలేం జరిగిందంటే.. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు పట్టుకునేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి ట్రంకురోడ్డులోని ఏబీసీ ప్రొవిజన్ దుకాణానికి వెళ్లారు. అనుమతులు లేకుండానే శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో చెప్పులు వేసుకుని దుకాణం లోపలకు వెళుతుండటంతో దుకాణ యజమాని అభ్యంతరం తెలిపారు. దీంతో వారు తనిఖీ చేసే అధికారం తమకు ఉందని దురుసుగా మాట్లాడటంతో అక్కడ వాగ్వివాదం జరిగింది. ఇంతలో కిరణా మర్చంట్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు బలసా ప్రసాద్ అక్కడకు చేరుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడారు. అసలు ప్లాస్టిక్ కవర్లు తయారు చేసే వారిని వదిలి ఇలా కిరాణా దుకాణాలలోకి వచ్చి మీ దౌర్జన్యాలే మిటని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరగటంతో ఇతర వ్యాపారులంతా అక్కడకు చేరుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల వ్యాపారాలు చేసే పెద్ద పెద్ద దుకాణాల నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటూ కిరాణా దుకాణాలపై పడి వేధించడం ఏమిటని అధికారులను ప్రశ్నిం చారు. దీంతో వారు తాము ఎక్కడ మామూళ్లు తీసుకున్నామో నిరూపించగలవా అని ఎదురు ప్రశ్నించటంతో వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుంది. స్థానికులు చొరవ తీసుకుని సర్దుబాటు చేయటంతో సమస్య సర్దుమణిగింది. దీంతో బుధవారం కిరాణా వ్యాపారులు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను పిలిచి వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా విధులను నిర్వర్తించాలని సూచించినట్లు తెలిసింది.

నుడాతో జిల్లా సమగ్రాభివృద్ధి

- మంత్రి నారాయణ


మాట్లాడుతున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నుడాతో జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తు న్నట్లు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీసీ సూర్యతేజ, కందూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో విజయవాడలోని మంత్రి చాంబర్‌లో బుధవారం సమీక్ష జరిపారు. కలెక్టరు ఆనంద్, జేసీ కార్తీక్ టెలీకా న్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ కందుకూరులో ఎంఐజీ లేఅవుట్లకి ప్రభుత్వ స్థలాలు గుర్తించి వెంటనే నుడాకి అప్పగించాలని ఆదేశించారు. లేఅవుట్ల ద్వారా వచ్చే నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వ స్థలాలను గుర్తించి నుడాకి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరు మాట్లా డుతూ ఇప్పటికే కొన్ని ప్రభుత్వ స్థలాలను గుర్తించి నుడాకి సమా చారం ఇచ్చామని, వాటిలో అనువైన స్థలాలను నుడా గుర్తిస్తే వారికి అప్పగిస్తామని చెప్పారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నుడాని నెంబరు వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమా వేశంలో డీటీసీపీ విద్యుల్లత, సీపీవో హిమబిందు పాల్గొన్నారు.

డైట్ అధ్యాపక దరఖాస్తుల్లో మార్పులు

నెల్లూరు(విద్య) : ఎల్లిపాడు డైట్ కళాశాలలో అధ్యాపక ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల సమ ర్పణలో స్వల్ప మార్పులు చేసినట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు ఓ ప్రక టనలో పేర్కొన్నారు. డిప్యుటేషన్ పద్ధతిలో అధ్యాపకులుగా పనిచేయా లనుకునే స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ఈ నెల 10వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులో పేర్కొన్న వివరాలతో పాటు నమోదు చేసిన విద్యార్హతలకు సంబంధించిన జెరాక్స్ కాపీలను హెచ్ఎంలుగానీ, ఎంఈవోల ద్వారాగానీ ఈనెల 11వతేదీ లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలన్నారు.

పీజీ కోర్సులకు వేళాయే..!

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

పొదలకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని 17 వర్సిటీలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో ఈ కోర్సుల్లో ఏపీ పీజీసెట్-2025 ద్వారా ప్రవేశాలు కల్పించనుంది. ఈ విద్యా సంవత్సరం తిరుపతిలోని ఎస్వీయూ పీజీ సెట్ నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించింది.

ప్రవేశ పరీక్ష ఇలా..

పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ విద్యార్థులకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 45 శాతం మార్కులు వచ్చి డిగ్రీలో ఉండాలి. ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. 100 ప్రశ్నలకు వంద మార్కులు ఉంటాయి. 90 నిమిషాల్లో సమయం ఇస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు. విశ్వ విద్యాలయాల్లో ఉన్న కోర్సులను మూడు కేటగిరిలుగా విభజించి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. కాగా ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 2 (బుధవారం) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 9 నుంచి 13 వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.



కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ముందు ఆందోళన చేస్తున్న ఫాప్టో నాయకులు

పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఫాప్టో నిరసన

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు 12వ పీఆర్సీ, ఐఆర్ 30 శాతాన్ని వెంటనే విడుదల చేయాలని ఫాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి 21 నెలలు పూర్తయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయక పోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. ఐదేళ్లుగా కారుణ్య నియామకాలు లేక మరణించిన ఉద్యోగుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. కేంద్రం ప్రకటించే డీఏలకు అను బంధంగా ఇచ్చే డీఏలు మూడు, ఇప్పటికే ప్రకటించిన 5 డీఏల బకాయిలు కూడా పెండింగ్ ఉన్నాయన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో కోచైర్మన్లు మురళీకృష్ణ, మాస ప్రసాద్, భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ వీవీ శేషులు, నరసింహం, హజరత్, పిచ్చిబాబు, నాయకులు ఎన్‌వీ రమణయ్య, సురేంద్ర, మణి సుబ్బు, దశరథరాములు, చలపతిశర్మ పాల్గొన్నారు.

శభాష్ స్టూడెంట్స్!

- జిల్లాస్థాయి ఎక్స్‌పోలో రెండు ప్రాజెక్టుల ఎంపిక
- విద్యార్థులకు డీఈవో అభినందన

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈఎండీపీ ఆధ్వర్యంలో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. అతిథిగా హాజరైన డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ గతేడాది ఎన్‌జీవోల ఆధ్వర్యంలో విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం పెంచేలా జిల్లాలోని ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఆ శిక్షణ పూర్తయిన ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. దీంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు తయారు చేసిన ఎనిమిది ప్రాజెక్టులను ప్రస్తుతం ప్రదర్శించినట్లు చెప్పారు. వీటిలో ఒట్టూరు ఏపీఎంఎస్‌కు చెందిన విద్యార్థులు తయారు చేసిన గుర్రపుడెక్క ఆకులను ఎండబెట్టి తయారు చేసిన యోగా మ్యాట్‌కు ప్రథమ బహుమతి, పెదపవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు రాగి, బెల్లం పిండితో కలిపి తయారు చేసిన కప్పులకు ద్వితీయ స్థానం లభించాయని తెలిపారు. ఆ రెండు పాఠశాలల విద్యార్థులతోపాటు ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులంద రినీ అభినందించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈఎండీపీ జోనల్ మేనేజర్ నీలిమ, డీసీఈబీ కార్యదర్శి టీవీ రామ్‌కుమార్, ఆత్మకూరు డిప్యూటీ ఈవో ఎం జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు ఏ రాజు, వీ వెంకటేశ్వర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులతో డీఈవో బాలాజీరావు, ఉపాధ్యాయులు

5న జగ్జీవన్‌రామ్ జయంతి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5న భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 గంటలకు వేదాయపాళెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్ప మాల అలంకరణ, 10 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సభ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

స్పెషల్ డ్రైవ్‌తో ఈకేవైసీ పూర్తి చేయిస్తాం

- నూతన డీఎస్వో విజయకుమార్


విజయకుమార్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ ప్రక్రియను స్పెషల్ డ్రైవ్ ద్వారా వేగంగా పూర్తి చేయిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్ విజయ్‌కుమార్ చెప్పారు. డీఎస్వోగా ఆయన మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రేషన్ డీలర్ల వద్ద, ఎండీయూ వాహనాల వద్ద, సచివాలయాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కార్డుదా రులందరికీ ఈకేవైసీ పూర్తి చేయిస్తామని తెలిపారు. సచివాలయాల్లో కొందరు సిబ్బంది తమ వద్ద లాగిన్ లేదని, డీలర్ల వద్దకు వెళ్లాలని చెప్పడం సరికాదన్నారు. సచివాలయాల్లో కచ్చితంగా ఈకేవైసీ జరుగుతుందని చెప్పారు. సచివాలయాల్లో ఈకేవైసీ చేయకపోతే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెలాఖరు వరకు ఈకేవైసీ చేయించుకోవడానికి గడువు ఉందని తెలిపారు. కాగా, విజయకుమార్ రామాయపట్నం పోర్టుకు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ డీఎస్వోగా బదిలీ అయ్యారు.

వైద్య ఆరోగ్యశాఖ ఏవోగా నిషాంత్

- చిన్న వయసులోనే బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న నిషాంత్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పరిపాలన అధికారిగా ఎస్‌వీ నిషాంత్ రెడ్డి నియమితులయ్యారు. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్- 1 పరీక్ష రాసి నేరుగా వైద్య ఆరోగ్యశాఖ ఏవోగా గత నెలలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏవోగా పనిచేసిన వారంతా 50 ఏళ్లు పైబడిన వారేకాగా నిషాంత్ 30 ఏళ్లకే ఆ బాధ్యతలు చేపట్టడం గమనార్హం. పల్నాడు జిల్లాకు చెందిన నిషాంత్ రెడ్డి మొదట బ్యాంకు పరీక్షలు రాసి 2018 నుంచి బ్యాంకు అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-1లో విజయంతో వైద్య ఆరోగ్యశాఖ పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

ఐఏబీ సమావేశం

నిర్వహించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్‌కు ఎమ్మెల్యే సోమిరెడ్డి లేఖ

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండో పంటకు నీటి కేటాయింపులకు సంబంధించి ఐఏబీ సమావేశం నిర్వహించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం లేఖ రాశారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 53.374 టీఎంసీలు, కండలేరులో 48.517 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ఈ డ్యాంలలో డెడ్ స్టోరేజీ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు పోను కనీసం 60 టీఎంసీలకు పైగా జలాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతుల కోరిక మేరకు రెండో పంటకు నీటి కేటాయింపులకు సంబంధించి ఐఏబీ నిర్వహణకు చర్యలు తీసుకో వాలని మంత్రిని కోరారు. అలాగే కలెక్టర్ ఆనంద్‌కు కూడా లేఖ ప్రతిని పంపారు.